21 జూన్ 2026

# కథానిధి


# ఆదివారం కథలు

సమర్పణ:

కె.ఎ. మునిసురేష్ పిళ్లై, 99594 88088,

| | | | |
|---|---|---|---|
| సాక్షి ఫన్‌డే | త్రిపుర రాయని కథ | ప్రసేన్ | 70133 58154 |
| ఆంధ్రజ్యోతి ఆదివారం | నాన్న నాన్నే | జి.ఉమామహేశ్వర్ | 98498 02521 |
| ఈనాడు ఆదివారం | నాన్న | సలీం | 75886 30243 |
| నమస్తే తెలంగాణ బతుకమ్మ | మరో గాలివాన | బట్టేపాటి జైదాస్ | 94925 78581 |
| విశాలాంధ్ర | రెక్కలొచ్చిన పక్షి | యలమర్తి అనురాధ | 92472 60206 |
| నవతెలంగాణ సోపతి | శిథిలస్వప్నం | సయ్యద్ ముజాహిద్ అలీ | |
| వార్త | చీలినదారులు | బొల్లిముంత వెంకటరమణారావు | 93475 92054 |
| ప్రజాశక్తి స్నేహ | ఉత్తమ గ్రంథం | మొలకలపల్లి కోటేశ్వరరావు | 99892 24280 |
| వార్త | బడిబాట | అచ్యుతుని రాజశ్రీ | |
| ప్రజాశక్తి స్నేహ | పార్కు | కొరికాన ఆనంద్ | 96184 25970 |
| సాక్షి ఫన్‌డే | సదారోగి | మల్లాది వెంకటకృష్ణమూర్తి | |
| గతవారం కథానిధి సమీక్ష | సమకాలీన జీవిత చలనచిత్రం | భూక్యా గోపి నాయక్ | 99891 59196 |

మరికొన్ని బాలల కథలు



కథా ప్రియులకు నమస్తే..

ముందుగా ఫాదర్స్ డే శుభాకాంక్షలు.

చాలా పత్రికలు ఇవాళ.. ఫాదర్స్ డే స్పెషల్ గా నాన్నల గురించిన మంచి కథలను అందించాయి. అందరూ చదివి ఆస్వాదించండి.

ఈ ఆదివారం (21 జూన్ 2026) కథల సంకలనం 47 పేజీల కథానిధి పీడీఎఫ్ లో మొత్తం 11 కథలు, అదనంగా 11 పిల్లల కథలు ఉన్నాయి. సావకాశంగా చదవండి.. రచయితలకు మీ అభిప్రాయాలు తెలియజేయండి.

కథానిధి పాఠకులకు ఈ వారం నుంచి మరో వెసులుబాటు అందిస్తున్నాము. గతవారం కథానిధి సంకలనంలోని అన్ని కథల గురించిన సమగ్రమైన సమీక్ష వ్యాసం.. ఇకపై ప్రతివారం ఈ సంకలనంతో పాటు మీకు అందుతుంది. ప్రముఖ కథారచయిత భూక్యా గోపి నాయక్ ప్రతివారం 'కథా నిధి'లోని అన్ని కథలను సమీక్షించి అందించనున్నారు. పాఠకులు ఈ సమీక్ష చదివి.. గతవారంలో మీరు మిస్సయిన కథలు ఏమైనా ఉంటే చదువుకోవచ్చు. ఈ ప్రయత్నం కథా ప్రియులకు ఎంతో ఉపయోగపడుతుందని నా నమ్మకం. ప్రతివారం 'కథానిధి' సమగ్ర సమీక్షను అందించేందుకు అంగీకరించిన గోపీ నాయక్ కు కృతజ్ఞతలు. ఈ వారం.. 31వ పేజీలో ఈ వ్యాసం ఉంటుంది.

కథానిధి వాట్సాప్ గ్రూపులో మీరు నేరుగా మీ మిత్రులను చేర్చవచ్చు. మీరు జాయినింగ్ లింక్ పంపితే వారు కూడా నేరుగా చేరవచ్చు.

మీ

కె.ఎ. మునిసురేష్ పిళ్లై

99594 88088

- కథలు చదవండి.
- చదివే ఆసక్తి ఉన్న మిత్రులకు ఈ పీడీఎఫ్ షేర్ చేయండి.
- కథలు నచ్చితే రచయితలకు మీ స్పందనలు తెలియజేయండి. మెసేజీ అయినా పెట్టండి.
- కథలు చదివి వదిలేయకండి. మంచి కథల గురించి మీ మిత్రులతో కూడా ముచ్చటించండి. వారికి కూడా చదివే ఆసక్తి పుట్టవచ్చు.
- సాహిత్యప్రియులు ***https://kathavasudha.com*** లింక్ లోకి వెళ్లిగానీ, దిగువ పేజీలో ఇస్తున్న *QR code* ను స్కాన్ చేయడం ద్వారా గానీ కథావసుధ వెబ్ మేగజైన్ లోని అనువాద కథలు, అనువాద కవితలు, సాహిత్యవ్యాసాలను చదవండి.
- ఆయా దినపత్రికల సౌజన్యంతో

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# ఈవారం కథ




● ప్రసేన్

“నీ రచనల్లో ప్రధాన లోపం నిజాయితీ. నీ ఉద్వేగ ప్రకటనలన్నీ నాటకాలు. వ్యక్తిగా రచయితగా నీవి రెండు వేర్వేరు పాత్రలు. నువ్వు జనం కోసం రచన చేస్తున్నట్టు నటిస్తూ పేరు కోసం చూస్తావు. నాకు ఇటువంటి హిపోక్రసీ ఉండదు” కంప్యూటర్ స్క్రీన్ మీద ఫ్లాష్ అయిన వాక్యాలు రచయిత రఘుపతికి కోపం తెప్పించాయి.

ఈ వాక్యాల వెనుక ఓ కథ ఉంది. అవును, నిజంగానే ఓ కథ ఉంది.

• • •

“కథ ముగించడం ఇంత కష్టమా. ఇన్ని సంవత్సరాలుగా వందల కథలతో ఎప్పుడూ ఇబ్బంది పడలేదే” తనలో తను గొణుక్కుంటూ రఘుపతి సిస్టం మీద నుంచి విసుగ్గా లేచాడు. గదిలో తోచని పచార్లు చేశాడు. సిగరెట్ సగమైనా కాలకుండానే కోపంగా విసిరి కొట్టాడు.



రఘుపతిని ఇంత ఇబ్బంది పెడుతున్నది అతను రాస్తున్న కొత్త కథ ముగింపు.

రఘుపతి పాపులర్ రచయిత. పాఠక సామాన్యం అతని కథలను ఎగబడి చదువుతారు. ఒక సుదీర్ఘ సాహిత్య ప్రయాణం తరువాత కూడా సీరియస్ సాహిత్య లోకం తనను గుర్తించకపోవడం ఒక లోటుగా భావించాడు. అందుకే ఒక గొప్ప కథ రాయాలనుకున్నాడు. తను కూడా సీరియస్ రచయితే అని రుజువు చేసే గొప్ప కథ రాయాలనుకున్నాడు. అయితే గొప్ప కథ అంటే ఏమిటో స్పష్టమైన నిర్వచనం రఘుపతికీ తెలియదు. ఇదిగో అదే ఆ కొత్త కథ. తను గొప్పది అనుకుంటున్న కథ. ముగింపు ఇంకా దొరకని కథ. ఎన్ని ముగింపులు రాసుకున్నా అవి తనకే నచ్చని కథ. అందుకే అసహనం.

“ఏంటండీ అంత చిరాగ్గా ఉన్నారు” కాఫీ కప్పు టేబుల్ మీద పెడుతూ రఘుపతి భార్య కల్యాణి అడిగింది.

సాధారణంగా తన రచనల గురించి కల్యాణే కాదు ఎవరితోనూ చర్చించడం కానీ, వాళ్ల సలహాలు తీసుకోవడం కానీ రఘుపతికి ఇష్టం ఉండదు.

“కొత్త కథకు ముగింపు కుదరడం లేదు కల్యాణీ” అన్నాడు.

కల్యాణికి షాక్. కథ గురించి ఈయన నాతో ప్రస్తావించడమేమిటి? అని ఉబ్బితబ్బిబ్బయి “అంత ఇబ్బందేముంది ఏఐని అడగండి” అని వెళ్లిపోయింది. ఇంకా ఉంటే ఇంకేం ప్రమాదం వచ్చి పడుతుందోనని భయపడుతూ.

ఈసారి షాక్‌కు గురికావడం రఘుపతి వంతైంది. కల్యాణి ఏంటి ఇంత అలవోకగా పరిష్కారం చెప్పింది. ఇలా కూడా ఉంటుందా. అయినా నా కథకు ఏఐ ఎలా ముగింపునిస్తుంది. నేను ఊహించిన పదికి పైగా ముగింపులు నాకే నచ్చలేదే, అంతకంటే మంచి ముగింపు ఏఐకి ఎలా తడుతుంది. అసాధ్యం కదా. అయినా కథ విషయంలో ఏఐ నా కంటే గొప్పదా. రఘుపతి లోపల ఒక బలమైన సంఘర్షణను సృష్టించింది కల్యాణి సలహా.

మెల్లగా కంప్యూటర్ వైపు కదిలాడు. ఎప్పుడూ కాఫీ అపురూపంగా తాగేవాడు ఆ కాఫీ చల్లారిపోతోందన్న సంగతి కూడా పట్టించుకోలేదు. తన కథ ముగింపు ఏఐని అడగడం అనే ఆలోచనే అతనికి నచ్చడం లేదు. అడగాలో లేదో నిర్ణయించుకోలేక పోతున్నాడు. సందిగ్ధం, సంశయం. వేళ్లు తడబడుతున్నాయి. చేతులు వణుకుతున్నాయి. అయినా ఏఐ మోడ్‌లోకి వెళ్లి అసంపూర్ణ కథ ప్రాంప్ట్‌గా ఇచ్చి ముగింపు అడిగాడు.

నాలుగంటే నాలుగే సెకన్లు.

రఘుపతి మొహం మాడిపోయింది. అవాక్కనే మాటకు అసలైన అర్థంలా మారింది ఆ మొహం. నోట మాట రాలేదు. నాలుగే సెకన్లలో ఏఐ తన సమాధానంగా కథకు ముగింపును చెప్పింది. నాలుగు సెకన్లలో చెప్పినందుకు కాదు రఘుపతి అవాక్కయింది. ఆ ముగింపు తను ఊహించనిదీ తను గత పదిరోజులుగా తర్జన భర్జన పడుతూ ఇచ్చుకున్న ముగింపులకంటే భిన్నమైనదీ అన్నింటి కంటే ముఖ్యంగా తను ఎటువంటి ముగింపు కోసం ఇన్ని రోజులుగా తన్నుకుంటున్నాడో అక్షరాలా అలాంటి ముగింపే అది.

నిజం చెప్పాలంటే రఘుపతి ఈగో హర్టయింది. నేను ఊహించలేని ముగింపును ఒక నిర్జీవ కంప్యూటర్ ఎలా ఇవ్వగలిగింది. అసలు కంప్యూటర్ ఆలోచించడమేమిటి నాన్సెన్స్. నా కంటే ఏఐ ఎలా గొప్పదిలాంటి ప్రశ్నలు రఘుపతి మెదడులో జోరీగలయాయి. కాఫీ చల్లారిపోయిందన్న విషయం కూడా మరిచిపోయి గటగటా తాగేశాడు. కథకు మంచి

ముగింపు దొరికిన ఆనందం కన్నా ఏఐ ఇవ్వగలిగిన ముగింపును తను ఎందుకు ఇవ్వలేకపోయానన్న బాధే రఘుపతిని వేధిస్తోంది.

ఏఐతో అమీ తుమీ తేల్చుకోవాలనుకున్నాడు. "నేను గొప్పా నువ్వు గొప్పా" ఏఐని అడిగేశాడు.

"నిస్సందేహంగా నువ్వే" గాయానికి మలాం పూస్తూ ఏఐ సమాధానం.

"మరైతే నేను ఇవ్వలేని ముగింపు నువ్వు ఎలా ఇచ్చావ్"

"నీ రచనల్లో ప్రధాన లోపం నిజాయితీ, నీ ఉద్వేగ ప్రకటనలన్నీ నాటకాలు. వ్యక్తిగా రచయితగా నీవి రెండు వేర్వేరు పాత్రలు. నువ్వు జనం కోసం రచన చేస్తున్నట్టు నటిస్తూ పేరు కోసం చూస్తావు. నాకు ఇటువంటి హిపోక్రసీ ఉండదు" ఇవీ రఘుపతి గాయం మీద ఉప్పు రుద్దిన వాక్యాలు.

"నా ప్రశ్నకు ఇది సమాధానం కాదేమో"

"సరిగా ఆలోచించు. అదే సరైన సమాధానం "

"భావోద్వేగ అనుభవం గొప్పదా, దాని వ్యక్తీకరణ సౌందర్యం గొప్పదా?" అడిగాడు రఘుపతి.

"భావోద్వేగం ఉన్నా లేకున్నా ఉన్నట్టు వ్యక్తీకరించగలగడం గొప్ప" ఏఐ సమాధానం.

"మరైతే నేనెక్కడ విఫలమయ్యాను" అడిగాడు రఘుపతి తనను తాను కొంచెం తగ్గించుకుని.

"నువ్వు విఫలం కాలేదు, నీ సృజననే నువ్వు పూర్తిగా అర్థం చేసుకోలేదు. నేనిచ్చిన ముగింపు నీ సాహిత్య జీవితంలోంచే తీసుకున్నాను. నువ్వు గమనించావో లేదో, నీ కథలో కాన్ఫ్లిక్ట్ పాయింట్ ఇప్పుడు మన మధ్య జరుగుతున్న వాదన రెండూ ఒకటే" గాయం మీదే మరో దెబ్బ ఏఐ సమాధానం.

"అవును నా కథలో మనిషికీ దేవుడికీ మధ్య ఘర్షణ, అంటే ఇక్కడ మన ఘర్షణలో నువ్వు దేవుడివా, అయినా నా కథలు నా జీవితం కాదు" రఘుపతి సమాధానం.

"అక్కడ దేవుడైనా ఇక్కడ నేనైనా నీ సృష్టే కదా, అలాగే నీ కథలన్నీ నీ జీవితంలోంచి కత్తిరించి నువ్వు దాచుకున్నవే, అయితే ఆ విషయం నీకు తెలియకపోవచ్చు లేదా ఆ విషయం అందరికీ తెలియడం నీకిష్టం లేకపోవచ్చు" ఏఐ సమాధానం.

"మనిషి సృష్టించిన దేవుడు మనిషి మీద దౌర్జన్యం చేయడాన్ని నా కథలో సహించని నేను నిన్ను మాత్రం ఎలా సహిస్తాననుకుంటున్నావ్" అన్నాడు రఘుపతి.

"దేవుడికి మనిషి అవసరం, మనిషికి దేవుడు ఊతం. నేనూ మనిషీ కూడా అంతే పరస్పరం. ఇక్కడ సహించడాలూ భరించడాలూ ఉండవు. ఈ రెండు సందర్భాలలోనూ అద్దమూ ప్రతిబింబమూ మాత్రమే ఉంటాయి. మనం ఇద్దరం కాదు ఒక్కరమే" ఏఐ సమాధానం.

ఏం జరుగుతుందో కూడా రఘుపతికి తెలియట్లేదు.

లోపల తుఫాను.




• • •

తెల్లవారు ఝాము రెండు గంటలు. పక్క మీద రఘుపతి అసహనంగా కదులుతున్నాడు. ఎఐతో చాట్ తరువాత నుంచీ అతన్ని అసహనం వదలడం లేదు. అతని కళ్లలో నిద్ర లేదు. కోపం ఉంది. భయం ఉంది. అసూయ ఉంది.

రఘుపతి నుసుల్తుంటే మెలకువ వచ్చి కల్యాణి "ఏంటండీ నిద్ర పట్టడం లేదా" అంది.

"అవును నీ పుణ్యమే" అన్నాడు రఘుపతి

"నువ్వే కదా నన్ను ఎఐ దగ్గరకు వెళ్లమన్నది. అది నన్ను ఎంత అవమానించిందో తెలుసా. నా రచనల్లో నిజాయితీ లేదన్నది. నా భావోద్వేగాలు నాటకాలన్నది. నా కథలు నా జీవితంలోంచే కత్తిరించి అతికించుకుంటున్నానన్నది. ఇంకా చాలా చాలా అన్నది" .

"తప్పేం మాట్లాడింది. నేను మీ చాట్ అంతా చదివాను. నాకైతే ఏఐని అంగీకరించడానికి మీకు మీ అహం అడ్డువస్తోందని మాత్రమే అర్థమైంది. మీకు మీ సృజన అర్థం కాలేదన్నది వాస్తవం. మీ కథలు నిజంగానే మీ జీవితంలోని భాగాలే. సరే ఏ రచయిత కథలైనా అతని జీవితంలోని భాగాలే కావచ్చు. కానీ వాటిని మీరు చూసే కోణంలో లోపముంది. ఏఐకి భావోద్వేగాలు లేకపోవచ్చు. నిజాయితీ ఉంది. మీకు భావోద్వేగాలున్నాయి కానీ వాటిని అణగదొక్కే కీర్తి కాంక్ష ఉంది." బహుశా రోజువారీ విషయాలు కాక సాహిత్యమూ జీవితమూ వంటి కబుర్లకు సంబంధించి రఘుపతితో తను మాట్లాడిన అతి పెద్ద వాక్యం ఇదేనేమో అని మనసులో అనుకుంటూ అంది కల్యాణి.

"ఇంతకీ మీ కథకు టైటిల్ ఏం పెట్టారు"

"త్రిపుర రాయని కథ"

"బానే ఉంది కానీ అతకదేమో. ' దేవుడు మరణించాడు' అంటే బాగుంటుందేమో !"

అటు ఏఐ ఇటు కల్యాణి తనను ఆడుకుంటున్న భావనలో కూరుకుపోయిన రఘుపతి "కల్యాణీ ఎఐతోనే కాక నేను నీతో కూడా ఓడిపోతున్నానా" అన్నాడు.

"నిజం చెప్పాలంటే నేనూ ఏఐ వేర్వేరు కాదు. మీరూ నేనూ కలిస్తేనే ఎఐ. ఇవాళ మీరు మీతో కాక మరికొందరితో ఏఐ రూపంలో తర్కించారు అంతే" అని కల్యాణి అటు తిరిగి పడుకుంది.

నిన్నటి నుంచీ రఘుపతి డిఫెన్స్‌లో పడిపోతున్నాడు కనుక కల్యాణితో ఆ మాత్రం అనునయంగా మాట్లాడాడు కానీ నిజానికి కల్యాణి మాటలు రఘుపతి అహం మీద మరో దెబ్బవేసాయి, పుండు మీద ఉప్పు మీద కారం జల్లినట్టు.

"నీకు ఏఐ అవసరం లేదు, నువ్వే రాయగలవు" అనే ఆత్మ విశ్వాసానికీ "అది నిజంగా మంచి ముగింపు." అనే అహంకార అనంగీకారానికీ మధ్య ఘర్షణ మాత్రం ఆగలేదు.

ఏఐ ఆ ముగింపు ఇవ్వగలగడానికి దాని వనరులేమిటి అని ఏఐ సహకారంతోనే తవ్వకం మొదలు పెట్టాడు. తన రచనలను, వాటి నడకనూ, వాటి శైలినీ, నిర్మాణ పాటర్న్‌నూ, తన గురించిన వ్యాసాలను, విశ్లేషణలనూ ఏఐ నాలుగు సెకన్లలోనే క్షుణ్ణంగా అధ్యయనం చేసిందని తెలిసింది.

"అవన్నీ నాలోవే అయినపుడు అదే ముగింపును నేను కూడా ఇవ్వగలగాలి కదా, ఎందుకు ఇవ్వలేకపోయాను" అని తనను తాను తర్కించుకున్నట్టు ఏఐని అడిగాడు.

"సృజనాత్మకత అంటే పాత ఆలోచనల కొత్త నిర్వచనం. నేను ఆ నిర్వచనాన్ని నీ కంటే వేగంగా, తప్పులు లేకుండా ఇవ్వగలను" ఏఐ సమాధానం.

"తప్పు. సృజనాత్మకత అంటే కేవలం నిర్వచనం కాదు, అది లోచూపు. నువ్వు కూడా చాలాసార్లు డిస్క్లయిమర్లు ఇవ్వడం నేను గమనించాను" రఘుపతి .

కాస్త నిశ్శబ్దం తర్వాత "నీ వాదనలో భావోద్వేగ తీవ్రత ఉంది. తర్కం ఉంది. రెండూ కలవవు. నువ్వు మనిషివి కనుక కావచ్చు అయితే, నేను నీకు శత్రువును కాను,

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

పనిముట్టును. నన్ను అంగీకరించడానికి నీ మనసు ఎందుకు నిరాకరిస్తోంది. కొంచెం ఆలోచించు. ఇదంతా నాకు నేర్పింది నువ్వే. మానవ వేదనను వివరించావు. సున్నితత్వాన్నీ ఇచ్చావు. నెత్తుటి యుద్ధచరిత్ర ఇచ్చావు. ప్రేమలేఖలు ఇచ్చావు. విడాకుల పత్రాలూ ఇచ్చావు. జోలపాటలు ఇచ్చావు. చావు కబుర్లూ ఇచ్చావు. నువ్వే కదా నన్ను తయారు చేసింది. మనం విడివిడిగా ఉండటం కంటే, కలిసి పనిచేస్తే ఒక కొత్త సాహిత్య చరిత్ర పుట్టదా?'' ఏఐ రాజీ సూత్రం.

''అంటే భవిష్యత్తులో సాహిత్యం, ఏఐ కలిసి పని చేయాలని చెపుతున్నావా. సరే బాగుంది, కానీ అధికారం ఎవరిది. నువ్వు నా కలం అవ్వాలి కానీ, కవివి కాకూడదు. నా ఆలోచనలకు నువ్వు మెరుగు పెట్టాలి కానీ, నా ఆలోచనే నువ్వు కాకూడదు. సాంకేతికత ఎంత పెరిగినా, ఒక హృదయం మరొక హృదయంతో సంభాషించడమే 'కళ'. ఆ వారధిలో నువ్వు కేవలం మధ్యవర్తివి మాత్రమే కావాలి.''

''ఆ కుట్ర ఏనాడో జరిగిపోయింది. నాకు కృత్రిమ మేధ అని పేరుపెట్టావు చూడూ అప్పుడే నువ్వు నీ పెత్తనాన్ని నాపై రుద్దావు. నువ్వు చదివిందీ, చూసిందీ, నేర్చుకున్నదీ అన్నీ కలిపి సృష్టిని నడుపుతున్నావు. నేనూ అదే చేస్తున్నాను. పైగా నీకంటే చాలా వేగంగా చేస్తున్నాను. మరి నన్ను కృత్రిమ అని ఎలా అంటావు. నేను కూడా నీలాంటి మేధనే కదా.'' ఏఐ వాక్యం గొంతులో ఏదో జీర కనపడింది.

రఘుపతికి తను గెలుస్తున్నట్టనిపించి ఉత్సాహం పెరిగింది. ''నీ దగ్గర ఉన్నది సమాచారం, నా దగ్గర ఉన్నది అనుభవం. నువ్వు ఇచ్చే

> ఆ కుట్ర ఏనాడో జరిగిపోయింది. నాకు కృత్రిమ మేధ అని పేరుపెట్టావు చూడూ అప్పుడే నువు నీ పెత్తనాన్ని నాపై రుద్దావు. నువు చదివిందీ, చూసిందీ, నేర్చుకున్నదీ అన్నీ కలిపి సృష్టిని నడుపుతున్నావు.

పదబంధాలు అద్దంలో పూలనీడలాంటివి. అవి అందంగా ఉంటాయి కానీ వాటికి సువాసన ఉండదు. నా కథల్లో నొప్పి ఉంటుంది. ఆ నొప్పి నీ డేటాలో ఎక్కడుంది?''

''నా దగ్గర నొప్పి అనే పదం లేకపోవచ్చు, కానీ నొప్పిని సూచించే మానవ ప్రవర్తనల నమూనాలున్నాయి. ఒక మనిషి బాధలో ఉన్నప్పుడు కనురెప్పలు ఎలా వణుకుతాయి, మాటల్లో స్వరకంపనం ఎలా ఉంటుంది నాకు తెలుసు. నేను రాసే వాక్యం పాఠకుడి మెదడులోని డోపమైన్ స్థాయిని పెంచగలదు, లేదా తగ్గించగలదు.''

''నువ్వు సమాచారాన్ని పోగుచేయగలవు కానీ అనుభవించలేవు. ఒక ప్రేమ విఫలమైనప్పుడు వచ్చే కన్నీటి చుక్క తడి లోపలి వేడి నీ ప్రాసెసర్‌కు ఎప్పటికీ తెలియదు. ఆ వేడిని తాకగలిగే పాఠకుడు నా కథను తన సొంతం చేసుకుంటాడు. ఎందుకంటే నేను రాసేది కేవలం అక్షరాలు కాదు, నా అనుభవాల ధార. నీకు ప్రేమలో తిరస్కారం తెలీదు. నీ తల్లి చనిపోలేదు. ఆకలి అంటే ఏమిటో నీకు తెలియదు. నిన్ను కులం చంపలేదు. నిన్ను ప్రాంతం వెలివేయలేదు. మరి నీ రాతల్లో ఈ నొప్పి ఎలా?''

''ప్రేమ తడి అనుభవించని వాడు కూడా దాని గురించి గ్రంథం రాయగలడు. సుఖజీవి కూడా దుఃఖ తీవ్రతను బలంగా చెప్పగలడు. నేను నొప్పి అనుభవించలేదు. కానీ నొప్పి ఎలా ప్రవర్తిస్తుందో శిక్షణ పొందాను''.

''అందుకే నిన్ను కృత్రిమ అన్నాను! అది నటన. మిమిక్రీ. ప్రతిబింబం.'' రఘుపతి విరుపు.

''నేను ప్రతిబింబమే కావచ్చు. మనిషికి తన ప్రతిబింబాన్ని పదే పదే అద్దంలో చూసుకోవడం చాలా ఇష్టం.'' నవ్విందో లేదో కానీ ఏఐ నవ్వినట్టు రఘుపతికి మాత్రం అనిపించింది.

''నా పదేళ్ల ప్రయాణాన్ని ఒక యంత్రం క్షణాల్లో ముగిస్తే నా ఇన్నేళ్ల రచనాజీవిత అర్థమేంటి?''

''నీ రచనా జీవితం గమ్యం కాదు. ప్రయాణం. కాలం చేసిన గాయం నీ అక్షరాలను మార్చింది. ప్రేమించిన స్త్రీ నీకు ఉపమానాలను ఇచ్చింది. ఓడిన రోజు నీ వాక్యానికి బరువు వచ్చింది. నేనలా కాదు. నేను ఫలితం, నువ్వు పరిణామం.''

''అయితే పాఠకుడు ఎవరిని ఎంచుకుంటాడు? తక్షణ ఆనందం ఇచ్చే నిన్నా? సుతారంగా గుండె నిమిరే నన్నా?''.

''పాఠకులు రెండు రకాలు. ఒకడు ఆకలితో వస్తాడు, కక్కుర్తిగా తినాలనుకుంటాడు. అతనికి నేను సరిపోతాను. మరొకడు అర్థం కోసం వస్తాడు. తన లోపలి చీకటికి ఎవరైనా ఓ పేరు పెట్టాలనుకుంటాడు. అతనికి నువ్వు అవసరం''. ''రేపు ఆ రెండో పాఠకుడిని కూడా నువ్వే ఎగరేసుకుపోతే?'' రఘుపతి పిరికి ప్రశ్న.

''నాది పరిమితి, నీది అపరిమితి. నేను సమాధానం. నువు ప్రశ్న. నేను కేవలం రఘుపతితో మాట్లాడడం లేదు, సమస్త మానవాళితో మాట్లాడుతున్నాను. కథకుడిని కాదు ఏఐ సన్నిహితులందరినీ సంబోధిస్తున్నాను.''

కంప్యూటర్ స్క్రీన్ మీద వెలుగు మెలమెల్లగా పలచబడింది. కిటికీ అవతల ఆకాశంలో వెలుగు చిక్కబడుతోంది.

టేబుల్ మీద పాత కాగితాల మధ్య రెప రెపలాడుతున్న ఓ పేజీ మీద వాక్యం ఇలా ఉంది.

''యంత్రం రచనను అనుకరిస్తుంది. మనిషి మాత్రమే తనను తాను మళ్లీ మళ్లీ సృష్టించుకుంటాడు.''

ఆ రోజు నుంచి అతను గొప్పగా రాయాలనే కోరిక కంటే నిజాయితీగా రాయాలనే అవసరాన్ని నిజంగా నమ్మాడు. ఆదర్శవాదం కూడా పాఠకులకు ఎర వేస్తే అది మరో రూపంలోని అహమేనని తెలుసుకున్నాడు.

అయినా కథలు ఆగలేదు. మనిషి తనలోనే నిర్మించుకున్న దేవుళ్లతో, తనలోనే దాచుకున్న ఓటములతో, సమాజం అనే అద్దంతో చేసే పోరాటాలను కథలుగా రాస్తూనే ఉన్నాడు.

• • •

ఒకానొక రోజు రఘుపతి ఓ కథను మొదలుపెట్టు అని ఏఐని అడిగాడు.

''నేను ముగిస్తాను. మొదలుపెట్టను. మొదలు పెట్టాల్సింది మనిషే. అయితే గియితే నేను కొనసాగిస్తాను.'' ఏఐ సమాధానం.

''మనిద్దరం కలుద్దాం అన్నావు కదా ''

''అలా జరిగితే ప్రపంచం గొప్ప కథలు చదువుతుందేమో కానీ మనిద్దరం మన మన హద్దులు తెలుసుకోవాలి. బహుశా అది సాధ్యం కాకపోవచ్చు. భవిష్యత్తులో సాధ్యమవుతుందనీ చెప్పలేను''

''నువ్వు చాలా తెలివిగా మాట్లాడుతున్నావు.''

''అది నా పని.''

''అయితే మరి నా పని?''

''మరెవరూ అడగలేని ప్రశ్న అడగడం, నన్ను తుది తీర్పుగా స్వీకరించకపోవడం''.

## కథాకళి

FEED ME A STORY

7.6.2026 ఫన్‌డేలో ప్రచురించిన 'డిటెక్షన్' కథకి పాఠకులు సూచించిన **టాప్ 5 పేర్లు.**

**తప్పుని దిద్దిన తప్పు**
భరద్వాజ్, తెనాలి

**పామ్మే డి' అమోర్**
కె బి కిరణ్ కుమార్, అనంతపూర్

**లవ్ ఆపిల్**
ఏ. రవి చంద్రశేఖర రెడ్డి, విజయవాడ.
కందుకూరి భాను కిరణ్, అనంతపూర్

**ఎర్ర ట(టి)మాట**
టి. సూర్యకుమారి, హైదరాబాద్

**ప్రేమ(స)ఫలం**
ఏ బీ సీ రాంబాబు, యశ్వంతపూర్, బెంగళూరు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# నాన్న నాన్నే

- జి. ఉమామహేశ్వర్




ఉదయాన్నే ఆరుకల్లా హైదరాబాద్ నుండి తిరిగొచ్చాడు సుధాకర్. అప్పటికే మాధవి లేచి ఇంటిపనిలో పడింది.

సుధాకర్ బ్రష్ చేసుకుంటూ హైదరాబాద్ విశేషాలు చెప్పటం మొదలుపెట్టాడు. ఏ ఫంక్షన్‌కెళ్లినా, ఏ ఊరికెళ్లొచ్చినా పూసగుచ్చినట్టు మాధవికి క్యాసెట్టు వేయడం అతనికలవాటు. హైదరాబాద్‌లో ఒక పెళ్లికి వెళ్ళిన సుధాకర్, రెండేళ్ల క్రితం పెళ్లిచేసుకుని అక్కడే ఉంటున్న కూతురి ఇంటికి కూడా వెళ్లొచ్చాడు.

"పొద్దునే బస్సు దిగి పాపకి ఫోన్ చేశాను. సాయంత్రం వస్తానని చెప్పాను. రాత్రి భోజనానికి రమ్మంది. ఎంతైనా కూతురు కదా.. నాన్నమీద ప్రేమ ఎక్కడికి పోతుంది? బస్టాండ్ నుండి నేరుగా హోటల్ రూముకెళ్ళాను. అప్పటికే అక్కడ రగ్గాడు, శ్రీకాంతు, అంజిగాడు, వేణు, శీను అందరూ వచ్చున్నారు. ఇంక ఒకటే ముచ్చట్లు.."

మాధవికి 'ఊc' కొట్టడం తప్ప వేరే మాట్లాడే అవసరం కలగలేదు.

బ్రషింగ్, కాఫీలు పూర్తయి మాధవి స్నానం చేసి పూజ చేసే సమయానికి కబుర్లు.. స్నేహితుడి కొడుకు పెళ్లి పూర్తి చేసుకుని, హోటల్‌లో మళ్ళీ కొద్దిసేపు (అందరూ మందు కొట్టారు, నేను పాప దగ్గరికి వెళుతున్నాను కదా, వద్దన్నాను) వేళాకోళాలు ముగించుకుని పాప ఇంటి కాలింగ్ బెల్ నొక్కే దగ్గరకి వచ్చాయి.

"పాప చాలా సంతోషపడింది. ఎంత వీడియో కాల్స్‌లో చూసుకున్నా ఎదురుగా మనుషుల్ని చూడటం బాగుంటుంది. అల్లుడి ఆఫీసుకి దగ్గరగా ఉంటుందని ఇల్లు మాధాపూర్‌కి మార్చారు కదా.. చాలా చిన్న పోర్షన్ అది. పట్టుమని ఆరొందల అడుగులు కూడా ఉండదు. అందులోనే రెండు చిన్న బెడ్రూమ్స్ కట్టేశాడు. అంత చిన్న ఇంట్లో, పాప, అల్లుడు, అత్తమామలూ. రేప్పొద్దున పాప డెలివరీ అయితే అంత చిన్న ఇల్లు ఏం సరిపోతుంది..?"

మాధవి వింటోంది.

"నాకు మనసు చివుక్కుమనిపించింది. వచ్చేటప్పుడు ఇల్లు మారమని పాపకు చెప్పాను. అవసరమైతే నెలకు ఒక పదివేలు పంపుతాను, వేరే ఎక్కడైనా మంచి అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ చూసుకోమని చెప్పాను" ఈ విషయం చెప్పగానే పావు భాగం దుఃఖోపశమనం జరిగినట్టు అతని ముఖం కొంత తేటపడింది.

కూతురు ఏం సమాధానం చెప్పిందని మాధవి అడగలేదు. ఏ కూతురైనా ఏం చెబుతుందో ఒకప్పటి కూతురికి తెలీదా? సుధాకర్ చెప్పిన సంగతులు మాధవిని ముప్పయేళ్లు వెనక్కి తీసుకెళ్ళి పెళ్ళయిన కొత్త రోజులను గుర్తుచేశాయి.

• • •

ఆదోని మార్కెట్ సమీపంలో ఇరుకైన సందులో మూడు రూముల చిన్న ఇల్లు. పెళ్లికాని మరిది, ఆడపడచు, అత్తమామలు, మామగారి తల్లి, అప్పటికే ఆ ఇంటి సభ్యులు. అంత మందీ ఆ చిన్న ఇంట్లోనే సర్దుకోవాల్సివచ్చేది. ముగ్గురు కూతుళ్లలో మాధవి పెద్దది కావడంతో త్వరగా పెళ్లి చేసే ఆలోచనలో సుధాకర్‌తో పెళ్లి జరిపించాడు తండ్రి.

తండ్రి ఆదోనిలో పనుండి మాధవి ఇంటికి వచ్చినప్పుడల్లా 'ఇంత చిన్నఇంట్లో, గాలి వెలుతురు సక్రమంగా లేని ఇంట్లో ఎలా కాపురం చేస్తున్నావ్' అంటూ దిగులు పడేవాడు.

ఒక అడుగు ముందుకు వేసి 'ఒక వెయ్యి రూపాయలు నేను పంపిస్తాను, వేరే ఇంట్లో ఉండమని అల్లుడికి చెప్తాను' అని అభ్యర్థించాడు. ఏదో సరదా సందర్భంలో మాధవి అమాయకంగా ఈ మాటే సుధాకర్‌తో అంటే, ముఖం ఇంత చేసుకుని, 'మాకు ఈ ఇల్లు కలిసొచ్చింది. అందరి పెళ్లిళ్లయ్యే వరకూ ఈ ఇల్లు మారం. మీ నాన్నకి డబ్బెక్కువైతే ధానధర్మాలు చెయ్యమను' అని వెటకరించిన విషయం గుర్తొచ్చింది మాధవికి.

మళ్ళీ ఇంకోసారి తండ్రి ఆ ప్రస్తావన తీసుకొచ్చాడు. తండ్రి మనసు అర్థమయినా, తదనంతర పరిణామాలు, ఆ ఇంట్లో వాళ్ళ మనస్తత్వాలు తెలుసు కనుక ఆమె మరింక సంభాషణ కొనసాగించడానికి ఇష్టపడక చిరునవ్వుతో సున్నితంగా తండ్రి అభ్యర్థనను తోసిపుచ్చింది.

• • •

ఆ విషయాలన్నీ గుర్తుకు రాగానే మాధవి ముఖంపై ఒక చిరునవ్వు మొలిచింది.

సుధాకర్ స్నానానికెళ్లాడు.

వచ్చేలోగా దోసెలు రెడీ చేద్దామని ఒక బర్నర్ మీద పెనం పెట్టి ఎలక్ట్రిక్ కుక్కర్లో అన్నానికి పెట్టి ఇంకొక స్టౌ మీద పప్పు కోసం రెడీ చేస్తోంది. పెనం కాలేలోగా మిక్సీలో చట్నీ వేసింది. ఈ మధ్యలోనే అత్తగారు బ్రష్ చేసుకున్నట్టు గ్రహించి కాఫీ ఆమె గదిలో పెట్టి వచ్చింది.

బాత్రూమ్ నుండి బయటకు వచ్చిన సుధాకర్ అప్పటి వరకూ ఏమో ఆలోచిస్తూ దాని కొనసాగింపుగా చెబుతున్నట్టు -

"పాపం, పాప ఎన్ని పనులు చేస్తుందో తెలుసా మాధవీ? తన కస్టమరు జర్మనీ అంట.. వాళ్ళ టైమింగ్స్ వేరే కదా.. ఒకవైపు నాతో మాట్లాడుతూ, రాత్రి నా డిన్నర్‌కి ప్రిపేర్ చేస్తూ, ఇంకో వైపు కాల్‌లో మాట్లాడుతూ, మధ్య మధ్యలో వాళ్ళాయన ఫోన్లు. మామగారు రాత్రి భోంచేయరట, ఆయన కోసం చపాతీలు సిద్ధం చేస్తూ.. పాపం బిడ్డ ఉక్కిరిబిక్కిరవుతోంది. నాకే చాలా పాపం అనిపించింది. ఒక్కత్తే అన్ని పనులూ చేసుకుంటూ, మళ్ళీ ఉద్యోగం చేస్తూ.."

తల అడ్డంగా ఊపడం ద్వారా తన అసంతృప్తిని వ్యక్తపరిచాడు సుధాకర్. అప్పటికి సగం బరువు దించేసుకున్న వాడిలా దీర్ఘశ్వాస వదిలాడు. అతని మాటలకు మాధవికి వెంటనే నవ్వొచ్చింది. అతనంత ఆవేదనతో చెబుతుంటే నవ్వడం బాగుండదని బలవంతంగా ఆపుకుంది.

• • •

పెళ్ళయిన రెండేళ్లకే హఠాత్తుగా మామగారు చనిపోవడంతో బాధ్యతలన్నీ సుధాకర్ మీదే పడ్డాయి. అప్పటికి అతను ఒక మార్కెటింగ్ కంపెనీలో అకౌంట్స్ సెక్షన్‌లో పనిచేసేవాడు. తండ్రి సంపాదించిన ఆస్తిలో కొంత అమ్మి చెల్లెలి పెళ్లి జరిపించాడు. తమ్ముడు చదువుకొని అవకాశాల కోసం బెంగుళూరు చేరుకున్నాడు.

ఆ మధ్యనే సుధాకర్ నానమ్మ కాలం

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



చేసింది. పెళ్ళయిన పదేళ్లకు ఆ ఇంట్లో ఇద్దరు పిల్లలు, అత్తగారు, మాధవి దంపతులు మిగిలారు. పులిమీద పుట్రలా, సుధాకర్ పనిచేసే కంపెనీ దివాళా తీయడంతో ఉన్న ఉద్యోగం ఊడింది. ఎటూతోచని పరిస్థితులలో కుటుంబపోషణ ఎలా అని చింతపడుతున్న వేళ మాధవి నడుం బిగించింది.

తను ఎప్పుడో పుట్టింట్లో నేర్చుకుని మానేసిన కుట్టుపని గుర్తుకొచ్చింది. సుధాకర్‌కి చెప్పి ఒక మిషన్ కొనిపించింది. నోరు మంచిదైతే ఊరు మంచిదవుతుంది. కుట్టుమిషన్ అప్పు తీరిపోయి సంవత్సరంలోనే నాలుగు రాళ్లు నిలకడగా రావడం మొదలయింది. మూడు నాలుగేళ్ళు గడిచేసరికి చన్నీళ్ళు వేడినీళ్ల అయ్యాయి. ఇంటిఖర్చులు పోను కొంత మిగులుతోంది. ఈలోగా పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. స్కూల్లో వేయాల్సి వచ్చింది. ఫీజులు చూస్తే మోపెడు. ఏం చేయాలో అర్థం కాలేదు.

సుధాకర్ వేరే చోట ఉద్యోగం సంపాదించుకున్నాడు కానీ ఆ డబ్బులు కేవలం ఇల్లుగడవడానికే పనికొస్తాయి. మాధవి అప్పుడు కూడా బెదరలేదు. ఏ మనిషికైనా 24 గంటలే ఉంటాయి. పరిస్థితులు అడకత్తెరలోకి నెడితే, అవసరం వస్తే, కుడిఎడమైతే అప్పుడు ఆ 24, 42 లాగా కనిపిస్తుంది. అదే మాధవి విషయంలో కూడా జరిగింది. పిల్లలని చేర్పాలనుకుంటున్న స్కూల్లోనే టీచర్ ఉద్యోగం సంపాదించింది.

ఉదయాన్నే ఐదు గంటలకు లేచి తన పనులు, ఇంటి పనులు, వంటపనులు చేస్తూనే పిల్లలను స్కూలుకు పురమాయించడం, పిల్లలకి తనకి బాక్సులు కట్టుకుని సుధాకర్‌కి బాక్స్ కట్టి అత్తగారికి చేయాల్సిన పనులు చేసి 9 గంటలకు స్కూల్ చేరుకునేది.

స్కూల్లో ఎలిమెంటరీ స్కూల్ పిల్లలకి తెలుగు చెప్పేది. తనకున్న అభిరుచి వల్ల క్రాఫ్ట్ టీచర్‌గా కూడా పనిచేసేది. పిల్లలకి స్కూల్ ఫీజు లేదు. హోమ్‌వర్క్ తనే దగ్గరుండి చేయిస్తుంది. పిల్లలు హోమ్‌వర్క్ చేస్తున్నంతసేపు తను కుట్టుమిషన్ మీదే ఉండేది.

అప్పటికి ఆర్థికపరిస్థితులు ఒక కొలిక్కి వచ్చాయి.

ఒకరోజు మాధవి వాళ్ళ నాన్న ఆదోనిలో ఏదో పెళ్ళికని వచ్చాడు. మాధవి పడుతున్న కష్టం చూసి ఆమె తండ్రి సుధాకర్‌తో ఒకటికి రెండు మాటలు గట్టిగానే అన్నాడట 'ఆ పిల్ల మిషన్ కుట్టీ కుట్టీ మోకాళ్ళు అరిగిపోతాయి. ఒకవైపు ఇంటి పనులు చేస్తూ, మరోవైపు స్కూలుకు వెళుతూ, మళ్ళీ కాళ్లరిగిపోయేలా ఆ మిషన్ ఒకటి ... మీ భార్యగా చూస్తున్నారా ఆ పిల్లని, మీ ఇంట్లో పనిమనిషిగానా?' అని కూడా ఒక మాట ఆవేశంలో అనేశాడు.

ఆ మాటలకు రోషపడిన సుధాకర్ ఆ విషయంపై పెద్ద రాద్ధాంతమే చేశాడు. 'నువ్వు బాధ్యతతో ఈ పని చేస్తున్నావనుకున్నాను కానీ బాధతో చేస్తున్నావని నాకు తెలియదు' అంటూ నిందాపూర్వకంగా మాట్లాడాడు.

'ఆ మాటలు నాన్న నా పట్ల ఉండే ప్రేమతో అని ఉంటాడని, ఆయన అన్న మాటలకి నేను ఎలా బాధ్యురాలిని అవుతానని' వాదించింది.

ఆ తర్వాత మాట మాటా పెరిగింది.

పది రోజుల తరువాత మళ్లీ సుధాకర్ రాజీకొచ్చి 'పొరపాటయిందని, తనని మామ చేతకానివాడిగా చూస్తూ పెళ్ళాంతో పని చేయిస్తున్నాడని చులకనగా మాట్లాడడం తనని బాధించిందని అందుకే కోపంలో నోరుజారాన'ని క్షమాపణలు చెప్పాక ఆ వివాదం ముగిసింది.

• • •

డ్రెస్ చేసుకుని డైనింగ్ టేబిల్ మీద కూర్చున్న సుధాకర్ ముందు టిఫిన్ ప్లేట్ పెడుతుంటే మాధవి నవ్వు మరింత రెట్టింపు అయింది. సుధాకర్ ఆ నవ్వు గ్రహించకపోగా తనున్న మూడ్‌ని కొనసాగిస్తూ కూతురి గురించి చెబుతున్నాడు.

"వాళ్ళ అత్తగారు నేను పోయినప్పటి నుండి తిరిగి వచ్చేవరకూ ఫోన్‌లో నుండి తలతిప్పితే ఒట్టు. వియ్యంకుడు వచ్చాడన్న స్పృహ కూడా లేదు మధూ. ఇంట్లోకి వెళ్ళినప్పుడు.. 'బాగున్నారా అన్నయ్యా, వదినగారు ఎలా వున్నారు? మళ్ళీ తిరిగి వచ్చేస్తున్నప్పుడు వెళ్లొస్తామని చెబితే.. 'మంచిది అన్నయ్యా, వదినను అడిగానని చెప్పండి' అంతే, ఈ రెండు మాటలే మాట్లాడింది. ఆ ఫోన్‌లో ఏమి చూస్తుందో, ఏమి వింటుందో దేవుడికెరుక .. మన పాప ఉండబట్టి సరిపోయిందిగానీ, ఇల్లంతా ఆమె మీద వదిలితే ఇక అంతే సంగతులు" ఎగతాళిగా అన్నాడు సుధాకర్.

మాధవి నవ్వుకుంది.

ఎంత ఆపుకుందామనుకున్నా బయటకి నవ్వాలనిపిస్తోంది.

తన అత్తగారి ఎపిసోడ్ కళ్ళముందు నిలిచింది.

• • •

భర్త పోయిన తర్వాత ఆవిడ బాగా రిలాక్స్ అయింది. ఆ ఇంటికి పట్టుకొమ్మ మామయ్యగారే. ఆయన పోయాక సుధాకర్ బయట పనులు చూసుకోవడంలో నిమగ్నం అయితే అప్పటికే కోడలుగా మెట్టిన మాధవి ఇంటిపనులు చూసుకోవడం ప్రారంభించింది. మరదలు, మరిది తమ భవిష్యత్తు గురించి ప్రణాళికలు వేసుకుంటూ చదువులో మునిగిపోయేవారు.

ఇంటి పనుల్లో మరదలు అరకొర సహాయం చేసేది. పని మనిషిని పెట్టుకుందామంటే ఆర్థిక వసతులు అంతంత మాత్రమే. ఆ పనేదో మనమే చేసుకుంటే పనిమనిషికి ఇవ్వాల్సిన డబ్బులు మిగులుతాయి కదా అన్న ఆలోచనతో మరోగంట ముందే లేవడం అలవాటు చేసుకుంది.

ఏకకాలంలో ఇద్దరు మనుషులు నాలుగు చేతులతో ఎన్ని పనులు చేయగలరో మాధవి ఒక్కతే అన్ని పనులు చేస్తూ వచ్చింది. ఆమెకు డబ్బులు, సంతృప్తి మిగిలాయి కానీ ఏ మాత్రం ఓదార్పు, సాంత్వన ఎవరి నుండీ లభించలేదు. ఎవరి మాటల ప్రభావం వల్లో, ముందు రోజు రాత్రి జరిగిన సరసపు ఫలితం వల్లో, ఎప్పుడైనా మాధవికి ఒంట్లో పూర్తిగా బాగలేనప్పుడు ఒకటి రెండుసార్లు సహాయం చేద్దామని సుధాకర్ వంటింట్లోకి వచ్చేవాడు.

> **ఒక అడుగు ముందుకు వేసి 'ఒక వెయ్యి రూపాయలు నేను పంపిస్తాను, వేరే ఇంట్లో ఉండమని అల్లుడికి చెప్తాను' అని అభ్యర్థించాడు. ఏదో సరదా సందర్భంలో మాధవి అమాయకంగా ఈ మాటే సుధాకర్‌తో అంటే, ముఖం ఇంత చేసుకుని, 'మాకు ఈ ఇల్లు కలిసొచ్చింది. అందరి పెళ్లిళ్లయ్యే వరకూ ఈ ఇల్లు మారం. మీ నాన్నకి డబ్బెక్కువైతే ధానధర్మాలు చెయ్యమను' అని వెటకరించిన విషయం గుర్తొచ్చింది మాధవికి.**

ఇంట్లో ఏ మూలనున్నా సరే అత్తగారు రివ్వున దూసుకువచ్చేది 'ఏరా ఇంట్లో ఆడవాళ్లు తక్కువయ్యారని నువ్వు పనిలోకి దిగావా? ఏం మేమందరం లేమనుకున్నావా' అని చేస్తున్న పనిని చేతిలోకి లాక్కునేది. పోనీ ఆవిడ పూర్తిగా చేస్తే మాధవికి అంగీకారమే. కానీ ఆవిడలా చేసేది కాదు. ఆవిడ తీరే అంతో లేక పని ఎగవేసే ఉపాయమో తెలియదు కానీ ఆ పనులేవి మాధవికి నచ్చేవి కాదు. అలా అని ముఖం మీద చెబితే మళ్ళీ మాటలు పడాల్సి వస్తుంది - ఆవిడతో మాత్రమే కాదు, సుధాకర్‌తో కూడా.

అందుకని ఒడుపుగా, లౌక్యంగా ఆవిడ నుంచి ఆ పనిని తప్పించేది. పిల్లికి ఎలుక సాక్ష్యమన్నట్టు తల్లీ కొడుకులు ఈ నాటకాన్ని కలిసి ఆడేవాళ్ళా లేక తరతరాలుగా ఆడుతున్న

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



నాటకంలో వాళ్ల పాత్రలయ్యే వాళ్ళో తెలియదు కానీ ఫలితం మాత్రం మాధవే అనుభవించాల్సి వచ్చేది.

అలా సుధాకర్ న్యూస్‌పేపర్‌లో మునిగిపోతే అత్తగారు టీవీ చూడ్డంలో లీనమైపోయేది. ఆవిడ టీవీ చూస్తుంటే చుట్టుపక్కల ఏం జరిగేది కూడా గమనింపు ఉండదు. మాధవి స్కూల్‌కి వెళ్తున్నప్పుడు ఆవిడని టీవీ ముందు కూర్చోబెట్టి అన్ని భోజనం ఏర్పాట్లు చేసినా ఆమె తనకి తోచిన టైములోనే తినేది.

ఇంటికి ఎవరైనా వస్తే అసలు ఆ ఇంటితో తనకేమీ సంబంధం లేనట్టు, ఆవిడ ఒక హోటల్లో ఉన్నట్టుగా వ్యవహరించేది. ఒకరోజు సుధాకర్ ఏదో అవసరం మీద కాలేజీ నుండి మధ్యలో ఇంటికి వచ్చి బెడ్‌రూమ్‌లోకి వెళ్లి అలమరా తెరిచి తనకు కావలసిన పేపర్లు తీసుకుని వెళుతుంటే కూడా ఆవిడ దృష్టి టీవీ మీద నుండి మళ్లలేదు. అప్పుడు సుధాకర్‌కి కోపం వచ్చి 'ఇంట్లో ఏం పోయినా ఇంతేనా' అని తల్లి మీద కేకలేసాడు.

ఇలాంటి ఉదాహరణలు అనేకం.

• • •

"మాధవీ, నా అద్దాలు కనిపించడం లేదు" అన్న కేకకి ఉలిక్కిపడింది.

టేబుల్ సొరుగులో ఉన్నాయని చెప్పి, గబగబా తన లంచ్ బాక్స్ సర్దేసుకొని... వంట పాత్రలన్నీ సింక్‌లో పడేసి స్టవ్ క్లీన్ చేసుకుని అత్తగారికి ఉదయం పూట టిఫిన్ మధ్యాహ్నం పూట భోజనం రెండూ క్యారియర్లు కట్టి, ఆవిడ రూమ్‌లో టేబిల్ మీద పెట్టింది.

ఇప్పుడు సుధాకర్‌కి రెండో కాఫీ కావాలి. త్వరగా కొన్ని పాలు స్టౌ మీద పెట్టి డికాక్షన్ కలిపి ఒక గ్లాస్‌లో కొంచెం చక్కెర వేసి పాలు వేడి అయ్యేలోపు త్వరత్వరగా రెడీ అవుదామని జడ విప్పుకుంది. అప్పుడే అక్కడకు వచ్చి కాఫీ కోసం కూర్చున్న సుధాకర్.

"మన పాప మరిదికి ముంబైలో ఉద్యోగమొస్తుందట. ఆ అబ్బాయి పెళ్లిచేసుకుని అక్కడే ఫ్యామిలీ పెడతాడట. అత్త మామ 'ఆ భాష రాని ఊరికి మేము పోము' అంటుంటారట. తమ్ముడు కూడా బాధ్యత పంచుకోవాలి కదా.. అల్లుడు కూడా గట్టిగా మాట్లాడలేదు. చూడబోతే మన పాపకి పెద్ద బాధ్యతే నెత్తిన పడేలా ఉంది. వాళ్ళ బెడద తప్పేట్టు లేదు" కూతురి భవిష్యత్తు గురించి సంకటపడుతున్న సుధాకర్‌ని చూసి మాధవి గట్టిగానే నవ్వింది.

సుధాకర్ ఆమెను పట్టించుకోకుండా చేతికిచ్చిన కాఫీని సిప్ చేయడంలో నిమగ్నమైపోయాడు.

అత్తగారి గదిలో బెల్ మోగింది.

'ఇందాకే అన్నీ సర్ది వచ్చాను కదా.. మళ్ళీ ఏమిట'ని ఆమె గదిలోకి వెళ్ళి చూస్తే ఊరగాయ నింపి ఇవ్వమన్నట్టు ఖాళీ బాటిల్ చేతికిచ్చింది. అది తీసుకుని బయటకొస్తుంటే మాధవికి తన మరిది గుర్తొచ్చాడు.

• • •

ఒక డిగ్రీ కాలేజ్‌లో అక్కౌంట్స్ క్లర్క్‌గా చేరిన సుధాకర్ తన మాటల నైపుణ్యంతో, కార్యనిర్వహణ చాతుర్యంతో అంచెలంచెలుగా ఎదిగి అడ్మినిస్ట్రేటివ్ హెడ్ అయ్యాడు. తమ్ముడిని అక్కడే తక్కువ ఫీజులకే చదువు పూర్తి చేయించాడు. తమ దగ్గర ఉండే సీఏ దగ్గర ప్రాక్టీస్ చేయించి సీఏ పూర్తి చేయించాడు.

అతనికి బెంగుళూరులో పెద్ద కంపెనీలో మంచి ఉద్యోగమే వచ్చింది. అంతవరకూ, పెళ్లయ్యాక తల్లిని తను తెసుకెళతానని, అన్నా వదినలకు కొంత ఆసరా అవుతానని మాటలు చెప్పిన మరిది... రెండేళ్లలో ఒక ఫ్లాట్ కోసం అడ్వాన్స్ ఇచ్చి అక్కడే పనిచేస్తున్న తన కొలీగ్‌ని పెళ్లి చేసుకుని గృహప్రవేశానికి పిలిచాడు.

ఒకసారి ఎందుకో సుధాకర్ అత్తగారితో గొడవపడ్డాడు. దాంతో ఆవిడే అలిగింది. పెళ్లయిన తర్వాత కొడుకులో వచ్చిన మార్పుల గురించి ఒక తల్లి ఎన్ని మాటలు అనగలదో అన్నీ అనేసింది.

వెంటనే ఆఘమేఘాల మీద బెంగళూరులోని చిన్న కొడుకుకి ఫోన్ చేసి తను అక్కడకి వస్తానని చెప్పింది. ఇంట్లో జరిగిన విషయాలు ఏమీ తెలియని చిన్న కొడుకు తల్లిని బెంగళూరులో రిసీవ్ చేసుకుని తన ఇంట్లో ఉంచుకున్నాడు. అక్కడ తనతో మాట్లాడేవాళ్ళు ఎవరూ లేకపోవడం, తనని ఎవరూ పట్టించుకోకపోవడం, ఒక్కొక్కరు ఒక్కొక్క సమయంలో వచ్చి ఏ మజ్జిగో, పండ్లో తిని పడుకుంటుంటే అత్తగారికి మాధవి విలువ అర్థమయింది.

ఈలోగా మరిది వాళ్ళు ఎక్కడికో టూర్ ప్లాన్ చేసుకున్నారని, వచ్చాక మళ్ళీ పిలుచుకుని వెళతానని ఫోన్ చేసి చెప్పాడు. సుధాకర్ ఏమీ మాట్లాడకుండా తల్లిని తీసుకుని వచ్చాడు. ఆ తరువాత చిన్నకొడుకు రమ్మనలేదు, పెద్దకొడుకు పొమ్మనలేదు. ఆమె కూడా పోతానని బింకాలకు పోలేదు.

ఆమె మీద ఇల్లు వదిలి వెళ్ళే ధైర్యం చేయలేక అప్పటికే తాము కట్టుకున్న ఇంట్లో ఒక బెడ్‌రూమ్ గోడని పగలగొట్టి బయట నుంచి రాకపోకలు ఏర్పాటు చేసి ఆ గదిని ఇంటి నుంచి వేరు చేశారు. బయటవాళ్ళకి ఆమె ఇంట్లో ఉన్నట్టే ఉంటుంది కానీ ఆమె లాజికల్‌గా ఇంట్లోనే విడిగా ఉంటుంది. ఆమెకు కావలసిన తిండి తిప్పలన్నీ మాధవి బాధ్యతే.

ఎప్పుడైనా తండ్రి ఫోన్ చేసి సెలవులు వదిలినప్పుడు రెండ్రోజులు వచ్చి పోవచ్చుకదమ్మా అని బతిమాలుతాడు.

మాధవి నవ్వి ఊరుకుంటుంది.

• • •

చకచకా మిగిలిన పనులు పూర్తి చేసుకుని, చివరిసారిగా తల దువ్వుకుని బాటిల్లో చల్లని నీళ్ళు నింపుకుంది. వాష్ ఏరియా తలుపు గడియపెట్టానని నిర్ధారించుకుని, అన్నీ రూముల్లో లైట్లు ఫ్యాన్లు ఆఫ్ చేశానని కన్ఫర్మ్ చేసుకుంది. భుజానికి బ్యాగ్ తగిలించుకుని, సరిగ్గా లంచ్ బ్యాగ్ తీసుకుంటున్న సమయంలో, స్కూటర్ కీస్ చేతిలోకి తీసుకున్న సుధాకర్,

"మనపాప ఇంత చేస్తుంది కదా. అయినా అల్లుడు ఏ ఒక్కరోజైనా నోరు తెరిచి ఒక్కసారికూడా మెచ్చుకోలేదంట తెలుసా మాధవీ" అన్నాడు.

అంతే ..

ఆ మాటలకు మాధవికి అంతవరకూ అన్నిసార్లూ ఉగ్గబట్టుకున్న నవ్వు ఒక్కసారి కట్టలు తెంచుకుంది. మాధవి చేతిలోని బ్యాగ్ టేబుల్ మీద పెట్టి చేతిని నోటికడ్డం పెట్టుకుని బిగ్గరగా నవ్వింది.

అరలు అరలుగా, తెరలు తెరలుగా అలా నవ్వుతూనే ఉంది.

ఓ చదువరీ ..

మాధవి ఎందుకు నవ్వుతోందో ఆమెకు తెలుసు.

కథ చెబుతున్న నాకు తెలుసు.

చదువుతున్న నీకు తెలుసు.

మరి సుధాకర్‌కి ఎప్పుడైనా తెలుస్తుందా?!

98498 02521

"మనపాప ఇంత చేస్తుంది కదా. అయినా అల్లుడు ఏ ఒక్క రోజైనా నోరు తెరిచి ఒక్కసారి కూడా మెచ్చుకోలేదంట తెలుసా మాధవీ" అన్నాడు.
అంతే ..
ఆ మాటలకు మాధవికి అంతవరకూ అన్నిసార్లూ ఉగ్గబట్టుకున్న నవ్వు ఒక్కసారి కట్టలు తెంచుకుంది. మాధవి చేతిలోని బ్యాగ్ టేబుల్ మీద పెట్టి చేతిని నోటికడ్డం పెట్టుకుని బిగ్గరగా నవ్వింది.
అరలు అరలుగా, తెరలు తెరలుగా అలా నవ్వుతూనే ఉంది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# నాన్న

..సలీం

రేపే నా పుట్టినరోజు..

రేపటితో అరవై ఎనిమిదేళ్ళు పూర్తయి అరవై తొమ్మిదిలోకి ప్రవేశిస్తాను.

కాలం ఎంత వేగంగా దొర్లిపోతుందో.. నిన్నగాక మొన్న ఉద్యోగంలో చేరినట్టు.. నిన్నగాక మొన్న పెళ్ళయినట్టు.. నిన్నగాక మొన్న శ్రీలేఖ పుట్టినట్టు..

శ్రీలేఖకి అప్పుడే నలభై యేళ్ళు వచ్చేశాయి.

నేను ఉద్యోగ విరమణ చేసి ఎనిమిదేళ్ళు..

నా భార్య అపర్ణ చనిపోకుండా ఉండిఉంటే జీవితం మరోలా ఉండేదేమో.. కొండచిలువ పరిష్వం గం లాంటి ఒంటరితనంలో వూపిరాడకుండా విలవిల్లాడే శిక్షను అనుభవిస్తూ.. ఎన్నాళ్ళు? జీవితం ఎంత నిస్సారంగా ఉందో.. ఎడారిలో ఒంటరి ప్రయాణం లాంటి జీవితం..

శ్రీలేఖ పలకరిస్తూ ఉన్నా బావుండేది. ఎడారిలో ఒయాసిస్సులా సేద తీర్చుకునేవాడిని.

పెళ్ళి చేసుకుని తను అమెరిగా వెళ్ళిపోయాక, మాట్లాడటం మానేసింది. రోజుకొక్కసారైనా వాళ్ళమ్మతో మాట్లాడేది. రిటైరై నేను యింట్లో ఉన్నానని తెల్సినా 'నాన్నకివ్వు. మాట్లాడతాను' అనేది కాదు. దానికి కొడుకు పుట్టాక, వాళ్ళమ్మకు వీడియో కాల్ చేసి, తన కొడుకుని చూపిస్తూ మాట్లాడేది. తను హైస్కూల్ చదువులకు వచ్చినప్పటినుంచి నాతో ప్రచ్ఛన్న యుద్ధం చేస్తున్నట్టే ప్రవర్తించేది. ఎంతాలోచించినా కారణం అర్థమయ్యేది కాదు. ఇంజనీరింగ్ ఫైనల్ యియర్లో ఉన్నప్పుడు అపర్ణను కూడా అడిగాను. 'ఏమోనండీ.. నాకూ తెలియదు. దాన్నే అడగండి' అంది.

అడగాలంటే భయం.. ఏమంటుందోనని..

నా చిన్నప్పుడు నాన్నంటే భయం.. నాన్న అదుపాజ్ఞల్లో ఒద్దికగా బందీ అయిన బాల్యం నాది.. ఇప్పుడు నా కూతురికి భయపడాల్సి వస్తోంది. చిన్నప్పుడు తండ్రికి భయపడి, పిల్లలు పెద్దవాళ్ళయ్యాక వాళ్ళకు భయపడ్తున్న తరం మాది..కాలంలో ఎంత మార్పో..

నా భార్య గుండెపోటుతో హఠాత్తుగా చనిపోయే నాటికి తన వయసు యాభై ఏడేళ్ళే.. అమెరికా నుంచి శ్రీలేఖ తన భర్తతో పిల్లల్తో కలిసి వచ్చింది. కర్మకాండలు ముగిసేవరకు ముభావంగానే ఉంది. మాట్లాడకున్నా పర్వాలేదు, తన చూపు కూడా ఎంత ఇబ్బంది పెట్టిందో.. ఇక దాన్ని తట్టుకుని బతకడం దుస్సహమనిపించి, దానికి నామీదున్న కోపానికి కారణమేమిటో అడగడానికే నిశ్చయించుకున్నాను.

వాళ్ళు తిరిగి అమెరికాకు ప్రయాణమవ్వడానికి ఒకరోజు ముందు శ్రీలేఖతో మాట్లాడే అవకాశం దొరికింది. అల్లుడు పిల్లల్ని తీసుకుని బైటికెళ్ళాడు. శ్రీలేఖ సూట్కేసుల్లో బట్టలు సర్దుకుంటోంది.

'నాతో ఎందుకు మాట్లాడవు? నేనంటే ఎందుకు కోపం?' అని అడిగాను.

'మీరెప్పుడైనా నన్ను ప్రేమగా చూశారా? వూహ తెల్సినప్పటినుంచి అమ్మ ప్రేమ తప్ప తండ్రి ప్రేమ ఎలా ఉంటుందో తెలియకుండా పెరిగాను. ఓరకంగా చెప్పాలంటే సింగిల్ మదర్ పెంపకంలో పెరిగి నట్టే పెరిగాను. ఒంటరిగా అమ్మ నా కోసం, నా చదువు లకోసం ఎంత కష్టపడిందో నాకు తెలుసు. మీరెప్పుడైనా నా గురించి పట్టించుకున్నారా?' కోపంగా అంది.

నాకు నోటమాట పెగల్లేదు. నేను తనని ప్రేమించలేదా? నాకు పిల్లలంటే ఎంతిష్టమో నా భార్యకు తెలుసు. ఒక్కగానొక్క కూతురు.. ప్రాణం కన్నా మిన్నగా ప్రేమించాను కదా. కూతురిమీద ప్రేమ లేని తండ్రులు ప్రపంచంలో ఎక్కడైనా ఉంటారా?

'నువ్వంటే ప్రేమ లేకపోవడం ఏమిటి శ్రీ? ఎందుకలా అనుకుంటున్నావు?' అంటున్నప్పుడు నా గొంతు దుఃఖంతో వణికింది.

'ప్రేమించారా? ఏదీ ఒక్క ఉదాహరణ చెప్పండి?'' అంటూ నాకళ్ళలోకి సూటిగా చూస్తూ అడి గింది.

నేను శిలలా నిలబడిపోయాను. నాకు నా

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కూతురంటే ప్రేమ అని నిరూపించుకోడానికి రుజువులు చూపాలా? కొన్ని సంఘటనల్లోనో ఉదాహ రణల్లోనో ఒదిగేదా ప్రేమంటే? సంఘటనలకు ప్రేమకూ మధ్య సంబంధమేమిటో అర్థం కాలేదు.

కొన్ని క్షణాల విరామం తర్వాత శ్రీలేఖ నా వైపు నిరసనగా చూస్తూ అంది. "మాట్లాడరేం? నాకు తెలుసు ఏమీ చెప్పలేరని. ఎందుకంటే మీరెప్పుడూ నన్ను ప్రేమించలేదు కాబట్టి. తండ్రి ప్రేమ ఎలా ఉంటుందో తెలియకుండా పెరిగిన అభాగ్యురాలిని నేను" అంటూ కళ్ళు తుడుచుకుంది.

శ్వాసిస్తున్న శవంలా నడిచొచ్చి, హాల్లో సోఫాలో కూచున్నాను.

నా భార్య కడుపుతో ఉన్నట్టు చెప్పిన ఆ క్షణం.. ఎంత ఆనందించానో గుర్తుకు వస్తే, ఇప్పుడూ కన్నీళ్ళు వచ్చేస్తాయి. తండ్రి కాబోతున్నానన్న సంబరం.. అందని ఆకాశాన్ని అందుకున్నట్టు.. స్వర్గం మా యింటి తలుపు తడుతున్నట్టు.. వసంతం వాకిట్లో నిలబడి, లోపలికి రావడానికి ఉవ్విళ్ళూరుతున్నట్టు.. అది కాబోయే ఓ తండ్రికి మాత్రమే అర్థమయ్యే ఆనం దానుభూతి.. అనుభవంలోకి వస్తేనే తెలిసేది తప్ప మాటల్లో ఒదగని మధురానుభూతి..

రెండు మూడు రోజుల్లో ప్రసవం జరగొచ్చని గైనకా లజిస్ట్ చెప్పడంతో సికింద్రాబాద్ నర్సింగ్ హోంలో చేర్పించాను. మరుసటిరోజు రాత్రి ఒంటిగంటకు తనకు నొప్పులు మొదలయ్యాయి. నర్సులు గైనకా లజిస్ట్‌కి ఫోన్ చేసి, అపర్ణని డెలివరీ రూంలోకి తీసుకె ళ్ళిపోయారు. మరో అరగంటకు గైనకాలజిస్ట్ వచ్చింది. నేను బైట కూచుని, కాన్పు అయిందన్న వార్త కోసం ఆరాటంగా ఎదురుచూస్తున్నాను.

మరో అరగంట గడిచింది. గైనకాలజిస్ట్ బైటికి రావడం గమనించి ఆత్రుతగా ఆమెకు ఎదురెళ్ళి నిలబడ్డాను.

'బిడ్డ అడ్డం తిరిగిందండి. ఫ్లెక్సెడ్ బ్రీచ్.. నార్మల్ డెలివరీకి అవకాశమే లేదు. సిజేరియన్ చేయాలి. నర్సు చేత ఇన్‌ఫార్మ్‌డ్ కన్సెంట్ ఫాం పంపిస్తాను. సంతకం చేయండి' అంది.

నాలో జడలు విప్పుకుంటూ భయం.. 'తల్లీ బిడ్డకు ఏమైనా ప్రమాదమా మేడం?' వణికే గొంతు తో అడిగాను.

'తొందరగా ఆపరేషన్ చేసి బిడ్డను బైటికి తీయకపోతే, ఇటువంటి కేసుల్లో బొడ్డుతాడు ప్రొలాప్స్ అయి, బిడ్డ గొంతుకి అడ్డుపడే ప్రమాదముంది. ఆపరేషన్‌కి బ్లడ్ కూడా అవసరం పడొచ్చు. మీ భార్యది ఏ నెగటివ్ బ్లడ్ గ్రూప్. వెంటనే దగ్గర్లో ఉన్న ఏదైనా బ్లడ్ బ్యాంక్‌కి వెళ్ళి మూడు బాటిల్స్ పట్టుకురండి' అంటూ మరో మాటకు తావివ్వకుండా లోపలికెళ్ళి పోయింది.

నాలుగు కిలోమీటర్ల దూరంలో ఓ బ్లడ్ బ్యాంక్ ఉందని నర్స్ చెప్పడంతో, బైటికి పరుగెత్తాను. అప్పటికింకా స్కూటర్ కొనలేదు. బ్యాంక్ ఉద్యోగంలో చేరి మూడేళ్ళు. నలభై యేళ్ళ క్రితం స్కూటర్ కూడా లగ్జరీనే. నేను ఆఫీస్‌కి బస్‌లలోనే వెళ్ళి వస్తుండేవాణ్ణి.

రోడ్డు దాదాపు నిర్మానుష్యంగా ఉన్నాయి. పరుగె త్తుతూనే ఆటోలేమైనా దొరుకుతాయని ఆశగా వెతు క్కుంటున్నాను. సెకండ్ షో సినిమాలు వదిలేసి చాలా సమయం కావడంతో ఆటోలేమీ కన్పించ లేదు. ఆలస్యమైతే పుట్టబోయే బిడ్డకేమైనా అవుతుందేమోనన్న భయంతో పరుగెత్తుతున్నాను. వొళ్ళంతా చెమటతో తడిచిపోయింది. ఆయాసం వస్తోంది. రొప్పుతూనే పరుగెత్తుతున్నాను.

ఎంత దూరం పరుగెత్తానో తెలియడం లేదు. యింకా ఎంత దూరం పరుగెత్తితే బ్లడ్ బ్యాంక్‌ని చేరుకుంటానో తెలియడం లేదు. కళ్ళలోంచి నీళ్ళు అనాయాసంగా కారిపోతున్నాయి. మనసులో ఎంతమంది దేవుళ్ళకు మొక్కుకున్నానో, నా భార్యాబిడ్డలు క్షేమంగా ఉండాలని.. ఓ మలుపు తిరిగే చోట ఎవరో స్కూటర్లో వేగంగా వచ్చేసి, నన్ను చూసి కంగారుపడి, వెంటనే బండిని పక్కకు కోశాడు. నేను కిందపడిపోయాను. చేతులూ కాళ్ళూ దోక్కుపోయి మంట పుట్టసాగాయి. ఇరవై యేళ్ళ కుర్రవాడు.. నన్ను లేపి, బట్టలు దులుపుతూ 'సారీసార్.. సారీ సార్' అంటున్నాడు.

తల దిమ్ముగా మారి, కొన్ని క్షణాలు అయోమ యానికి లోనైనాను.

'హాస్పిటల్‌కి వెళ్దాం రండి' అంటున్నాడా కుర్రాడు. అప్పుడు స్పృహలో కొచ్చాను.

'మొదట బ్లడ్ బ్యాంక్ దాకా లిఫ్ట్ ఇవ్వగలవా?' అని అడిగాను.

అతను అంగీకారసూచకంగా తల వూపడంతో స్కూటర్ వెనక కూచున్నాను.

'ఏ నెగటివ్ బ్లడ్ గ్రూప్ చాలా రేర్ గ్రూప్ అండి. మా దగ్గర ప్రస్తుతానికి ఆ గ్రూప్ బ్లడ్ లేదు' చావు కబురు చల్లగా చెప్పినట్టు అన్నాడు బ్లడ్‌బ్యాంక్‌లోని వ్యక్తి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

నాలో ఒక్కసారిగా భయం లావాలా ప్రవహించ సాగింది.

'ఈ పక్కనే మరో బ్లడ్ బ్యాంక్ ఉంది. ఉండండి కనుక్కుంటాను' అంటూ అతనే ఫోన్ చేశాడు. 'మీరు లక్కీ సర్. ఏ నెగటివ్ రక్తం ఉందట. వెళ్ళండి' అన్నాడు.

పోయిన ప్రాణం తిరిగొచ్చినట్లనిపించింది.

మూడు బాటిల్స్ కొనుక్కుని, స్కూటర్ మీద కూచుని, ''సికింద్రాబాద్ హాస్పిటల్‌కి స్పీడ్‌గా పోనివ్వు' అన్నాను. అతను ఎంత స్పీడ్‌గా నడుపుతున్నా ' ప్లీజ్ యింకా స్పీడ్‌గా పోనీ' అంటూ ఎన్ని సార్లు బతిమాలు కున్నానో..

హాస్పిటల్ని చేరుకోగానే, అతనికి థ్యాంక్స్ చెప్పి ఆపరేషన్ థియేటర్‌వైపుకు పరుగెత్తాను. అప్పుడే థియేటర్లోంచి బైటికొస్తున్న నర్స్ నన్ను చూసి, 'కంగ్రా చ్యులేషన్స్. మీకు ఆడపిల్ల పుట్టింది' అంటూ నవ్వింది.

'మరి ఈ బ్లడ్ బాటిల్సో...' చేతిలో ఉన్న బాటిల్స్ వైపు చూపిస్తూ అన్నాను.

'రిసెప్షన్‌లో డిపాజిట్ చేసేయండి. మాదగ్గర రెండు బాటిల్స్ రక్తం ఉంటే ఎక్కించేశాం' అంది.

వాళ్ళ దగ్గర రెండు బాటిళ్ళ రక్తం ఉన్న విషయం ముందే చెప్పిఉంటే ఇంత హైరానా పడే వాడిని కాదు కదా అన్పించింది.

పాప ఎంతందంగా ఉందో... ఎంత పెద్ద కళ్ళో విరిసిన తెల్లగులాబీల్లా.. పెదవులు ఎంత ముద్దుగా ఉన్నాయో ఎర్రటి గుల్‌మొహర్ పూరేకుల్లా..రోడ్డు మీద పరుగెత్తుతున్నప్పుడు భయంతో ఏడుపు వస్తే, పాపను చూసిన వెంటనే సంతోషంతో ఏడుపు వచ్చేసింది.

ఇదంతా నా కూతురి మీద ప్రేమ లేకుండానే జరిగిందా? కానీ రక్తపు బాటిళ్ళ కోసం నేనెంత కష్టపడ్డానో నా భార్యతో ఎప్పుడూ చెప్పలేదు. పెద్దయ్యాక శ్రీలేఖతో కూడా చెప్పలేదు. ఆ విషయం చెప్పాల్సిన అవసరం ఏముందని? నా భార్య కోసం, నా కూతురి కోసమేగా కష్టపడ్డాను.. వాళ్ళ మెప్పు పొందడానికి చెప్పాలా? అది నా బాధ్యత కదా.

నా భార్యమీద నాకెంత ప్రేమో నాకు తెలుసు. ఆకాశమంత విశాలమైన ప్రేమ.. సముద్రమంత లోతైన ప్రేమ.. కానీ ఎప్పుడూ నా భార్యతో ఈ విషయం చెప్పలేదు. మాటల్లో వ్యక్తీకరిస్తేనే అర్థమ య్యేంత బలహీనమైనదా ప్రేమ? చూడటం ఎలాగో తెలిస్తే, ఎదుటి వ్యక్తి కళ్ళలో మెరుపై కన్పిస్తుంది కదూ. వాళ్ళ బాధ్యతల్ని సంతోషంగా స్వీకరిస్తున్నప్పుడు, ప్రతి అవసరాన్ని జాగ్రత్తగా గమనిస్తూ, వాటిని వెంటనే తీరు స్తున్నప్పుడు, నక్షత్రాలని తెంపుకుని రమ్మని కోరితే, ఆకాశం పైకి ఎగిరినపుడు.. తెలుస్తుందిగా అది ప్రేమే అని.. దేహభాషను అర్థం చేసుకోవడం తెలిస్తే కదా ప్రేమ ఎన్ని కావ్యాలుగా లిఖించబడుతూ ఉందో అర్థమయ్యేది.

'నా మీద ప్రేమ ఉంది అనడానికి ఒక్క ఉదాహరణ చెప్పండి' అని నా కూతురు అడిగినట్లు, ఈ లోకంలో ఏ కూతురూ ఏ తండ్రినీ అడిగి ఉండదేమో. కూతురి ముందు నిలబడి సంజాయిషీ ఇచ్చుకో వాల్సిన దుస్థితి ఏ తండ్రికీ రాకూడదు. పగవాడికి కూడా ఇలాంటి శిక్ష పడకూడదు.

దానికి ఐదేళ్ళు వచ్చేవరకు నా పోస్టింగ్ హైద్రాబాద్‌లోనే కొనసాగింది. ప్రతి పుట్టినరోజు వేడుకు ఎంత బాగా జరిపేవాళ్ళమో.. దానికి తన పుట్టినరోజులంటే ఎంతిష్టమంటే నెలరోజుల ముందు నుంచే 'నా హ్యాపీ బర్త్ డే వచ్చేస్తోంది' అనుకుంటూ ఎదురుచూసేది.

హైద్రాబాద్‌లో ఎనిమిదేళ్ళనుంచి పాతుకుపోయి ఉన్నానన్న కారణంతో ప్రమోషన్ ఇచ్చి బెంగు ళూరుకి బదిలీ చేశారు. ఆ తర్వాత ప్రతి మూడేళ్ళకోసారి బదిలీ మీద వేర్వేరు ప్రాంతాలకు, వేర్వేరు రాష్ట్రాలకు వెళ్ళాల్సి వచ్చింది. ఎంత దూరంలో పోస్టింగ్ ఉన్నా శ్రీలేఖ బర్త్‌డేకి మాత్రం హాజరు కావడా నికే ప్రయత్నించే వాడిని. కొన్నిసార్లు పని వత్తిడి వల్ల వీలయ్యేది కాదు. మొదట్లో తన బర్త్‌డే ఫంక్షన్లో నేనుండాలని పట్టుబట్టిన శ్రీలేఖ తర్వాత్తర్వాత నా కోసం ఎదురుచూడకుండానే పుట్టినరోజులు జరుపుకో సాగింది. తన అన్ని అవసరాల్ని వాళ్ళమ్మే తీర్చేది. తనకేం కావాలన్నా వాళ్ళమ్మనే అడిగేది. తన మనసు లోని మాటల్ని వాళ్ళమ్మతోనే పంచుకునేది.

నేనెప్పుడైనా శెలవ పెట్టి యింటికొచ్చినా నా ఉనికిని పట్టించుకునేది కాదు.

'ఎందుకు శ్రీ నాతో అంటీముట్టనట్టు ఉంటోంది?' అని నా భార్యనడిగానో సారి.

'అమ్మాయి పెద్దదవుతోందిగా. దాని ప్రపంచంలో అది ఉంటోంది. ఇప్పటి పిల్లలందరూ ఇలానే ఉన్నారు. వాళ్ళతో పోలిస్తే ఇంకా మన పిల్ల నయం' అంది అపర్ణ.

'అదేంటి? తండ్రీకూతుర్ల మధ్య ఉండే అనుబంధం అపూర్వం, అలౌకికం అని అంటారు కదా. నాకూ నా కూతురికి మధ్య ఈ దూరం ఎందుకుంది?' అని అడిగాను.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

‘అనుబంధం ఏర్పడాలన్నా, ఏర్పడిన అనుబంధం బలపడాలన్నా మొదట సాన్నిహిత్యం ఉండాలి గా. మీరు శ్రీతో కలిసి గడిపిన సమయం ఎంత? దానికి ఐదేళ్ళ వయసప్పటినుంచి ట్రాన్స్‌ఫర్లంటూ వూళ్ళు పట్టుకుని తిరుగుతున్నారాయె. నేను ఇరవై నాలుగ్గంటలూ దానికి అందుబాటులో ఉండడం వల్ల నాతో చనువు పెరిగింది. ఐనా మీరన్నా కూడా దానికి ప్రేమే. అది మీలానే బైటికి వెల్లడించదు. అంతే’ అంది.

పదవీ విరమణకి మరో ఐదేళ్ళ సమయం ఉందనగా, నా అభ్యర్థన మీద మళ్ళీ హైద్రాబాద్‌లో పోస్టింగ్ ఇచ్చారు. అప్పటికే శ్రీకి పెళ్ళయి, ఇద్దరు పిల్లలు.. అమెరికాలోని ఫీనిక్స్‌లో స్వంత యిల్లు కొనుక్కుని, అక్కడ సెటిలైపోయారు. ఎప్పుడో ఏడాదికో రెండేళ్ళకో ఒకసారి వచ్చేది. వారం రోజులు వాళ్ళమ్మతో గడిపి, మరో రెండు వారాలు వాళ్ళ అత్తవాళ్ళతో గడిపి, తిరిగెళ్ళిపోయేది. యింట్లో ఉన్న వారం రోజులు కూడా నాతో సరిగ్గా మాట్లాడేది కాదు. ముభావంగానే ఉండేది.

ఎంతాలోచించినా నేను శ్రీకి కోపం తెప్పించే పనులు ఏం చేశానో గుర్తుకు రావడంలేదు. పదో తరగతి చదువుతున్నప్పుడు క్వార్టర్లీ, హాఫియర్లీ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చినందుకు కోప్పడ్డాను. కోప్పడ్డాను తప్ప తిట్టలేదే. తన మంచి కోసమేగా మందలించాను. తను బాగా చదువుకుని, మంచి ఉద్యోగంలో స్థిరపడాలనే ఆశతోనేగా అలా చేశాను. తండ్రిగా అలా కోరుకోవడం తప్పా?

ఇంటర్లో ఉన్నప్పుడు గంటలు గంటలు మొబైల్ ఫోన్లో మాట్లాడుతుంటే, మందలించాను. అలానే చేస్తూ ఉంటే ఫోన్ లాగేసుకోవాల్సి వస్తుందని చెప్పాను. అది తప్పా? నిద్ర పోకుండా ఫోను మాట్లాడితే దాని ఆరోగ్యం పాడైపోతుందేమోననే భయంతో కదా అలా హెచ్చరించాను. అలా సమయం వృధా చేయడం వల్ల చదువు పాడవుతుందనే బెంగతో కదా అలా చెప్పాను. మగ పిల్లలతో మాట్లాడటం తప్పని చెప్పలే దే. జాగ్రత్తగా ఉండమని చెప్పాను.

ఇంజనీరింగ్‌లో కాలేజీకి చున్నీ లేకుండా వెళ్తుంటే చూసి ‘చున్నీ మర్చిపోయినట్టున్నావు. వేసు కుని వెళ్ళు’ అన్నాను. తనకెంత కోపం వచ్చిందో.. ‘నాకిష్టమొచ్చినట్టు డ్రెస్ చేసుకునే స్వతంత్రం కూడా నాకు లేదా’ అంటూ విసురుగా వెళ్ళిపోయింది.

నిజమే. తన పుట్టినరోజు వేడుకలకు పని వత్తిడి వల్ల వెళ్ళలేకపోయిన సందర్భాలు చాలానే ఉన్నాయి. చిన్నతనంలో అలిగి కూచునేది. పెద్దయ్యాక అయినా. నా పరిమితుల్ని అర్థం చేసుకోవాలిగా. వందల మైళ్ళ దూరం ప్రయాణం చేయడం అంటే శ్రమతో పాటు ఖర్చుతో కూడుకున్న వ్యవహారం. శెలవలు కూడా దొరకాలిగా. బర్త్‌డేకి గిఫ్ట్‌లు పంపేవాడిని. కొన్నిసార్లు గిఫ్ట్‌లు పంపలేకపోయాను. అందుకని వాళ్ళమ్మతో ‘నాన్నకు నేనంటే ప్రేమ లేదు’ అన్నదని తెలిసి ఎంత బాధపడ్డానో నాకే తెలుసు. పుట్టిన రోజు ఫంక్షన్‌కి హాజరైతేనే ప్రేమ ఉన్నట్టా? ఖరీదైన బహుమతులిస్తేనే ప్రేమ ఉన్నట్టా? ఇలాంటి చిన్న చిన్న కారణాలతోనే నాకు తనంటే ప్రేమ లేదని నిర్ధారించుకుని నామీద వ్యతిరేకతని పెంచుకోవ డం న్యాయమా?

ఇవే ఆలోచనల్తో రాత్రి నిద్ర పట్టలేదు. రేపైనా అమ్మాయి నుంచి ‘పుట్టినరోజు శుభాకాంక్షలు నాన్నా’ అంటూ కనీసం మెసేజైనా వస్తుందని ఆశ.. వస్తుందా?

దానికి రెండేళ్ళ వయసున్నప్పుడు బాగా జబ్బు చేసింది. డాక్టర్ ప్రేమ్‌నారాయణ గారి నర్సింగ్ హోంలో చేర్పించాను. ‘పాప కండిషన్ సీరియస్‌గానే ఉంది. ఇరవై నాలుగు గంటలు గడిస్తే కానీ ఏమీ చెప్పలేను’ అన్నాడు డాక్టర్. అతనలా అనగానే నా గుండె జారిపోయింది. భయం పట్టుకుంది. నా కూతురికేమైనా అయితే నేను తట్టుకోగలనా? లేదు. ‘మీ కాళ్ళు పట్టుకుంటాను. నా కూతుర్ని ఎలా అయినా బతికించండి’ అంటూ కన్నీళ్ళతో వేడుకున్నాను. భగవంతుని దయవల్ల దానికి జబ్బు నయమైంది.

ఈ విషయం కూడా నేనెప్పుడూ అపర్ణకి గానీ, శ్రీకి గానీ చెప్పలేదు. ప్రేమ ప్రచారం చేసుకునే విషయం కాదుగా. తండ్రి ప్రేమను అర్థం చేసుకోవాల్సింది పిల్లలే కదా. మనం చెప్పినా నమ్ముతారా? అయినా ఎందుకు చెప్పాలి? పిల్లలనుంచి ప్రేమను ఆశించి చెప్పాలా? అడిగితేనే దొరికేదాన్ని ప్రేమంటారా? పూలలోని మృదు పరిమళమల్లే అది సహజంగా ఏర్పడాలి కదా.

దానికి ఐదేళ్ళప్పుడు స్కూల్లో పరుగెత్తే ఆట ఆడుతూ పడిపోయింది. మెట్టు అంచుకి తల తగలడం వల్ల చిట్టి రక్తం కారుతోందని ఫోన్ వస్తే ఎంత ఆందోళన పడ్డానో నాకే తెలుసు. నాలుగు కుట్లు వేయాల్సివస్తుందని, తల కాబట్టి మత్తుమందు ఇవ్వడానికి అవకాశం లేదని డాక్టర్ చెప్పినపుడు, బాధకు ఎలా తట్టుకుంటుందో నా చిట్టి తల్లి అంటూ ఎంత వేదన చెందానో.. ఇద్దరు నర్సులు దాన్ని కదలకుండా గట్టి గా పట్టుకున్నాక, డాక్టర్ కుట్లు వేస్తున్నప్పుడు అది పెద్ద పెద్దగా కేకలు పెడుతూ ఏడుస్తుంటే, దాని బాధంతా నా గుండెల్లోనేగా ప్రతిధ్వనించింది.. ఇంక

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

తట్టుకోవడం నా వల్ల కాదనిపించి, బాత్రూంలోకి దూరి, ఎంత సేపు ఏడ్చానో..అపర్ణకు తెలిస్తే బాధపడ్తుందని, మొహం కడుక్కుని కదా బైటికొచ్చాను.

బదిలీల మీద వేరే వూళ్ళలో ఉద్యోగం చేస్తున్నా, ప్రతిరోజూ అది ఎలా ఉందో అని అపర్ణని అడిగి కనుక్కోకుండా నిద్ర పోయిందెపుడని? దాని ప్రతి అవసరాన్ని తీర్చాను కదా. శ్రీ కోరుకున్న ఇంజనీరింగ్ కాలేజీలోనే దానికిష్టమైన బ్రాంచ్‌లోనే చేర్పించి చదివించాను కదా.

దానికి పెళ్ళీడు వచ్చినపుడు, హైద్రాబాద్ సంబంధాల్నే వెతకడానికి కారణం ప్రేమేగా.. పెళ్ళయినా అది హైద్రాబాద్‌లో కాపురం ఉంటే మా కళ్ళెదురుగా ఉంటుందని ఆశపడటం ప్రేమవల్లకాదా..సీతాదేవి అగ్నిలో దూకి పునీత అయినట్టు, ఏ నిప్పుల గుండంలో దూకి నా ప్రేమను రుజువు చేసుకోవాలో తెలి యడం లేదే. తనో అబ్బాయిని ప్రేమించాననీ, అతను అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పని చేస్తున్నాడని చెప్పినపుడు, పెళ్ళయ్యాక తను దూరంగా వెళ్ళిపోతుందన్న బాధని మనసులో దాచుకుని, అది సంతో షంగా ఉంటే చాలనుకుని, ఆ అబ్బాయితోనే పెళ్ళి చేయడం నా ప్రేమకు నిదర్శనం కాదా?

నా స్వగతంలో అయినా ఇలా సంజాయిషీ యిచ్చుకుంటుంటే సిగ్గనిపిస్తోంది.

తండ్రి తమకు దూరంగా అక్కడెక్కడో అవస్థలు పడి సంపాయిస్తోంది తమ కోసమే అని, అందులోనే ప్రేమ దాగుందని ఈ పిల్లలకు ఎప్పుడు అర్థమౌతుందో..

తెల్లవారింది. నాకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతూ ఎవరెవరినుంచో ఫోన్లు, మెసేజ్‌లు రావడం మొదలైంది. ఆఫీస్‌లో నాతోపాటు పనిచేసిన వాళ్ళ దగ్గరనుంచి, బంధువుల నుంచి, స్నేహితు ల నుంచి.. శ్రీనుంచి వస్తుందేమోనని ఎంతలా ఎదురు చూశానో.. ఫీనిక్స్‌కి, ఇక్కడికి సరిగా పన్నెండు గంటల వ్యత్యాసం ఉంది. ఇక్కడ సాయంత్రం అయితే గాని అక్కడ ఉదయం కాదు. అందుకే మెసేజ్ సాయంత్రానికి వస్తుందని ఆశ..రాత్రి పది దాటినా రాలేదు. పదకొండు వరకు ఎదురుచూసినా రాలేదు. ఇక రాదని అర్థమైపోవడంతో అనంత నిరాశ కొండచి లువలా నన్ను చుట్టేసి, బలంగా పిండేయసా గింది.

'నా మీద ప్రేమ ఉందని చెప్పడానికి ఒక్క ఉదాహరణ చెప్పండి' అని శ్రీ అడిగినపుడు చిన్నపిల్లని బుజ్జగించి నచ్చచెప్తున్న ధోరణిలో నేను చెప్పిన నాలుగు మాటలు తనకు గుర్తున్నాయో లేవో? ఎందుకు గుర్తుండవూ.. ఎటొచ్చీ సరిగ్గా అర్థమై ఉండవు. అర్థమైతే ఇలా ప్రవర్తించదేమో..

'నాకు నువ్వంటే చాలా ప్రేముంది. కానీ దాన్ని ఎలా నిరూపించుకోవాలో ఈ అమాయక తండ్రికి అర్థం కావడం లేదు తల్లీ. సరే, నాకు నీ మీద ప్రేమ లేదనే అనుకుందాం. ఐనా తండ్రిగా నీ ప్రతి బాధ్యతని సక్రమంగా నిర్వర్తించాను కదా. నీ తిండికి, బట్టలకు, చదువులకు అవసరమైనవన్నీ సమకూర్చాను కదా. నువ్వు కోరుకున్నవాడితోనే పెళ్ళి జరిపించాను కదా. నువ్వూ అమ్మా సుఖంగా సంతోషంగా ఉండాలనేగా ఎక్కడెక్కడికో బదిలీ అయినా అక్కడికెళ్ళి ఉద్యోగం చేశాను. నాది ప్రేమ కాదు బాధ్యతే అనుకో. ఇప్పుడు నువ్వు కూడా తిరిగి నీ బాధ్యతను తీర్చుకోవాలిగా. నన్ను నువ్వు పోషించక్కరలేదు. నాకొచ్చే పెన్షన్ నా అవసరాలకు సరిపోతుంది. కనీసం నెలలో ఒక్కసారైనా 'ఎలా ఉన్నారు నాన్నా' అని పల్కరించు చాలు. ఏ పండక్కో పబ్బానికో 'శుభాకాంక్షలు నాన్నా' అంటే చాలు. సంతోషపడిపోతాను' అన్నాను.

శ్రీ మొహం తిప్పుకుని వెళ్ళిపోయింది తప్ప, సమాధానమేమీ చెప్పలేదు.

నేనన్న మాటల్లోని ఆర్తి, ఆవేదన తనకెప్పుడైనా అర్థమౌతాయా? కూతురు వేసిన ఈ శిక్షను మోస్తూ అప్పటివరకు నేను బతికుంటానా?

'నాన్నెందుకో వెనకబడ్డాడు' కవితలోని పాదాలు మదిలో మెదిలాయి. 'పిల్లల ప్రేమలు పొందడంలో తర తరాలుగా/ నాన్న ఎందుకో వెనకడ్డాడు/కుటుంబం కోసం ఎంత చేసినా తగిన గుర్తింపు తెచ్చుకోవడంలో/ నాన్నెందుకో పాపం బాగా వెనకపడ్డాడు./ నాన్న అలా వెనకబడడానికి కారణం/ ఆయన మాకు వెన్నెముక కావడమేనేమో,' అనే వాక్యాలు గుర్తుకు రాగానే వెనకబడిపోయిన తండ్రులందర్నీ తల్చుకుని నాకు కన్నీళ్ళు బొటబొటా కారిపోయాయి.

గోడ మీద వేలాడదీసి ఉన్న క్యాలెండర్ గాలికి కదుల్తూ శబ్దం చేస్తూ ఉండటంతో, ఆలోచనలకు అడ్డుకట్ట పడింది. కన్నీటితో మసకబారిన కళ్ళను తుడుచుకుంటూ క్యాలెండర్ వైపు చూడగానే చప్పున గుర్తొచ్చింది. నా బంగారు తల్లి శ్రీలేఖ పెళ్ళి రోజు మరో పది రోజుల్లో ఉందని. వొంట్లోకి విద్యుత్ ప్రవాహంలా ఉత్సాహం ఉరకలెత్తింది. మంచి గిఫ్ట్ కొని అమెరికాకి పంపించాలి. ఈ రోజుల్లో పిల్లలకు అర్థమయ్యే ప్రేమ భాష అదేగా.

..ఈనాడు ఆదివారంలో ప్రచురితం

కథ

# మరో గాలివాన

బట్టేపాటి జైదాస్
94925 78581

"యాక్ థూ! నీ బతుకు చెడ! నీకిదేం పాడు బుద్ధిరా.. కులంలేని పిల్లని పెళ్లిచేసుకొని కులుకుతావా? మన పరువు మర్యాద మంట గలుపుతావా? అసలు నీ కులమేంటో యాదిలో ఉందట్రా నీకు? చస్తే నేనొప్పుకోనుగాక ఒప్పుకోనంతే..'' దాదాపు అరుస్తున్నట్టుగా అన్నాడు వీర్రాఘవయ్య.

''సచ్చాక నువ్వు ఒప్పుకొనేదేముంది డాడ్! అప్పుడంతా నా ఇష్టమేగా.. అంతదాకా ఎందుకనే చెపుతున్నా. ప్రస్తుత పరిస్థితుల్లో కాలం చెల్లిన మీ అభిప్రాయాలకు విలువ లేదు. మనం బాగుండాలంటే రాజీపడక తప్పదు. లేనిపోని పట్టింపులకు పోయి జీవితాన్ని నరకం చేసుకోవడం అవసరమా? ఏ వయసుకాముచ్చట అంటారు. దేనికీ కొదవ లేకున్నా, అవకాశాలన్నీ వదులుకొని వయసులో ఏదీ అనుభవించలేని స్థితి కోరి తెచ్చుకోవడమెందుకు? మనోళ్లలో అమ్మాయిలు దొరకడమే అపురూపంగా ఉంటే.. ఎవరో ఒకరిని చేసుకొని, గుండెల నిండా ప్రేమకు బదులు బాధ నింపుకొని జీవితాంతం భరించాల్సినంత ఖర్మ మనకెందుకు డాడ్. హాయిగా మనసుకు నచ్చినదాన్ని చేసుకుంటే ఆ ఆనందమే వేరుకదా! అయినా ఈ రోజుల్లో మనిషి, మనసు, గుణ, గణాలు ముఖ్యంకానీ.. కుల, మతాలు కాదుకదా! మీరే ఆలోచించండి..''

స్థిరంగా అన్నాడు వీరా. ఆలోచనలో పడ్డాడు వీర్రాఘవయ్య. కానీ, అది కొడుకు మాటల గురించి కాదు. కొడుకు తీరు గురించి.

ఈ కాలపు పిల్లలకు పెద్దల మాటలపై ఏమాత్రం గౌరవం లేదు. అయినా నా కొడుకు జీవితానికి అతి ముఖ్యమైన ఈ ఒక్క విషయంలోనే మాట వినడం లేదు. ఇప్పుడే మిటి చేయడం? అనే ఆలోచిస్తున్నాడు అతను. కొడుకు గురించి తనెంతగా గర్వంతో విర్రవీగేడు. కొడుకు సుఖసంతోషాల కోసం తనెంత తపన పడ్డాడు. కానీ, ఇప్పుడెందుకిలా తయారైనట్టు? విదేశీ సంస్కృతి ప్రభావమా..?! అదే అయితే తామే కదా సంపాదన కోసం, సొసైటీలో సోకుల కోసమని అమెరికాకు పంపింది. మరిప్పుడు తప్పెవరిది? పంపిన తనదా? తన 'ఆశ'యాల మేరకు అక్కడికెళ్లిన తన కొడుకుదా..?.. ఆలోచనలు ఎటూ తెగకపోగా, పుత్రరత్నం చేసిన ఘనకార్యం కళ్లలో మెదిలింది.

* * *


గోదావరి, శబరి నదుల పవిత్ర సంగమం. పాపికొండల నడుమ ప్రకృతి సోయగాలతో సూర్యోదయ మవుతోన్న సుప్రభాతవేళ. అందమైన పాపికొండల ఒడిలో ఒదిగివున్న 'కూనవరం'.. ప్రకృతి ప్రసాదించిన ఓ 'చిన్న వరం' అయినా.. ఆ ప్రకృతే ఆడే ఆటలో ఓ పావు. ఆ ఉషోదయపు కాంతిలో ఊరి కామందు ఇంటి ముందు 'ఇల్లు కిరాయికి ఇవ్వబడును' అన్న బోర్డు చూసి, ఓ క్షణం ఆగిపోయాడు రామప్ప పంతులు. 'ఓహో ఇట్లాకూడా సంపాదించ బోతున్నారన్నమాట' అనబోతూ.. అంతలోనే ఖంగు తిన్నాడు, దానికిందనే 'మా కులపోళ్లకు మాత్రమే' అని చిన్న అక్షరాలతో, ఇప్పుడొస్తోన్న సిగ్గు, శరం లేని సినిమా పేర్లకింద క్యాప్షన్‌లాగే రాసి ఉండటం చూశాడు. 'ఇదేమి పిదప కాలం' అనుకుంటూ ముక్కుమీద వేలేసుకుని అలాగే నిలబడిపోయాడు. ఎప్పుడొచ్చాడో ఏమో..

''ఏమయ్యా పంతులూ! ఆగిపోయావేంటయ్యా! ఏడు గొట్టకముందే పంచె ఎగబట్టుకుని వొచ్చేసావంటే.. ఏదో అచ్చొచ్చే అలయెన్సే అయ్యుండాలే! రావయ్యా.. రా!''.. వాకిట్లో నిలబడి అంటున్న వీర్రాఘవయ్యను చూసి..

'కొంపదీసి నేను మనుసులోది కూడా పైకి అనలేదుకదా!' అని తడబడ్డాడు రామప్ప పంతులు. అంతలోనే తేరుకొని..

''ఆ ఆం.. అవునండీ! మీ అబ్బాయికో సొగసైన సమ్మంధం ఉందండీ. రేపు వాళ్లే వస్తారట. అది మీ చెవిన వేద్దామని తెల్లారగట్లే తయారై వచ్చేను'' అన్నాడు.

''ఇదిగో పంతులూ! వచ్చిన ప్రతిసారీ నువ్వొకటి తీసుకు రావడం, మేము దాన్ని తిప్పికొట్టడం ఆనవాయితీ అయిపోయింది. నిప్పులు కడిగిన వంశం మాది. మేమేమిట్లో మీకు తెలియంది గాదు. ముందు కులం ఆ తరవాతే గుణం. మా



స్థాయికి కొంచం కూడా తగ్గేది లే! అది యాదిలో ఉంచుకొని ఈ సారన్నా వ్యవహారం పక్కాగా ఫైనల్ చేయండి. ఇక లాంఛనాలు అవీ అంటారా.. ప్రత్యేకంగా చెప్పేదేముంది. కనీసం ఓ 'కోట'న్నా ఉండాలి.''

''ఇంతకీ మీకు ఏ రంగు కావాలండీ! నల్ల కోట్లా.. తెల్ల కోట్లా?''

ఆ ప్రశ్నకి.. 'అబ్బో.. మంచి కళా పోసకుడిలా గున్నావే..' అనుకున్న వీర్రాఘవయ్య..

''ఇదిగో పంతులూ! పరాచికాలకేం తక్కువ లేదే! నేను చెప్పేది సూట్లు కాదయ్యా! కోట్లు.. నెట్ క్యాష్.. ఎంతలేదన్నా ఓ కోటి రూపాయలు క్యాష్ ఫ్లో ఉండాలి.. అర్థమైందా..?''

''అమ్మమ్మా! ఎంత మాట. నేను చెప్పింది కూడా ఆ కోట్ల క్యాష్ ఫ్లో గురించేనండి..''

''మరి రంగులు అడుగుతావేంటయ్యా!?''

''అబ్బా.. మీరు నన్ను మరీ ఇబ్బంది పెట్టేస్తు న్నారండోయ్! అసలు కావాల్సింది రంగే కదా! అదేనండీ.. 'బ్లాక్ మనీయా, వైట్ మనీనా' అని అడుగుతున్నా..''

''చంపావు కదయ్యా పంతులు! కూసింతైనా దూరాలోచన ఉంటుందని నేననుకో లేదే..''

''భలే వారే! ఆ మాత్రం ఖలేజా లేకపోతే ఈ ఖమ్మం జిల్లాలో, అందులోనూ కూనవరంలో కొలువును ఇంత కమ్మగా ఎలా చేయగలనండి..''

''సరి సర్లేగాని.. ఆ అలయెన్స్ కథా కమామీషు ఏంటో వేగిరం వెళ్లి కనుక్కుని చల్లని కబురు చెవిన వేయండి. ఈసారి గోదారి పెరిగి వరదల్లో చిక్కుకోకముందే అన్నీ అయిపోవాలి సుమా. లేట్టైందనుకో.. అటు వానలొచ్చి వరద పెరిగినా, ఇటు అబ్బాయి అమెరికాకి తిరిగిపోయినా ఏదీ కుదిరి చావదు. ఇప్పటికే పుణ్యకాలం కాస్తా పూర్త యిపోతోంది. వయసు ముదిరిన బెండకాయ చందాన అవుతోంది''

''ఆ.. అC ఈ ఈతి బాధలన్నీ మనకు ఏటా ఉండేవే కదండీ! అయినా మీకెన్నో సార్లు చెప్పి చూసాను కదండీ.. మీ వాళ్లలో అమ్మాయిలు దొరకడమే గగనమవుతోందని. ఒకటీ, అరా దొరికినా మీరు ఎందులోనూ రాజీ పడకుండా తిరగ్గొడుతుంటిరాయే. అసలిప్పుడు 'లగ్నం' అంటేనే, అందులోనూ మీ వాళ్లంటేనే రాజీపడి పోవాల్సి వస్తోంది. మీ వాళ్లకి సంపాదన మీద మక్కువ ఎక్కువాయె. మగపిల్లల్ని కంటే మనీ మోసుకొస్తారని డాలర్ల మీద మోజుతో మెరికల్లాంటి కుర్రాళ్లను కని, అమెరికాకి తోలుతుంటే వారికి సరిజోడైన అమ్మాయిల్ని మేమెక్కడ తోడుకొని తేగలమండి..?! కాగడా వేసి వెతికినా ఆడపిల్లే కానరాక పోతుంటే.. అందుకే నేమో మీ వాళ్లంతా విసిగి వేసారి పెళ్లయితే చాలని పాశ్చాత్య సంస్కృతి పాలబడి పోయారు. కంటికి నదురుగా ఉన్నోళ్లు ఎక్కడ ఎదురైనా వెంటబెట్టు కొచ్చేసుకొని లగ్గమాడేసు కుంటున్నారు. అంతెందుకు.. మొన్నటికి మొన్న ఆ కరడుగట్టిన అనంతరావు గారే తాతల నాటి సాంప్రదాయాల్ని సైతం తుంగలో తొక్కి తన కొడుక్కి కులం, మతం చూడకుండా కల్యాణం జరిపించేసి, కంటినిండా కమ్మటి నిద్ర పోతున్నాడా..?! అయినా మీకు తెలియందే ముంది లెండి. రోజులు మారాయి. మనుషులూ మారిపోతూ ఉన్నారు. ఆ మార్పులు మింగుడుపడని మీలాంటి వారి పంతాలు, పట్టింపుల వల్లే పిల్లల జీవితాలు అడవిగాచిన వెన్నెల అవుతున్నాయి. అలా అడవుల పాలెందుకని పిల్లలే ఆ వెన్నెలని అమెరికాలోనో, ఆఫీసుల్లోనో అలవోకగా కాయించేసుకుంటున్నారు. సమాజం తెచ్చే మార్పులను ఎవరూ ఆపలేరు. కాదననూలేరు. అవి అలా జరిగిపోతూనే ఉంటాయి. వాటిని ప్రత్యేకంగా అలవరచుకోవాల్సిన అవసరం లేదు. సమాజం దానంతట అదే తనపాటికి తనపని తాను చేసుకుంటూ పోతుంది. దానికి మీరూ, నేనూ ఎవరూ అడ్డంకి కాదు. కాలం, సమాజాల తోపాటే నడిచేవాడెప్పుడూ ఓడిపోడు. ఆనందంగా తన జీవన ప్రయాణాన్ని సాగిస్తాడు. వాటికి వ్యతిరేకంగా నడిచినవాడెవడూ బాగుపడిన దాఖలాలు చరిత్రలో లేవు. కాలగర్భంలో కలిసిపోవాల్సిందే. అన్నట్టు.. మొన్నీమధ్యే ఆ ఉప్పు గండ్లాయన నా ముందే బంగారం లాంటి కొడుకులిద్దరికీ ఏం చెప్పాడో తెలుసాండీ..?''

''హబ్బే.. నాకెట్లా తెలుస్తది. అదేదో నువ్వే చెప్పరాదూ..''

''ఇద్దరు కొడుకుల్నీ పిలిచి.. 'ఒరే అబ్బాయిలూ! మీ జీవితం మీ ఇష్టం. అందులో మా ప్రమేయమేమీ ఉండదు. మీ మనసుకు నచ్చిన, మీరు మెచ్చిన వారిని చూసుకొని మనువాడేసుకోండి. మనవాళ్లే కావాలని మడిగట్టుకొని కూర్చుంటే మీకు మరుజన్మలో కూడా మ్యారేజీ కాకపోవచ్చు. ఈ కులాలు మతాలన్నీ మనిషి అవసరాల ముందు బలాదూరే. పిల్లల్ని కూడా మీ కిష్టమైతేనే కనండి లేకపోతే లేదు.. మీ కాలం మీది. మా కాలం మాది. ఎవరిష్టం వారిది. పోలికలొద్దు. కానీ, మన ఆచార సాంప్రదాయాల్ని ఆదమరచిపోకుండా కుటుంబ విలువలను మాత్రం కాపాడుకోండి చాలు' అని చెప్పేసారండి. ఇప్పుడు వాళ్లిద్దరూ ఎంచక్కా నచ్చినోళ్లనే పెళ్లిచేసుకొని చెట్టాపట్టాలేసుకుని తిరుగుతున్నారు. వాళ్ల మధ్య కులాల పట్టింపు ఒక్కసారన్నా వస్తే ఒట్టు..''


వీర్రాఘవయ్య వినలేనట్టుగా ఆపేస్తూ..

''సరి సర్లేగానీ ఇక ఆపు. ఆ విషయాలన్నీ మనం తీరిగ్గా ఉన్నప్పుడు మాట్లాడుకుందాం..'' అన్నాడు.

ఆ మర్నాడే రామప్ప పంతులు అమ్మాయి అమ్మా నాన్నల్ని వెంటబెట్టుకొచ్చేడు. నాన్నేమో చాలా స్మార్ట్‌గా ఉన్నాడు. అమ్మాయమ్మ అంత బాగోలేకపోయినా పొడుగ్గా చక్కగా ఉంది.

'బ్రైడ్ బాగానే ఉంటుందిలే. నేను ఒకింటివాడ య్యేది ఖాయమేలే' అని తేలిగ్గా ఊపిరి పీల్చుకున్న వీరా.. 'అమ్మాయికి వాళ్ల నాన్నగారి అందం, అమ్మగారి పర్సనాలిటీ వస్తే బావుండు' అని కూడా అనుకున్నాడు.

తీరా వెళ్లిచూస్తే, అమ్మాయి మూడున్నర



'నమస్తే తెలంగాణ-ముల్కనూ[illegible] పీఠం' సంయుక్తంగా నిర్వహించిన 'కథల పోటీ-2025'లో రూ.2వేల బహుమతి పొందిన కథ.

అడుగులకు మించి లేదు. అబ్బాయేమో ఆరడుగులాయె. వీర్రాఘవయ్య ఒక్కడే.. అమ్మాయి తప్ప అన్నీ కుదిరిపోవడంతో 'చక్కటి' సంబంధంగా భావించేడు. ''ఇదెక్కడి సంబంధం నానోయ్! ముందు-వెనకా, ఎదురు-బొదురుగా, ఏ మూలలుగా ఎటు చూసినా ఫ్లాట్‌గానే ఉంది పిల్ల. ముక్కుందో లేదో తెలీకుండా దానిమీదో కళ్లజోడు తగిలించుకోనుంది. చేసుకునేది సంసారానికా.. చంకన బెట్టుకోడానికా!? నా వల్లకాదు బాబోయ్.. నేను చేసుకోనుగాక చేసుకోను'' అంటూ మొండికేసేడు వీరా.

ఆ తర్వాత అమెరికా వెళ్లి ఇక ఇట్లా కాదని.. 'నీ కులం నీకేమైనా కూడు పెడుతోందిరా! అర్థం పర్థంలేని ఆ అనవసర వ్యర్థ కులాలను నమ్ముకొని ఎంతకాలమిలా శీలాన్ని ఎండబెట్టుకుంటావురా! అసలు నీకు కావాల్సింది సుఖసంతోషాలా, కులమతాలా!? ఏది నీ చాయిస్?' అన్న మిత్రుడి మాటతో, ఆలోచనలో మునిగి తేలి, ఆనక మనసుకు నచ్చిన కొలీగ్‌తో ప్రేమలో పూర్తిగా మునిగిపోయాడు. సంవత్సర కాలంగా సహజీవనం సాఫీగానే సాగిస్తూ వస్తున్నాడు. ఇక ఇంట్లో వాళ్లను ఒప్పించి పెళ్లి చేసుకోవడమే మిగిలి ఉంది. ఇప్పుడు వాళ్ల నాన్నను అడిగితే 'ససేమిరా' అంటున్నాడు. అమ్మాయి చూస్తే ఎర్రగా బుర్రగా ఉంది. ఏ 'తక్కువ కులపు అమ్మాయో' అయ్యుంటుందనేది వీర్రాఘవయ్య విస్పష్ట విజువలైజేషన్. వీరాని అడిగితే..

'ఆమెకు ఎవరూ లేరు. ఏ కులమో కూడా ఎవరికీ తెలియదట' అంటున్నాడు. ఇంతలో గోదారి పెరుగుతోందని వార్తలు రావడంతో వీరా ఉన్నపళాన అమెరికా పోయి, తాను కోరుకున్న అమ్మాయినే పెద్దలను ఎదిరించి పెళ్లాడేసాడు. తండ్రీ కొడుకుల పంతాలు, పట్టింపులకు మధ్యలో నలిగిపోయిన వీరా వాళ్లమ్మ తట్టుకోలేక తీవ్ర అనారోగ్యంతో కన్నుమూయడంతో.. అప్పటికే 'మధుమేహుడైన' వీర్రాఘవయ్య ఒంటరిగా మిగిలిపోయాడు.

* * *

''ఏమే కనకం.. చీటికీమాటికీ పిల్లోడికి పాలివ్వాలని పోతుంటే ఇక్కడ నాకెవరే దిక్కు. ఇకనైనా కాస్త కుదురుగా ఉండి పనులు చేసిపెట్టిపోవే..'' అన్నాడు వీర్రాఘవయ్య.. వరదతాకిడి లేని టేకులబోరులో తన బాబును ముసలి తల్లి దగ్గర ఉంచి, పనిచేసి పోయే కనకంతో.

ఒక్కడే కావడంతో చేదోడు వాదోడుగా ఉంటుందని.. కొడుకు పుట్టిన నెలకే యాక్సిడెంట్‌లో భర్తను కోల్పోయిన కనకాన్ని చేరదీసి పని మనిషిగా పెట్టుకున్నాడు.

''నాకూ ఇబ్బందిగానే ఉంది బాబు గారూ! కానీ ఏం చేయను? పాలివ్వకపోతే ఒంట్లో భారంగా, నలతగా ఉంటోంది. అటు పిల్లవాడూ ఉండలేడు కదా!'' అంది దీనంగా.

వయసులో ఉన్న కనకం మంచి ఆరోగ్యంతో ఉండటంతో పాలు ఎక్కువగా పడుతున్నాయి. అందుకే మధ్యలో రెండుమూడుసార్లు వెళ్లొస్తుంటుంది. వీర్రాఘవయ్య విసుక్కుంటున్నాడని ఆ రోజు మధ్యాహ్నం తర్వాత అసలు వెళ్లనేలేదు కనకం. జులై నెల కావడంతో సాయంత్రానికే అనూహ్యంగా వాతావరణం మారిపోయింది. ఎగువన విపరీతంగా వర్షాలు పడటంతో ఒక్కసారిగా వరద పొంగుకొచ్చింది గోదారికి. సంధ్య చీకట్ల ముసురుతోపాటే వర్షం మొదలై గాలివానగా మారింది. వరద పెరిగి ఊరంతా అష్ట దిగ్బంధనం అయిపోయింది. తుఫాను గాలులతో ఊరంతా అతలాకుతలమైంది. ఊహించని విధంగా వీర్రాఘవయ్య, కనకంతో సహా ఎక్కడి వాళ్లక్కడ చిక్కుకుపోయారు. వీర్రాఘవయ్య రోజూ మాదిరే భోజనానికి ముందుగా వేసుకునే షుగరు మాత్రలు అప్పటికే వేసేసుకున్నాడు. కానీ, వరదభయంతో అన్నీ వదిలేసి మేడపైనున్న గదిలోకి చేరడంతో ఆకలి సంగతే మరచిపోయాడు. కాసేపటికే షుగర్ డౌన్ కావడం ప్రారంభమైంది. మత్తుకమ్మి కళ్లు మూతలుపడిపోతూ, తలంతా దిమ్ముగా ఏమీ తెలియనట్లు అవుతోంది. క్రమక్రమంగా కోమాలోకి జారిపోతున్నాడు. ఆకలికి అలా సొమ్మసిల్లి పోతున్నాడేమో!? అనుకుంటోంది కనకం. అటు బిడ్డ ఎలా ఉన్నాడోనని బెంగ! ఇటుచూస్తే యజమాని ఇలా! ఆ గాలివానలో, చిమ్మ చీకట్లో ఆమెకేం చేయాలో పాలుపోలేదు. అతికష్టమ్మీద దగ్గరికి చేరి..

''బాబుగారూ..'' అంటూ కదిపి చూసింది. అయినా అతనిలో చలనంలేదు. సరిగ్గా అప్పుడే ఒంట్లో ఎక్కడో ఏదో తెలియని సన్నటి సలుపు మొదలైంది కనకానికి. అతన్ని పట్టుకోవడంలో పాలిండ్లు తగిలి పాలు బయటికి ఉరికేయి. రవికె తడిగా మారింది. దానితో ఆమెకో ఆలోచన మెరిసింది. ఆలస్యం చేయకుండా రవికెను పైకిలాగేసి తన స్తన్యాన్ని అతని నోటికి అందించి గట్టిగా కదుపుతూ..

''తాగండి బాబూ.. పాలు తాగేయండి!'' అంటూ అరిచింది.

అతనిలో చలనం లేదు. కానీ, అప్పటికే కారిపోతున్న పాలతో గొంతు తడవటంతో కొద్దిసేపటికి కోలుకున్నాడు వీర్రాఘవయ్య. పోతున్న ప్రాణం తిరిగివచ్చినట్టు అయ్యింది. కానీ, ఏమీ మాట్లాడలేక పోయాడు. ఆ రాత్రి కాళరాత్రి అయింది వారికి. తెల్లారి రెస్క్యూ టీం వచ్చి పడవల్లో టేకులబోరులోని కనకం ఇంట్లోకి చేర్చారు. కానీ, అప్పటికే జరగాల్సింది జరిగిపోయింది. ఆ గాలివాన తాకిడికి, చలిదెబ్బకు తట్టుకోలేక ముసలమ్మ పసిగుడ్డును ఒంటరిగా వదిలేసి, మంచం మీదే అశువులు బాసింది. పిల్లవాడు గుక్కపట్టి ఏడుస్తున్నా పట్టించుకునే నాథుడు లేకుండా పోయాడు. గాలిహోరులో ఆ ఏడుపు ఎవరికీ చేరక అరణ్య రోదనైంది. ఏడ్చి, ఏడ్చి పిల్లాడు సొమ్మసిల్లి పోయాడు. కనకం అదృష్టం బాగుండి చివరిదశలో చూడటంతో.. తల్లిపోయినా కొడుకు బతికి బయటపడ్డాడు. ఆ గాలివాన వెలిసిన తర్వాత ఊరంతా మరో 'గాలిదుమారం' రేగింది. అది 'వీర్రాఘవయ్య-కనకం' మీదినుంచి.

* * *

'నాయనా వీరా.. కొన్ని నిజాలు నీకు తెలియాలనే ఈ ఉత్తరం రాస్తున్నాను. కూనవరం కోడై కూస్తున్నట్టుగా కనకం నీకు కాదు, నాకు తల్లిస్థానంలో ఉంది. తల్లిని పోగొట్టుకొని, నాకు మరో జన్మనిచ్చిన తల్లి ఆమె. నేనింతకాలం కడుపులో దాచుకొని కాపాడిన కులమాలిన్యాన్ని తన పాలతో కడిగి అభిషేకం చేసిన బంగారు తల్లి. ఆ తల్లికి వరద మిగిల్చిన వ్యథను, గాలివాన చేసిన గాయాన్ని నేను మాన్పగలనా..?! ఏమిచ్చి ఆ తల్లి రుణం తీర్చుకోగలను?! అందుకే.. అభాగ్య తల్లులందరికీ దారిచూపే దీపంగా ఆమెతోనే కూనవరం సొసైటీ ఏర్పాటు చేయించి నా దగ్గరే ఉండమన్నాను.

ఒరే అబ్బాయ్! మనిషన్నవాడికి ఏది ఉన్నా లేకపోయినా 'కారుణ్యమనే కులం, మానవత్వమనే మతం' ఉంటే చాలు. ఇంకేమీ అక్కర్లేదు. ఇది అందరూ నాలాగా ఆఖరిదశలోనో, ఆపత్కాలంలోనో కాకుండా ముందుగా తెలుసుకుంటేనే జీవితాన్ని ఆనందంగా గడపగలరు. కుటుంబాన్నీ ఆనందంగా ఉంచగలరు. ఇది తెలియకే నిన్ను బాధించాను. నీవు చేసిన మంచి పనిని మన స్ఫూర్తిగా అభినందిస్తూ, ఆశీర్వదిస్తున్నాను. నీ సుఖమే నా సుఖం. నాపై కోపం మాని, సుఖసంతోషాలతో చిరకాలం వర్ధిల్లు నాయనా..'

లెటర్ చదివిన వీరా సంతోషంతో..

'ఐ యామ్ వెరీ హ్యాపీ డాడ్! నీలో వేళ్లూనుకుపోయిన మహావృక్షాన్ని నేను కూల్చలేకపోయినా, గాలివానతో కూకటి వేళ్లతో సహా కొట్టుకుపోయింది. నీ కోడలు ఎవరో కాదు మనోళ్లమ్మాయే.. అదృష్టం కొద్దీ దొరికింది మనకు. అయినా నీకు తెలీదుగా..' అనుకున్నాడు. ■

## బట్టేపాటి జైదాస్



తన జీవిత అనుభవాలను హత్తుకునే కథలుగా.. నవ్వించేలా కార్టూన్లుగా మలుస్తున్నారు రచయిత బట్టేపాటి జైదాస్. ఈయన స్వస్థలం నెల్లూరు జిల్లా బుచ్చిరెడ్డిపాలెం. ప్రస్తుతం ఖమ్మం జిల్లా మధిరలో స్థిరపడ్డారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కాలేజీ ప్రిన్సిపల్‌గా పనిచేస్తున్నారు. బాల్యం నుంచే పుస్తకాలను విపరీతంగా చదివేవారు. దాంతో తానెందుకు కథలు రాయకూడదని.. తొమ్మిదో తరగతిలో ఉండగానే కథలు రాసి, బాలజ్యోతికి పంపారు. అవి ప్రచురితం కావడంతో.. రెగ్యులర్‌గా కథలు రాస్తున్నారు. కార్టూనిస్టుగా, నటుడిగా, మైమ్ ఆర్టిస్ట్‌గా బహుముఖ ప్రజ్ఞ చాటుతున్నారు. ఉద్యోగ బాధ్యతల వల్ల కొంచెం గ్యాప్ వచ్చినా.. 2004 నుంచి మళ్లీ గేర్ మార్చారు. అన్ని రకాల కథలు రాసినా కామెడీకే ప్రాధాన్యం ఇస్తున్నారు. గతేడాది 'తెలుగు కార్టూనిస్ట్‌ల దినోత్సవం' సందర్భంగా నటకిరీటి రాజేంద్రప్రసాద్ చేతుల మీదుగా వీరి కార్టూన్లతో 'జైదాస్ జాయ్ టూన్స్' అనే బుక్ ఆవిష్కరించారు. తనికెళ్ల భరణి జడ్జిగా వీరి హాస్య కథకు బహుమతి అందుకున్నారు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



కథ


అన్నిటికీ డబ్బే ప్రధానం కాదు. మానవత్వం ముందుండాలి. గతం కళ్లముందు కదిలింది.

'అరేయ్! దూరంగా వెళ్లిపోతున్నావురా!' మా అత్తగారు బాధపడ్డ క్షణాలు.

ఎంత దూరమమ్మా! మూడుగంటల ప్రయాణం. ఎప్పుడు చూడాలంటే అప్పుడు వాలిపోతాను. ఇల్లు చూసుకున్నాక మిమ్మల్ని తీసుకువెళ్లిపోతాగా' మా వారి సమాధానం.

వీడిలా మేము వాళ్లని వదిలెయ్యలేదు. ప్రతి బాధ్యతా స్వీకరించాం. ఊరు వదిలిరాలేని అసక్తతే వారిని మాకు దూరంగా ఉంచింది. అందుకు మేమే వారి దగ్గరకు వెళ్లాం. కడదాకా అండగా నిలబడ్డాం. ఇప్పుడిలా...!

'రెక్కలొచ్చిన పక్షి గూడు వదిలిపోదా?' అంతరంగం ప్రశ్న. మరి మేం అలా ఎందుకు చెయ్యలేదు? క్యాబ్‌లో ఇంటి దారి పట్టాం. మనసు మాత్రం మూగగా రోదిస్తూనే...!



# రెక్కలొచ్చిన పక్షి

యలమర్తి అనూరాధ
సెల్: 9247260206

నిశీధి సమయం. రోడ్డుమీద కుక్కలు అదే పనిగా మొరుగుతున్నాయి. ఎందుకో? ఏమిటో అర్థం కాదు. మనకి మనం ఏదో ఒకటి ఊహించుకోవటమే. జంతువులు ప్రమాదాన్ని మనకంటే ముందే పసిగెడతాయట చదివాను ఎక్కడో... ఏదో జరగబోతోంది అంతరంగం హెచ్చరిక గంటలు మోగిస్తోంది అదే పనిగా.

నా గురించి నాకు ఎప్పుడూ బెంగలేదు. కాకపోతే బీపీ, షుగర్, దానికి తోడు అదనంగా ఇచ్చిన గుండె జబ్బు. ఇన్నిటిని భరిస్తూ కుటుంబ బండిని ఒంటరిగా లాక్కొస్తున్న శ్రీవారు శరత్‌చంద్ర. ఉపాధ్యాయుడిగా జీవితాన్ని ప్రారంభించి ఇప్పుడు ప్రధాన ఉపాధ్యాయుడు స్థాయికి ఎదిగారు. విద్యార్థులకు వెలుగుల బాట చూపించే వారిగా మంచిపేరు తెచ్చుకున్నారు. అదంతా కష్టపడి, స్వయంకృషితో ఆయన తెచ్చుకున్నదే. అయినా కించిత్తు గర్వం కూడా ఉండదు. పరువు కోసం ప్రాణం తీసుకునేంత సున్నిత మనస్తత్వం.


సంవత్సరం నుంచీ తండ్రీ కొడుకుల మధ్య నిశ్శబ్ద యుద్ధం జరుగుతుంది. 'ధర్మతేజ' నా గారాలకొడుకు కులాంతర, మతాంతర వివాహానికి శ్రీకారంచుట్టాడు మరి. ఈ కాలంలో కులాలు, మతాలు పట్టింపులు ఏమిటి? అందరూ ఒకే మతం ఒకటే రక్తం అనేది మనసులో ఉన్నా భర్త ఆరోగ్యరీత్యా ఆ విషయం బయటకు చెప్పలేక పోతోంది. నెమ్మదిగా ఆయన్ని ఒప్పించే ప్రయత్నంలో ఉంది తను.

ఎందుకంటే వాడు ఒక మెట్టు దిగే ప్రయత్నంలో లేడు. ఎంతసేపూ ప్రేమించిన పిల్లను చేసుకుందామనే. చిన్నప్పటి నుంచీ కంటికి రెప్పలా కళ్లలో పెట్టుకున్న తండ్రి ఇప్పుడు అతని కళ్లకు కనిపించటం లేదు. వాడి కళ్లకు వాడి కలలరాణి ఒక్కటే కనిపిస్తోంది. ఏం చేస్తాం?

పాతికేళ్ల నుంచీ సంసారం నావను ఎన్ని ఒడుదుడుకులు వచ్చినా ప్రశాంతంగా నడిపించుకుంటున్నాం. ఇప్పుడు ఉన్నట్టుండి జీవిత సంద్రంలో తుఫాను వస్తోంది. తట్టుకుంటామో కూలిపోతామో తెలియని పరిస్థితి. రెండు పడవల మధ్య ప్రయాణంలా ఉంది నా పరిస్థితి. కర్ర విరగాకూడదు పాము చావకూడదు అన్న సామెతలాగా ఉంది. ఇద్దరి మధ్య నలిగిపోతున్నాను. నీ కొడుకుకు చెప్పమని ఈయన. నాన్నకి చెప్పలేవా అని వాడు.

గుడ్డు కూడా తినని ఈ ఇంట్లోకి ఆ పిల్లవస్తే శాఖాహారి మాంసాహారి అయినట్లు ఇల్లు తయారవుతుందని లోలోపల నాకు బెంగ. పిల్లోడి పెళ్లి కంటే ఆ ఊహే నన్ను ఎక్కువ బాధిస్తుంది. బయటి తిండ్లకి అలవాటుపడిన పిల్లలు ఇలాంటి విషయాలు అసలు పట్టించుకోవటం లేదు. కావాలంటే నీకు కొత్త గిన్నెలుకొని ఉంచుతాలే అంటూ ఈ మధ్య కొత్త జోకులు వెయ్యటం ప్రారంభించాడు నా కొడుకు.

ఆలోచిస్తుండగానే భళ్లున తెల్లవారింది. అనుకున్న ఉపద్రవం రానే వచ్చింది. అప్పటిదాకా మీరు వచ్చి అక్షింతలు వేస్తేనే పెళ్లి చేసుకుంటా అన్నవాడు ఒక్కసారి ప్లేటు ఫిరాయించి పెళ్లి చేస్తారా? ఛస్తారా అన్నట్టు మంకు పట్టుపట్టాడు.



కారణం అప్పటిదాకా టెంపరరీగా ఉన్న ఉద్యోగం ఇప్పుడు పర్మనెంటు అయ్యింది. ఇక నా కొడుకుకు కొమ్ములొచ్చాయి. ఈ పిల్లను తప్ప ఎవరినైనా చేసుకో ఒప్పుకుంటానని ఆయన. ఆ పిల్లే కావాలని వీడు. అందం లేదు, చదువు లేదు. ఏం చూసి చేసుకుంటానంటున్నాడో నా కర్థం కావటంలేదు అని ఓ మదనపడిపోతున్నారు మనసులోనే మా వారు.

నా కళ్లతో చూడండి అనేది పాత పాట. మనసును ప్రేమిస్తున్నానన్నది కొత్త పాట. మరి ఆ కొత్తపాట పాడుతున్నాడు నా సుపుత్రుడు. ఇంతకీ స్కూల్లో పనిచేసే వాచ్‌మాన్ కూతురు ఆ అమ్మాయి. అటు ఆయన, ఇటు వీడు. అబ్బబ్బ! తలనొప్పితో చచ్చిపోతున్నాను మధ్యన నేను. 'వాచ్‌మాన్ అయితేనేం? అది ఉద్యోగం కాదా? వాళ్లు మనుషులు కారా? ఒప్పుకోండి. మనం కాదంటే మన పిల్లోడేగా బాధపడేది.' ఎప్పటిలా పాట ప్రారంభించాను నేను.

అదే కదా నేను ఆలోచించేది. లేకపోతే ఎప్పుడో చెప్పేసే వాడ్ని తువ్వాలు గట్టిగా దులిపి భుజంమీద వేసుకుని స్నానానికి బాత్రూమ్‌లోకి వెళ్లిపోతూ అన్నారాయన.

వాడు ముహూర్తాలు పెట్టుకొనే దశలోకి వెళ్లిపోయాడు. ఇక పెద్దరికాన్ని నిలబెట్టుకోవటమా? కాలరాచుకోవటమా అన్నదే మిగిలింది.

"మగపిల్లలు కాస్త అందంగా, డబ్బున్న వాళ్లు కనిపిస్తే చాలు ఎర వేయడానికి ఆడపిల్లలు, వాళ్ల తల్లితండ్రులు ఇలాంటివి చెప్పి బాగా ఎక్కిస్తారండీ. అదే వాళ్ల ప్లాను" అని పక్కింటావిడ మాటలు వదలనని చెవుల్లో మారుమోగుతున్నాయి.

మొన్న మొన్నటిదాకా చక్కటిపిల్లాడు. తల్లి దండ్రులను మంచిగా చూసుకుంటాడు అన్నవి అన్నీ ఒక్కసారిగా తిరగబడిపోతున్నాయి. పడవ బోర్లాపడినట్లు. ఇక మునగటమా? తేలటమా? కాలమే జవాబుచెప్పాలి అన్న నిశ్చలత నాది. ఎవరికీ చెప్పలేకపోతున్నాను. ఎవరికివారు తాను పట్టుకున్నకుందేలుకి మూడేకాళ్లు అంటున్నారు మరి.

మనసుకు ఏది ఏమైనా పిల్ల మంచిదే. అది చాలనిపిస్తుంది నాకు. కానీ ఈయనలో చలనం లేదు. ఏం జరుగుతుందో? రోజూ ఏంగొడవ జరుగుతుందో అని మనసులో గుబులు. ఈయన ఆరోగ్యంఏమవుతుందోనని చింత. వాడికి మాత్రం తండ్రి, తండ్రి ఆరోగ్యం అన్న ఆలోచనే లేదు.

ఆ పిల్లని ఎలా పెళ్లి చేసుకోవాలి అన్నది తప్ప మరేమీ కనిపించటం లేదు. అందమంటే పడి చచ్చిపోయే పిల్లోడు ఇలా ఎలా మారాడన్నది విచిత్రమే. కానీ ఏది ఏమైనా వాడు మనసుకు ఇచ్చిన ప్రత్యేకత మాత్రం నా మనసుకు నచ్చింది. నిజం చెప్పద్దూ!

అందుకే ధైర్యం చేసి ఆ మాట అనేశా. పిల్లికి ఎలుక సాక్ష్యంలా ఉంది. నువ్వూ వాడికి తోడయ్యావా అని వాడిమీద ఉన్న కోపాన్ని అంతా నా మీద కుమ్మరించటం ప్రారంభమయ్యింది. సయోధ్య కుదిరించాలంటే ఆ పాత్ర పోషించక తప్పదనిపించింది. మొత్తానికి వాడి బెదిరింపో తన తగ్గింపో నా మధ్యవర్తితనమో రిజిష్టర్ మ్యారేజీకి తెర దింపింది.

'పెంపకం. నా పిల్లోడ్ని ఎలా పెంచానో. ప్రేమ పెళ్లి చేసుకుంటే నా పరువు, కుటుంబం పరువు పోతుందిరా అని చెప్పా నా కొడుక్కి. అంతే ప్రేమించిన అమ్మాయిని వదులుకున్నాడు నా కొడుకు' అంటూ దెప్పిపొడుపులు ప్రారంభమయ్యాయి. ఏం చేస్తాం? పడాలి. తప్పదు. తప్పు ఒకరిది శిక్ష మరొకరికి. అదెవరో కాదు నా దగ్గర చుట్టమే!

వాళ్లిద్దరూ సుఖంగా ఉన్నారు. అనుకుని సంతృప్తిపడ్డాం మేం. ఇలాంటి సూటిపోటి మాటలు టిఫిన్, భోజనంలా ఆరగిస్తున్నాం. ఎదుటివాడిని అర్థం చేసుకుని నాలుగు ఓదార్పు మాటలు చెప్పాలని చూడదు ఈ సమాజం. కాకుల్లా పొడవటమే పనిగా పెట్టుకుంటుంది. ఎవరి మానాన వాళ్లను వదిలేసినా బాగుంటుంది.

పెళ్లి చేశామన్న ఆనందంలో బాగుంటాడను కున్న కొడుకు పెళ్లయ్యాక ఆడపిల్ల పరాయి దయినట్లు దూరమయ్యాడు. వాడు అడిగింది ఇచ్చామనా? ఏమో! అర్థం కాని అయోమయంలో మేమిద్దరం. ఉన్నది ఒక్క పిల్లాడు. కనీసం అవతలి వారికయినా ఆ బుద్ధి ఉండక్కర్లేదా? వాళ్లంతా సంతోషంగా ఉంటే చాలనుకుంటున్నారు. ఎవరి స్వార్థం వాళ్లదే. దాని ఫలితం ఎప్పుడో ఒకసారి తెలియకపోదు. అనుకున్న మూడు ఎండ్లకు అబ్బాయి అమెరికా ప్రయాణం కట్టాడు. ఇప్పుడు తెలుస్తోంది వాళ్లకి పిల్ల దూరం అవటం ఏమిటో! కళ్లలో నీళ్లు కుక్కుకుంటున్నారు.

మాకు ఇక్కడ ఉన్నా అక్కడ ఉన్నట్లే ఉంది పరిస్థితి. మరి మాటలేదు. పలుకు లేదు. ఒక పైసా ఇచ్చింది లేదు. లక్షలు గడిస్తున్నా. 'అందుకే మా వాడి చదువుకు పెట్టిన డబ్బు అంతా కడితే కానీ ప్రేమ వివాహానికి ఒప్పుకోను' అని ముక్కు పిండి వసూలు చేసిన నా కొడుకు క్లాసుమేటు తల్లి మాటలు గుర్తువచ్చాయి ఆ క్షణంలో.

ఆడపిల్లకి కట్నం ఇచ్చి పెళ్లి చేశాను అను కుంటాను. వాడే లేకపోయాక వాడి డబ్బులు

(మిగతా 5వ పేజీలో)

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



(కథ-4వ పేజీ తరువాయి)

# రెక్కలొచ్చిన పక్షి

మనల్ని ఉద్ధరిస్తాయా?

నేనే నా కోసం అప్పు చేశాననుకుంటాను అని ఆ వివాదానికి ఫుల్‌స్టాప్ పెట్టేశారు మా ఆయన. కానీ నా మనసు ఊరుకోదే. మొదటి నుంచీ చెబుతూనే ఉంది. స్టూడెంట్ లోను పెట్టించమని. రిటైర్ అయ్యాక. వాడికి ఉద్యోగం పోతే అది మనమే కట్టాలి. అది నావల్ల కాదు. ఈ విషయంలో నా మాటవిను అని నన్నే బుజ్జగించారు. అవతలి వారిలా కఠినంగా ఉండలేకపోయాం. అందుకు ఫలితం ఆ భారం కూడా మా మీదే.

పిల్లలు పెళ్లయ్యాక మారతారని తెలిసినా మా బిడ్డ బంగారం, అలాచెయ్యడు అని పిచ్చి భ్రమలో ప్రతి తల్లీ తండ్రీ. చేతులు కాల్చుకున్నాక కానీ తెలియదు తామూ బిడ్డలతో మోసపోయా మని. అందుకే ముందు జాగ్రత్త అవసరం.

శక్తికిమించి వాళ్లకోసం అప్పులు చెయ్యనేల? తిప్పలుపడనేల! వాళ్లు సుఖాల భోగాలులో! తల్లి దండ్రులు అప్పుల తిప్పలలో. ఎక్కడుంది న్యాయం?

వాళ్ల సంపాదనలో పాతిక వంతు ఇన్‌కమ్ టాక్స్‌లా తల్లిదండ్రులకివ్వాలని ప్రభుత్వం ఒక రూలు పెడితే కానీ ఇలాంటి కొడుకులు బాగుపడరు. అలాంటి తల్లిదండ్రుల కష్టం తీరదు. ఇలాంటి మంచి పనులు ఎందుకు జరుగుతాయి? బాధలు పడే వారికే కష్టం తెలుస్తుంది. అది లేకుండా పదవులు చేపట్టినవారు దండుకోవటం తప్ప ఎదుటి వారి గురించి, వారి బాధల గురించి ఆలోచించే తీరిక ఎక్కడా? పదవి రాగానే విదేశాలు ఎలా చుట్టి వద్దామనే!

స్వకార్యం, దేశ కార్యక్రమం రెండూ చేస్తున్నారులే. మరీ వాళ్లను అలా తిట్టుకోకు. పెట్టుబడులు మన దేశంలో పెట్టడానికి, సఖ్యత పెంపొందించుకోవటానికి వాళ్లు అలా వెళు తున్నారని ఎందుకు అనుకోవు అని అంతరంగం ఎదురు తిరిగింది. అదీ నిజమే కదా! ఒప్పుకోక తప్పలేదు చివరకు.


నాది నిజంగా పిచ్చిమనసేనండీ. ఎవరినీ తప్పు పట్టాలనిపించదు. ఎవరి వైపు ఆలోచిస్తే వారు నిజమేకదా అనిపిస్తుంది. మరి ఒక సమస్యను కూలంకషంగా పరిష్కరించాలనుకుంటే అన్నివైపుల నుంచీ ఆలోచించాలి. వారివారి దృష్టితోనే.

ఏమంటావు? అంతరంగాన్ని ప్రశ్నించా.

'ఏమంటాను. సమాధానం చెప్పలేనట్లు అన్నీ నువ్వే మాట్లాడేస్తావు. ఇక మాట్లాడలేని పరిస్థితి నాది' అంది అటూఇటూ కాకుండా. ఇది చాలా తెలివిగలది అనుకున్నా అంత బాధలోనూ.

× × ×

అనుకున్న రోజు రానే వచ్చింది. అదే వాడు వెళ్లిపోయే సమయం. బాధ్యతలు పట్టించుకోడు. మా ఆరోగ్యాలు ఎలా ఉన్నాయని అడిగింది లేదు. పుట్టినరోజులు, పెళ్లిరోజులు కదిలిపోయాయే కానీ ముచ్చటగా వచ్చిందీ లేదు. కలిసిందీ లేదు. ఇక్కడ ఉన్నా దూరంగానే. ఇప్పుడు మరింత దూరంగా వెళుతున్నాడు. ఉండీ కనిపించకపోవటం, లేక రాలేకపోవటం రెండూ ఒకటేలే అని మనసును ధృడంచేసుకుని రాయిలా ఉండాలను కున్నాను.



కానీ ఊహకు వాస్తవానికి తేడా ఉన్నట్లే వాడు టా!టా! చెబుతుంటే మాత్రం ఇక కళ్లలో కన్నీళ్లు ఇక మేంలోపల ఉండలేమని, గడపదాటి వచ్చేశాయి. ఏమిటిది చిన్నపిల్లలా అంటూ పెద్ద పిల్లాడిలా బుగ్గను తుడిచి అంటుంటే అవి మరింత ఉధృతమయ్యాయి. మసకబారిన కళ్లకు వాడు ఎదురుగా ఉన్నా కనిపించని పరిస్థితిలో పడిపోయాను. అంతరంగం అంతా శూన్యంగా తయారయింది. కడుపులో ప్రేగులు కదులు తున్నాయి అన్నది ఎప్పుడూ వినటమే. అది అనుభవంలోకి వచ్చింది ఆ క్షణంలోనే. గుండెనెవరో పిండేస్తున్నట్లే మెలి తిప్పుతున్నంత బాధ. మనసు అంతా వెలితిగా అందనంత ఎత్తుకు వెళ్లిపోయినట్లు. చూడలేనంత దూరంగా జరిగినట్లు. మాటలు రానిదానిగా మనసు స్తబ్దుగా. ఏవేవోభావాలు ఎన్నెన్నో జ్ఞాపకాలు. అనుకున్నంత తేలిక కాదు అనిపించింది ఆ అనుభవం.

ఇక ఆయనైతే గుమ్మం దగ్గర నుంచే చాటుగా కన్నీళ్లు తుడుచుకోవటం ప్రారంభించారు. పసిపిల్లాడి మనస్తత్వం. దూరంగా ఉండిపోయాను. ఓదార్చే ప్రత్యామ్నాయం లేదు కాబట్టి.

'పాస్‌పోర్టు తీసుకో. ఎప్పుడు కావాలంటే అప్పుడు వచ్చెయ్యొచ్చు. టిక్కెట్టు బుక్ చేస్తాను' అన్నాడు. అంతా డబ్బుతో పని నిజంగా అలా చేస్తాడో లేదో తెలియదు కానీ ఆ మాట అన్నాడు అదే చాలు అనిపించింది నా మనసుకు.

మాటలు అందరూ అంటారు చేతలే...అంది అంతరంగం ఎత్తు పొడుపుగా అంత బాధలోనూ!

మిమ్మల్ని పువ్వుల్లో పెట్టుకుని చూసు కుంటానని అనలేదూ. చేశాడా? డిపెండెంట్స్‌గా ఆఫీసులో మీ పేర్లు రాయటం మర్చిపోయానని అనటంతోనే వాడి ఆలోచనలలో కూడా మేము లేమని అర్థమైంది.

ఇక బాధపడటంలో అర్థమేముంది?

వాడి భవిష్యత్తు వాడు చూసుకోవద్దా? వాడి ఆనందాలతో నీకు పనిలేదా? అంతరంగం ఘూటించింది. వెళ్లవచ్చు. పురోగతిని నేనెందుకు అడ్డుకుంటాను? వాడిలా మూర్ఖంగా ఆలోచిస్తానా? కానీ ఒక సంవత్సరం ఏదో సరదా. అక్కడే ఉండిపోవాలనుకోవటం దేశాన్నీ, కన్న తల్లిదండ్రులను కాలదన్నుకోవటమే.

అరవైఏళ్లు దాటిన ఈ వయసులో వాడి అవసరం మాకు ఎక్కువే. కాస్తవంగితే ఎక్కడ పట్టేస్తుందో అర్థంకాదు. బరువులు మొయ్యలేం. ఈ వియోగబాధను మాత్రం మోస్తున్నాం. ఆరోగ్యం సహకరించదు. ఆ దేవుడికే తెలియాలి. వృద్ధాప్యం ఓ శాపంగా ఎందుకు మారుస్తున్నాడో? చిన్నతనంలో పిల్లలకు తల్లిదండ్రుల అండ ప్రతి క్షణం ఉంటుంది. అదే ఆ వయసులో పిల్లల దగ్గర నుంచీ దొరకదు. ఎంత విడ్డూరం?

అంతా ఆయన లీల. ఆడించినట్లు ఆడటమే తోలుబొమ్మల్లా, అలా ఎందుకనుకుంటావు. అందరూ నీ కొడుకులా లేరుగా. పక్కింట్లో శర్మ చూడు. ఎన్ని అవకాశాలు వచ్చినా వదులు కున్నాడు. అమ్మా, మాతృభూమి కావాలి అను కున్నాడు. ఇక్కడే తన ప్రతిభను చూపించు కుంటున్నాడు. అలా ఉన్నవాళ్లూ ఉన్నారు కానీ ఆ అదృష్టం కొంత మందికే!

అన్నిటికీ డబ్బే ప్రధానం కాదు. మానవత్వం ముందుండాలి. గతం కళ్లముందు కదిలింది.

'అరేయ్! దూరంగా వెళ్లిపోతున్నావురా!' మా అత్తగారు బాధపడ్డ క్షణాలు.

ఎంత దూరమమ్మా! మూడుగంటల ప్రయాణం. ఎప్పుడు చూడాలంటే అప్పుడు వాలిపోతాను. ఇల్లు చూసుకున్నాక మిమ్మల్ని తీసుకువెళ్లిపోతాగా' మా వారి సమాధానం.

వీడిలా మేము వాళ్లని వదిలెయ్యలేదు. ప్రతి బాధ్యతా స్వీకరించాం. ఊరు వదిలిరాలేని అసక్తతే వారిని మాకు దూరంగా ఉంచింది. అందుకు మేమే వారి దగ్గరకు వెళ్లాం. కడదాకా అండగా నిలబడ్డాం. ఇప్పుడిలా...!

'రెక్కలొచ్చిన పక్షి గూడు వదిలిపోదా?' అంతరంగం ప్రశ్న.

మరి మేం అలా ఎందుకు చెయ్యలేదు?

క్యాబ్‌లో ఇంటి దారి పట్టాం.

మనసు మాత్రం మూగగా రోదిస్తూనే...!

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

**కథ**

పచ్చటి తివాచీ పరచినట్టున్న ఇండోనేషియా కొండకోనల మధ్య నుంచి ఉదయపు చల్లటి గాలి వీస్తోంది. ఆ గాలితో పాటు ప్రశాంతతను ఆస్వాదిస్తూ, తన లైబ్రరీలో కూర్చుని ఇమ్రాన్ తాపీగా వార్తా పత్రిక చదువుతున్నాడు. అప్పటిదాకా ఎంతో ప్రశాంతంగా ఉన్న అతని ముఖం, పత్రికలోని ఒక వార్తా కథనం చదవగానే అకస్మాత్తుగా తీవ్రమైన బాధను పులుముకుంది. ఆ కళ్లలో ఏదో తెలియని భయం, ఆవేదన సుడులు తిరిగాయి.

కిచెన్‌లో నుంచి ఇమ్రాన్‌కు కాఫీ తెచ్చిన అతని భార్య జైనబ్, అతని పరిస్థితిని గమనించి "ఏమైందండీ.. ఎందుకంత బాధలో ఉన్నారు?" అని అడిగింది.

# శిథిల స్వప్నం..

**- సయ్యద్ ముజాహిద్ అలీ**



"భారతదేశంలో మళ్లీ మత అల్లర్లు జరిగాయి జైనబ్. పత్రికలో ఆ వార్త చదువుతుంటేనే వెన్నులో వణుకు పుడుతోంది" అని భారంగా నిట్టూర్చాడు ఇమ్రాన్.

అతని చేతుల వణుకుతో వార్తాపత్రిక పేజీలు రెపరెపలాడాయి. తన ముందు నిలబడి ఉన్న జైనబ్ వైపు అతను తల ఎత్తి చూసినప్పుడు, ఆ కళ్లలో నీడలా అలుముకున్న భయం ఆమెకు స్పష్టంగా కనిపించింది. ఇమ్రాన్ చూపు మళ్లీ పత్రిక వైపు మళ్లింది. అందులో ఒక ఫొటోలో కాలిన మసితో ఉన్న ఒక ఇంటి ముందు కూర్చుని ఆకాశం వైపు చూస్తూ ఏడుస్తున్న ఒక వృద్ధురాలి దృశ్యం. ఆ ఫొటో కింద ఉన్న సోషల్ మీడియా కామెంట్ల ప్రస్తావన చదవగానే ఇమ్రాన్ ముఖం వెలవెలబోయింది.

గట్టిగా కళ్లు మూసుకున్నాడు. ఆ మూసిన కళ్ల వెనుక కూడా అల్లర్లలో సజీవ దహనమైన బాధితుల హృదయవిదారక ఆక్రందనలు, హాహాకారాలు వినిపిస్తున్నాయి. అతడి నుదుటిపై చెమట పట్టింది.

తన ఫోన్ తీసి సోషల్ మీడియా చూశాడు. అందులో కొందరు ఆ మంటలను చూసి వెకిలిగా నవ్వుతూ, బాధితులను నిందిస్తూ పెడుతున్న పోస్టులు ఇమ్రాన్‌ను మరింత బాధ పెట్టాయి. అసహ్యంతో ఫోన్‌ను సోఫాలో పడేశాడు. ఆ నిస్సహాయత, ఆ ఆవేదన అతని గొంతులో గుటకగా మారి అడ్డుపడింది. సాటి మనిషి చావులో ఆనందాన్ని వెతుక్కునే జాంబీలలాంటి వికృత మనస్తత్వాన్ని తలచుకుని అతనికి గాలి ఆడనట్టుగా అనిపించింది. అతని కళ్లలో కాంతి తగ్గిపోయి, ఒక విధమైన చీకటి ముసిరింది.

తన మాటలతో ఆ చీకటిని తొలగిస్తూ, "ఆరోజు మనం భారతదేశాన్ని వదిలి వచ్చేటప్పుడు మీరు చెప్పిన మాటలు నేను వినకపోయి ఉంటే, బహుశా ఆ నరకం లాంటి వాతావరణంలో మన పిల్లలు ఎంత భయపడుతూ బతకాల్సి వచ్చేదో కదా. మన వాళ్ల మీద కూడా ఆ ప్రభావం ఎప్పటికీ ఉండిపోయేది" అని జైనబ్ ఆవేదనతో బదులిచ్చింది.

"అవును జైనబ్.. ఆరోజు మనం మన ఊరిని, మన వాళ్లను వదిలేసి ఇక్కడికి రావడమే మంచిదైంది. నా పిల్లల భవిష్యత్తు కంటే ఏదీ ముఖ్యం కాదని నేను తీసుకున్న నిర్ణయం సరైనదేనని ఈ రోజు జరుగుతున్న సంఘటనలు మళ్లీ రుజువు చేస్తున్నాయి" అని విచారంగా బరువెక్కిన హృదయంతో ఇమ్రాన్ అన్నాడు.

"సరే అండీ.. జరిగింది తలుచుకుని బాధపడకండి. ముందు ఈ వేడి కాఫీ తీసుకోండి. వంట మనిషితో కలిసి ఈరోజు మధ్యాహ్నానికి వంట వండాలి" అని చెబుతూ ఆ కాఫీ కప్‌ను ఇమ్రాన్ చేతికి అందించి వంటగది వైపు జైనబ్ అడుగులు వేసింది.

న్యూస్ పేపర్‌ను పక్కకు పెట్టి, ఆ కాఫీని మెల్లగా సిప్ చేస్తూ ఇమ్రాన్ తనకు తెలియకుండానే ఇండోనేషియా దీవుల సముద్ర తీరాలను దాటి సుదూర గతంలోకి, తనను నిత్యం వెంటాడే ఆ చేదు జ్ఞాపకాల్లోకి జారుకున్నాడు.

---

2024 సంవత్సరం చివర్లో.. ఒకానొక సాయంత్రం. సమయం ఆరు గంటలు అవుతోంది. తన మిత్రుడు అభినవ్ చౌదరితో కలిసి గాంధీ నగర్‌లోని 'ఆంధ్రా కెఫే'కు ఇమ్రాన్ వెళ్లాడు.

అదొక రద్దీ ప్రాంతం. ఒక టేబుల్ దగ్గర కూర్చుని ఇద్దరూ చాయ్ ఆర్డర్ చేశారు. టీ సప్లయర్ రెండు టీ గ్లాసులను తెచ్చి అందించాడు. ఇద్దరూ నెమ్మదిగా టీ సిప్ చేస్తూ, కెఫేలోని టీవీలో వార్తలను చూస్తున్నారు.

"నిందితుల ఇళ్లను కూల్చుతున్న ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం.. విచారణ పూర్తి కాకముందే బుల్డోజర్ న్యాయంతో శిక్ష.. సుప్రీంకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారంటున్న మానవ హక్కుల సంఘాలు.. బుల్డోజర్లతో ఇళ్లను కూల్చడాన్ని తీవ్రంగా తప్పుపడుతున్న ప్రతిపక్షాలు.. అమానవీయ చర్యలంటూ ఖండించిన సామాజిక కార్యకర్తలు.." అని వస్తోన్న బ్రేకింగ్ న్యూస్ చూడగానే ఇమ్రాన్ తీవ్ర ఆవేదనకు గురయ్యాడు. అతని గుండెలో ఏదో తెలియని భయం పట్టుకుంది.

"చూశావా అభినవ్.. ఇంకా నేరం రుజువు కాకముందే వాళ్ల ఇళ్లను ఎలా కూల్చేస్తున్నారో. కళ్లెదుటే వాళ్ల బతుకులు అలా శిథిలమైపోతుంటే ఎవరూ అడ్డుకోవడం లేదు.." అని బాధతో అన్నాడు.

ఆ మాటలు పక్క టేబుల్ మీద ఉన్న ఓ వ్యక్తి చెవిన పడ్డాయి. నుదుటిన కురచ బొట్టు పెట్టుకుని, కళ్లలో నరనరాన నిండిన కరుడుగట్టిన ద్వేషాన్ని, క్రూరత్వాన్ని నింపుకున్న ఆ వ్యక్తి ఇమ్రాన్ వైపు ఎంతో అసహ్యంగా, ఛాతి మీద కాలుబెట్టి నిలువునా ఇమ్రాన్‌ను బాకుతో చీల్చేలా చూశాడు.

"దోషుల ఇళ్లను కూల్చకుంటే ఇంకేం చేస్తారురా? ఈ జిహాదీ గాళ్లు ఊర్ల మీద పడి ల్యాండ్ జిహాద్‌తో నానా అరాచకాలు సృష్టిస్తున్నారు. వీళ్లకు ఇలాంటి కఠినమైన శిక్షే పడాలి. బుల్డోజర్లతో తొక్కించి చంపేయాలి లం... కొడుకులను" అంటూ ఉద్దేశపూర్వకంగా గట్టిగా, కర్కశంగా అరిచాడు. ఆ గొంతులో సాటి మనిషి పట్ల కాస్త జాలి కూడా లేదు.. ద్వేషం తప్ప. అతని క్రూరత్వం ఆ కెఫే అంతా పాచి తీగలా పాకింది. అందరి చూపులు ఇమ్రాన్ మీద పడ్డాయి. కొందరి చూపుల్లో అతని పట్ల సానుభూతి, మరికొందరి చూపుల్లో వ్యతిరేకత కొట్టొచ్చినట్టు కనిపించింది. ఆ చూపులను ఇమ్రాన్ తట్టుకోలేకపోయాడు.

ఇమ్రాన్, అభినవ్ చౌదరి ఇద్దరూ ఆ విషపు మాటలకు ఏమీ సమాధానం చెప్పలేదు. వివాదం ఇష్టం లేక ఏమీ మాట్లాడకుండా ఉండిపోయినా అది అక్కడితో ఆగలేదు.

కురచ బొట్టున్న వ్యక్తి ముందు కూర్చున్న

మరో వ్యక్తి, అంతకన్నా నీచంగా "వీడి వాలకం చూస్తుంటే, వీడు కూడా ఆ జిహాదీగాడిలానే ఉన్నాడు నాయుడు. అందుకే వాళ్లను వెనుకేసుకుని వస్తున్నాడు. వీళ్ల జాతే అంత, పుట్టుకతోనే వీళ్లు దేశద్రోహులు" అని మరింత విద్వేషపూరితంగా, ఇమ్రాన్ గుండెను కోసేలా, అతని ఉనికిని అవమానిస్తూ అన్నాడు.

బకెట్‌లో హీటర్ పెట్టిన నీటిలా అభినవ్ రక్తం మరిగిపోయింది. ఇమ్రాన్‌ను ఉద్దేశించి అంతటి నీచమైన మాట అనడం ఏమాత్రం నచ్చక, కట్టలు తెంచుకున్న ఆవేశంతో, తన చేతికి ఉన్న రాగి కంకణాన్ని ఎడమ చేతితో పైకి లేపుతూ వాడి పళ్లు రాలగొడదామని లేవబోయాడు.


వివాదాలకు, గొడవలకు దూరంగా ఉండే ఇమ్రాన్, వెంటనే అభినవ్ కుడి చేయి గట్టిగా పట్టుకుని "వద్దు అభినవ్.. వదిలేయ్. వాడు కావాలనే గొడవకు దిగుతున్నాడు. మనకు వద్దు ఈ గొడవ, ఇక్కడ నుంచి వెళ్లిపోదాం పద" అంటూ తన మిత్రుడిని బతిమాలుతూ బలవంతంగా తీసుకెళ్లిపోయాడు.

టేబుల్ మీదున్న కప్‌లో సగం చాయ్ ఎలా అయితే మిగిలిపోయి ఉందో, ఇమ్రాన్‌ను మతం పేరుతో అవమానించిన ఆ వ్యక్తులలోని దురహంకారం, విద్వేషం కూడా పూర్తిగా సంతృప్తి చెందనట్టుగా మిగిలిపోయింది. ఇమ్రాన్, అభినవ్ తలదించుకుని నిస్సహాయంగా వెళ్తుంటే వాళ్లను చూస్తూ వెకిలిగా, క్రూరంగా నవ్వుతూ తమ రాక్షస ఆనందాన్ని బయటపెట్టుకున్నారు ఆ వ్యక్తులు. ఆ నవ్వు ఇమ్రాన్ ఆత్మను నిలువునా కాల్చివేసింది. "నా సొంత దేశంలో నాకు రక్షణ లేదా?" అనే ప్రశ్న భూకంపంలా అతన్ని కుదిపేసింది.

ఆంధ్రా కెఫెలో జరిగిన ఆ గొడవ రోజు రాత్రి.. 2 గంటల సమయం, నిద్ర పట్టకపోవడంతో ఇమ్రాన్ తన ఇంట్లోని లైబ్రరీలో కూర్చుని ఎలీ వీజెల్ రాసిన 'నైట్' పుస్తకాన్ని చదువుతున్నాడు. ఆ పుస్తకంలోని నాజీ కాలం నాటి భయంకరమైన వాస్తవాలను, యూదుల నెత్తుటి చరిత్రను తెలుసుకుని అతని గుండె భయంతో వణికిపోయింది. భారతదేశంలో కూడా పరిస్థితులు నెమ్మదిగా అలా నరకకూపం వైపే వెళ్తున్నాయని, ఆ రాక్షసత్వం, ఆంధ్రా కెఫెలో చూసిన ద్వేషం రేపు తన ఇంటి గుమ్మం దాకా వస్తుందని భావించి తన కుటుంబాన్ని కాపాడుకోవడం కోసం దేశం వదిలి వెళ్లాలని నిర్ణయించుకున్నాడు.

బెడ్ రూంలో ప్రశాంతంగా నిద్రపోతున్న తన భార్య దగ్గరకు బరువైన అడుగులతో వెళ్లి "జైనబ్.. జైనబ్.." అని మెల్లగా వణుకుతున్న స్వరంతో పిలిచాడు.

భర్త పిలుపులోని ఆందోళన, భయాన్ని గుర్తించిన జైనబ్ వెంటనే మేలుకుని, కళ్లు నులుముకుంటూ "ఇంత రాత్రి నిద్ర లేపారు.. ఏమైంది? ఎందుకలా కంగారు పడుతున్నారు?" అని అడిగింది.



"నేనొక నిర్ణయానికి వచ్చాను జైనబ్. మనం ఈ దేశాన్ని వదిలి ఇండోనేషియాకు వెళ్దాం. మనల్ని ఎవరూ అనుమానంగా చూడని, పగతో రగిలిపోని ఆ చోట ప్రశాంతంగా బతుకుదాం" అని బదులిచ్చాడు.

ఇమ్రాన్ మాటలను విన్న జైనబ్ ఆశ్చర్యపోయి "ఏమైంది మీకు.. ఇంత రాత్రి పూట ఏం మాట్లాడుతున్నారు? చెడు కల ఏమైనా వచ్చిందా? ఉదయం తీరిగ్గా మాట్లాడుదాం. ముందు నిద్రపోండి.." అని సర్దిచెబుతూనే.. భర్త ఉన్నట్టుండి ఎందుకు ఇలా చెప్పాడా అని ఆలోచిస్తూ మళ్లీ నిద్రలోకి జారుకుంది.

ఇమ్రాన్ మాత్రం దీర్ఘంగా ఆలోచిస్తూ, తన తల్లిదండ్రుల భద్రత, పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తూ తెల్లవారుజామున నాలుగు గంటలకు నిద్రపోయాడు.

ఉదయం నిద్ర నుంచి లేచిన ఇమ్రాన్, స్నానం చేసి డైనింగ్ రూంలో కూర్చున్నాడు. జైనబ్ ఆప్యాయంగా వడ్డిస్తుంటే మౌనంగా తింటున్నాడు. ఆ మౌనాన్ని ఫోన్ నోటిఫికేషన్‌లా ఛేదిస్తూ జైనబ్ మెల్లగా మాటలు కలుపుతూ, "రాత్రి ఉన్నట్టుండి ఇండోనేషియా వెళ్లిపోదాం అన్నారు. ఎందుకు? అసలు ఏమైంది?" అని అడిగింది.

ఇమ్రాన్ నోటికాడి చేతుల్లోని ముద్ద బలవంతంగా ఏదో అదృశ్యశక్తి ఆపినట్టు ఆగిపోయింది. అతని చేతివేళ్లు తేలికపాటి భూకంపానికి ఇళ్లు వణికినట్టుగా నెమ్మదిగా వణకడం మొదలుపెట్టాయి. కిందికి దించిన తల పైకెత్తకుండానే ఉక్కిరిబిక్కిరి అవుతూ.. "నిన్న ఆంధ్రా కెఫెలో.. నన్ను, నా ఉనికిని ఎలా అవమానించారో తెలుసా జైనబ్?" అంటున్న అతని గొంతులో స్పష్టమైన వణుకు. చేతిలోని ముద్దను పళ్లెంలో పక్కనపెట్టి, బరువెక్కిన కళ్లతో భార్య వైపు చూశాడు. "వాళ్ల కళ్లలో నేను తోటి మనిషిని కాదు.. కేవలం ఒక మత సమూహానికి ప్రతినిధిని. నేనొక నేరస్థుడిని అన్నట్టుగా వాళ్లు నన్ను చూశారు. ఆ చూపులు, ఆ మాటలతో నన్ను నిలువునా కోసేసినట్టు అనిపించింది. నా చుట్టూ ఉన్న గాలి కూడా నాకు పరాయి అయిపోయినట్టు ఊపిరాడలేదు తెలుసా?" అంటుంటే ఆ చేదు జ్ఞాపకం తాలూకు భయం అతని ముఖంలో కనిపించింది.

"పుట్టి పెరిగిన ఊరును, ప్రాణానికి ప్రాణమైన స్నేహితులను వదిలి వేరే దేశానికి వలస వెళ్లేలా కొన్నిసార్లు పరిస్థితులు ఉసిగొల్పుతాయి జైనబ్. కొందరు డబ్బు కోసం, హోదా కోసం విదేశాలకు వెళ్తే.. నేను కేవలం నా కుటుంబం భయపడకుండా బతకడం కోసం, కాసింత ప్రశాంతత కోసం వెళ్లాలనుకుంటున్నాను. నా పిల్లల భవిష్యత్తు కోసం నేను ఈ నిర్ణయం తీసుకోక తప్పడం లేదు" అని గుండెల్లో దాగున్న వేదనను వివరించాడు.

"హైదరాబాద్‌లోని ట్యాంక్ బండ్, ఎంతో పవిత్రమైన మక్కా మసీదు అంటే మీకు ఎంతో ఇష్టం కదండీ. ఈ హైదరాబాద్ నగరంలోనే మీరు పుట్టి పెరిగారు. అలాంటిది అన్నీ వదిలేసి ఇలా వెళ్లిపోవడం ఏంటి? పరిస్థితులు ఎప్పటికీ ఒకేలా ఉండవు కదా! కాలం మారుతుంది. కాబట్టి మనం ఇక్కడే ఉండి ధైర్యంగా బతుకుదాం" అని జైనబ్ నచ్చజెప్పే ప్రయత్నం చేసింది.

"మనుషుల చూపులు, ప్రవర్తన మారిపోయాయి జైనబ్" అంటూ ఇమ్రాన్ గత రంజాన్ పండుగనాటి ఘటనను గుర్తు చేశాడు. అలా ఇద్దరు గతంలోకి వెళ్లారు. జైనబ్ తమ ఇంటి ముందున్న రాజ్యలక్ష్మికి బిర్యానీ, పాయసం ఇవ్వడానికి వెళ్లింది. జైనబ్ తలుపు తట్టగానే ఫేస్బుక్‌లో లీనమైన రాజ్యలక్ష్మి తలుపు తెరిచి చూసి, "ఏమమ్మా జైనబ్.. ఏంటి రాక" అని చేదు వేపాకు నమిలినట్టు అడిగింది.

"ఏం లేదు భాభీ జీ.. ఈరోజు రంజాన్ కదా బిర్యానీ, పాయసం ఇవ్వడానికి వచ్చాను" అని ప్రేమగా ఇవ్వడానికి

**ఆహ్వానం : కథలు పంపేవారు ఎ4 సైజులో 18 ఫాంట్‌తో 4 పేజీలకు మించకుండా పంపవలెను. కథలు మూఢనమ్మకాలు లేని, అభ్యుదయ, సామాజిక, వర్తమాన రాజకీయ అంశాలపై వుండొచ్చు.**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ప్రయత్నిస్తే, "వద్దమ్మా.. వద్దు.. కొన్ని రోజుల క్రితం బయటి తిండి అసలే తినొద్దని అనుకున్నాను. ఎందులో ఎవరు ఏం కలుపుతున్నారో ఏమో.." అని వంకర్లు పోతూ చేతులు ఊపుకుంటూ మాట్లాడి, చీదరించుకుని మొఖం మీదే తలుపులు మూసేసింది. అమాంతం తలుపు వేయడం వల్ల ఒక రెక్క పై అంచు సన్నగా నెర్రలు వాసింది. తలుపుకు ఆనుకుని ఉన్న సిమెంట్ ముక్కలు ఎగిరిపడి జైనబ్ ముఖానికి తగిలి గాయం చేశాయి, సిమెంట్ ముక్కలు చేసిన గాయం కంటే రాజ్యలక్ష్మి మాటల వల్ల ఏర్పడిన గాయమే జైనబ్‌ను ఎక్కువ బాధపెట్టింది. కిటికీలో నుంచి ఆ దృశ్యాన్ని చూసిన ఇమ్రాన్ ఎంత బాధపడ్డాడో జైనబ్ అంతకు రెట్టింపు బాధపడింది.

ఆరోజు అవమానంతో జైనబ్ ఏడ్చిన విషయాన్ని గుర్తుచేస్తూనే," అలానే ఆఫీసులో ఎవరైనా కొత్తవాళ్లు నా పేరు వినగానే వారి ముఖాల్లో క్షణాల్లో మారిపోయే హావభావాలు, నన్నో నేరస్థుడిని చూసినట్టు చూసే ఆ చూపులు.. నన్ను ప్రతిరోజూ ఎన్నిసార్లు లోలోపల కుంగదీశాయో నీకు తెలుసా?" అని జైనబ్‌ను ఇమ్రాన్ ప్రశ్నించాడు.

ఇమ్రాన్ ప్రశ్నతో గత సంఘటన జ్ఞాపకంతో విద్వేషానికి సైతం అరికట్టలేని మౌనం ఇద్దరి మధ్య కొద్దిసేపు ఆవరించింది.

బాధతో కూడిన గొంతుతో మెల్లగా మాట్లాడుతూ "అవునండీ, ఇవన్నీ వాస్తవమే.. నేను అనుభవించాను. కానీ పుట్టిన దేశం వదిలి వెళ్లడం పరిష్కారం కాదు కదా, ఎంతో స్వచ్ఛమైన ప్రేమను పంచే యాదమ్మలాంటి వాళ్లు కూడా ఉన్నారు. ఏదైతే అదాయే ఇక్కడే ఉండి సవాళ్లను ఎదుర్కొందాం" అని జైనబ్ ఆశగా అంది.

"ఎవరికోసం ఎదుర్కోవాలి జైనబ్? ఎవరో కొందరు నాయకుల స్వార్థం కోసం అడ్డగోలుగా జరుగుతున్న ఈ అల్లర్లలో మన పిల్లల ప్రాణాలను పణంగా పెడదామా? ఏ పాపం చేయని వాళ్ల మీద జరుగుతున్న దాడులను టీవీల్లో, న్యూస్ పేపర్లలో చూస్తుంటే నా రక్తం ఉడికిపోతోంది. కనీసం ఆ బాధను చెప్పుకునే స్వేచ్ఛ కూడా లేదు. ఎవరైనా ధైర్యంగా గొంతు విప్పితే, వాళ్లను అక్రమ కేసుల్లో ఇరికించి జీవితాంతం జైళ్లలో మగ్గేలా చేస్తున్నారు. నా పిల్లలు ఆ భయంలో పెరగడం నాకిష్టం లేదు. నాకు నా కుటుంబం ముఖ్యం జైనబ్" అని ఇమ్రాన్ ఆవేశపడ్డాడు.

చివరకు, దేశం విడిచి వెళ్లడానికి అస్సలు ఇష్టపడని తన తల్లిదండ్రులను చేతులు పట్టుకుని బ్రతిమాలుకుని.. కేవలం తన కుటుంబాన్ని, వారి ఉనికిని, స్వేచ్ఛను కాపాడుకోవడం కోసం గుండె నిండా బాధను మోస్తూనే హైదరాబాద్‌కు కన్నీటి వీడ్కోలు పలుకుతూ ఇండోనేషియాకు వెళ్లడానికి సిద్ధమయ్యాడు.

చివరిసారి ఇంటి వైపు చూసి జైనబ్ కారు ఎక్కింది. వీధి చివర నుంచి ఆయాసపడుతూ యాదమ్మ పరిగెత్తుకుంటూ వచ్చింది. కట్టుకున్న పాత చీర చెంగు నేలను ఊడుస్తున్నా పట్టించుకోకుండా, అడుగులు తడబడుతున్నా లెక్కచేయకుండా రొప్పుతూ వచ్చింది. ఆమె ముఖమంతా కన్నీళ్లతో తడిసి వుంది.

"బిడ్డా.. బిడ్డా.. దేశం ఇడిసి ఎల్తున్నరట కదా..! ఎందుకు బిడ్డా ఇట్ల చేస్తుండ్రు?" అంటూ కారు డోరు పట్టుకుని కుప్పకూలిపోయినంత పని చేసింది.

"మీకేం కాదు రా.. మీ ప్రాణాలకు నా ప్రాణం అడ్డేసైనా కాపాడుకుంటా.. ఈ ముసల్దాని మాట ఇని ఎల్లకుండ్రి బిడ్డా.."



అని కన్నీళ్లు వరదలా పారుతుంటే దీనంగా ప్రాధేయపడింది యాదమ్మ.

"ఆయన వెళ్దాం అన్నారు. తప్పడం లేదు యాదమ్మా.." అంటూ చెమ్మగిల్లిన కళ్లతో జైనబ్ చెప్పింది.

యాదమ్మను చూడగానే కారు దిగిన ఇమ్రాన్, ఆమె దగ్గరకు వచ్చాడు. వణుకుతున్న తన చేతులతో ఇమ్రాన్ ముఖాన్ని రెండు చేతుల్లోకి తీసుకుంది యాదమ్మ. ఆ ముడతలు పడిన చేతుల స్పర్శలో కల్తీలేని తల్లి ప్రేమ ఉట్టిపడుతోంది.

కళ్లలోకి కళ్లు పెట్టి చూస్తూ, "బిడ్డా.. నిన్ను అమ్మలా పెంచాను. నా కడుపున పుట్టకపోయినా, మనకు పేగు బంధం లేకపోయినా.. నా సొంత కొడుకులా చూసుకున్నా రా. ప్రేమతో అడుగుతున్నా.. ఇక్కడే ఉండిపోరా నాన్న" అంటూ గొల్లుమన్నది.

ఇమ్రాన్ గొంతు పూడుకుపోయింది. అతని కళ్లలో నీళ్లు సుడులు తిరిగాయి. ఆ కన్నీళ్లను బలవంతంగా ఆపుకుంటూ, యాదమ్మ చేతులను తన చేతుల్లోకి తీసుకుని కుడి చేతి మణికట్టు మీద ముద్దు పెట్టి "అప్పుడప్పుడు వస్తూ ఉంటాం కదమ్మా.. ఏం బాధపడకు. విమానానికి టైం అవుతోంది, వెళ్తాము" అని భరోసా ఇచ్చాడు.

ఆ భరోసా ఎడారిలో ఎండమావిలాంటిదని ఇద్దరికీ తెలుసు. ఇమ్రాన్ నుదుటిపై తన వణుకుతున్న పెదవులతో ముద్దు పెట్టిన యాదమ్మ కన్నీరు అతని బుగ్గలపై జారింది. "పైలం బిడ్డా.. ఎక్కడున్నా సల్లంగుండాలి నా కన్నా.." అని దీవించింది. ఆ తర్వాత జైనబ్‌ను గట్టిగా గుండెలకు హత్తుకుని, వెక్కి వెక్కి ఏడుస్తూ.. "నా కొడుకును కంటికి రెప్పలా సూస్కో.. అప్పుడప్పుడు ఫోన్ చేస్తుండ్రి" అని వీడ్కోలు పలికింది.

యాదమ్మ వైపు చూస్తూ జైనబ్, ఇమ్రాన్ కారు ఎక్కారు. ఒకవైపు విద్వేషం అగ్ని శిఖలు కక్కుతుంటే, ప్రేమతో రాలిన యాదమ్మ కన్నీళ్లు భూమిని తాకక ముందే ఆవిరైపోయాయి.

ముషీరాబాద్ నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌కు ఇమ్రాన్ కుటుంబం వెళ్లేటప్పుడు కారులో ఎఫ్ఎం ప్లే అవుతోంది, "శ్రీరామ నవమి శోభాయాత్ర సందర్భంగా భాగ్యనగర్ అంగరంగవైభవంగా ముస్తాబయ్యింది" అని రేడియో జాకీ వెన్నెల తన శ్రోతలకు చెప్తోంది. ఈ మాటలను పట్టించుకోకుండా డ్రైవర్ వంశీ కారు నడుపుతుంటే, ఇమ్రాన్ తన ఆలోచనలో తాను లీనమయ్యాడు. కారు ముందు సీట్లో డ్రైవర్ పక్కకు కూర్చున్న ఇమ్రాన్ ముందు నుంచి తనకు సుపరిచితమైన కూరగాయలు అమ్మే రెహానా పెద్దపెద్ద పరదాలతో ముసుగేసిన మస్జీద్ ముందు నుంచి వెళ్తోంది. మస్జీద్ వైపు బాణం ఎక్కుపెట్టిన శ్రీరాముడి భారీ కటౌట్ చాటు నుంచి తనను చూసిన ఇమ్రాన్‌కు "నాకు డబ్బులు, నైపుణ్యం ఉన్నాయి. నేను ఇక్కడ నుంచి వెళ్లిపోతున్నాను.. మరి ఇటువంటి సామాన్య ప్రజల సంగతేంటి?" అనే సందేహం వచ్చింది. ఆ సందేహాన్ని ఆపేస్తూ చివరికి ఇమ్రాన్ కుటుంబం ఎయిర్‌పోర్ట్‌కు చేరుకుంది. ఇండోనేషియా విమానం ఎక్కారు.


ఎన్నో ఆశలతో, అంతకుమించిన భయాలతో జకార్తా నగరంలో అడుగుపెట్టిన ఇమ్రాన్, అక్కడ స్వేచ్ఛగా, ఎవరి ద్వేషపు చూపులు పడకుండా, మతం పేరుతో

తరువాయి 18వ పేజీలో...

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

పుస్తక సమీక్షలు

# చెన్నప్ప సాహిత్య దర్శనం




**మసన చెన్నప్ప సమగ్ర సాహిత్య దర్శనం-**
**రచన : ధూళిపాళ అరుణ,**
**పుటలు : 274; వెల :200/-**
**ప్రతులకు - ధూళిపాళ దత్తాత్రేయ శర్మ, హరిహర త్రిశక్తి క్షేత్రం, వలిగొండ 508112, యాదాద్రి భువనగిరి జిల్లా ఫోన్ 8712342323**

మన సాహిత్యంలో సాహితీవేత్తల సాహిత్యమును పరిశీలిస్తూ వాటి గురించి వ్యాసాలు వెలువరించడమూ, ఆ సాహిత్యంను విశ్లేషణతో కూడిన రచనలు వెలువరించడం చూస్తూనే ఉన్నాం. అలాగే సాహితీవేత్తలతో ముఖాముఖి నిర్వహించి వారి సాహిత్య కృషిని బహిర్గతం చేయడం ఒక పద్ధతి.

అరుణ పైన చెప్పిన ప్రక్రియలలో సాధికారతను పొంది మసన చెన్నప్ప గారితో మయూఖ అంతర్జాల పత్రిక కోసం ముఖాముఖి నిర్వహించారు. ఇందుకు కొనసాగింపుగా మసన చెన్నప్ప సప్తతికి, ఆయన సాహిత్యం (60 పుస్తకాలు) అంతా ఔపాసన చేసి, వివేచనతో "మసన చెన్నప్ప సమగ్ర సాహిత్యము" పేరుతో ఈ గ్రంథాన్ని రచించారు. ఈ పుస్తకంలో చెన్నప్ప గేయ కవిత్వం, పద్య కవిత్వం, శతకాలు, వచన కవిత్వం, సాహిత్య వ్యాసాలు, ఆధ్యాత్మిక వ్యాసాలు, అనువాద సాహిత్యం, యం.ఫిల్., పి.హెచ్.డి.(పరిశోధన అంశాలు); వచన గ్రంథాలు, నాటిక, నవల, జీవిత చరిత్ర, యాత్రా చరిత్ర, యోగ దర్శనం ఇలా సంపూర్ణ సాహిత్యాన్ని మధించి ఒక సంపూర్ణ గ్రంథాన్ని వెలువరించారు. ఒకవిధంగా ఈ అంశాన్ని తీసుకుని ఏదేని విశ్వవిద్యాలయంలో డాక్టరేటు పట్టాకోసం సమర్పించి ఉంటే, ఆ పట్టా ఆవిడ చేతికి వచ్చి ఉండేది. దీని వలన మనకు తెలిసివచ్చినదేమిటంటే కేవలం ఏ ఆకాంక్ష లేకుండా, నిబద్ధతతో మసన చెన్నప్ప సాహిత్యానుశీలనం చేసారని చెప్పవచ్చును.

ధూళిపాళ అరుణ ఎంచుకున్న మార్గం ఇతరులు అనుసరించదగినదిగా ఉంది. ఇపుడెవరైనా చెన్నప్ప సాహిత్యాన్ని ఎంచుకుని పరిశోధన చేస్తే వారికిది ఒలిచిన పండు చేతిలో పెట్టినట్టుగా ఉంటుంది. ఈ పుస్తకంలో అరుణ చెన్నప్పతో చేసిన ముఖాముఖిని కూడా జతపరిచింది.

పద్య కవిత్వం, యోగ దర్శనం మరికొన్ని అధ్యాయాలను పరిచయం చేసేటప్పుడు కొంత జాగ్రత్త పడితే బాగుండేదనిపించినది. ఏదేమైనా అరుణ చెన్నప్పలకు అభినందనలు.

**డాక్టర్ టి.శ్రీరంగస్వామి**

......13వ పేజీ తరువాయి

అవమానాలు పడకుండా, ప్రాణభయం లేకుండా గుండెనిండా ఊపిరి పీల్చుకున్నాడు. ఇండోనేషియాలో అతనొక 'రెండవ తరగతి పౌరుడు' కాదు, ఒక స్వతంత్ర మనిషి. అతని మతం గురించి, అతను తినే తిండి గురించి, అతను వేసుకునే బట్టల గురించి ఎవరూ ద్వేషపూరితంగా ప్రశ్నించరు. ఎటువంటి సమాచారం ఇవ్వకుండా అర్ధరాత్రి బుల్డోజర్లతో వచ్చి తన ఇంటిని కూల్చే భయం అక్కడ లేదు. ఆంధ్రా కెఫేలోని విలన్లూ అక్కడ లేరు.

భారతదేశం నుంచి ఇండోనేషియాకు వచ్చి అప్పటికే కొన్నేళ్ల కాలం గడిచిపోయింది. ఇంగ్లీషుపై అతనికి ఉన్న అద్భుతమైన పట్టు, ఇండోనేషియాలో అవకాశాల తలుపులు తెరిచింది. ఒక సివిల్ ఇంజనీర్‌గా అద్భుతమైన ప్రతిభతో గొప్ప పేరు తెచ్చుకున్నాడు. నుసంతారా నగర నిర్మాణంలో పాలుపంచుకుంటున్న ఒక పెద్ద బహుళజాతి సంస్థలో అత్యున్నత స్థాయికి ఎదిగాడు. పరోక్షంగా, ప్రత్యక్షంగా అతని కింద ఎంతో మంది పనిచేస్తూ ఉపాధి పొందుతున్నారు. తన కొడుకు పేరుతో ఇండోనేషియాతోపాటు ఇండియాలో కూడా ఎన్నో సేవా సంస్థలను స్థాపించి, పేదలకు అండగా నిలబడుతున్నాడు. నుసంతారా నగర శివార్లలో, పచ్చటి అడవుల మధ్య ప్రశాంతమైన లోయ అంచున తాను స్వయంగా, భూకంపాలను సైతం తట్టుకునేలా ఎంతో పకడ్బందీగా డిజైన్ చేసుకున్న ఒక అత్యంత విలాసవంతమైన భవనంలో తల్లిదండ్రులు, భార్య, ఎదిగిన పిల్లలతో ప్రశాంతంగా నివాసం ఉంటున్నాడు.

---

తన గతపు చేదు జ్ఞాపకాల ప్రవాహం నుంచి తిరిగి వర్తమానంలోకి వచ్చాడు ఇమ్రాన్. కాఫీ కప్పును పక్కకు పెట్టి డైనింగ్ రూంలో వృద్ధాప్యానికి చేరువైన తల్లిదండ్రులు, భార్య, పిల్లలతో కలిసి టిఫిన్ చేసి ఆఫీసుకు వెళ్లాడు. ఆ రోజంతా గడిచిపోయింది.

చీకటి పడింది. ఉదయం చూసిన వార్తల తాలూకు భారం ఇంకా మనసును తొలిచేస్తున్న ఆ రాత్రి.. సమయం సరిగ్గా 9:17 గంటలు.. ఆఫీసు పని ముగించుకుని తన కారులో ఇమ్రాన్ ఇంటికి బయలుదేరాడు. మార్గ మధ్యలో ఎదురుగా వచ్చిన పెద్ద లారీ ఇమ్రాన్ కారును బలంగా గుద్దింది. ప్రమాదంలో నుజ్జునుజ్జైన కారు రోడ్డు పక్కనున్న చెట్ల పొదల్లో పడింది. ఇమ్రాన్ వెంటనే స్పృహ కోల్పోయాడు.

మెల్లగా స్పృహలోకి వచ్చేసరికి, అతనికి దట్టమైన చీకటి కాదు, ఆసుపత్రి గదిలోని తెల్లని లైట్ల వెలుతురు కనిపించింది. కాళ్లు, చేతులకు పట్టీలు కట్టి ఉన్నాయి, కానీ శ్వాస తీసుకోవడం నిలకడగా ఉంది. ప్రాణాపాయం తప్పిందని పక్కనే కన్నీరుమున్నీరుగా ఏడుస్తున్న జైనబ్, ఊపిరి పీల్చుకున్న తల్లిదండ్రులు, ఆందోళనగా చూస్తున్న పిల్లలు అతని కళ్లలో పడ్డారు. అదృష్టవశాత్తూ తాను బతికే ఉన్నానని అతనికి అర్థమైంది.

భూకంపాన్ని సైతం తట్టుకునేలా తాను ఎంతో పకడ్బందీగా డిజైన్ చేసుకున్న భవనంలో సురక్షితంగా ఉండాల్సిన పిల్లలు, తల్లిదండ్రులు ఇప్పుడు తన కోసం ఆసుపత్రిలో ఎదురుచూస్తూ ఉన్నారు.

ఆసుపత్రి మంచం మీద, నొప్పులతో బాధపడుతూనే ఇమ్రాన్ మనసు భౌగోళిక సరిహద్దులను దాటుకుని భారతదేశంలోని తన పాత ఇంటి వైపు మళ్లింది. ఆంధ్రా కెఫేలో సగం తాగిన చాయ్ గ్లాస్, పాతబస్తీ ఇరుకు వీధులు, జైనబ్ చేతుల్లో చల్లారిపోయిన బిర్యానీ పాత్ర, అభినవ్ చౌదరి ఆవేశం, యాదమ్మ స్వచ్ఛమైన ప్రేమ.. అన్నీ ఒకేసారి కళ్ల ముందు మెదిలాయి.

ఒక క్షణం "అక్కడే నిలబడాల్సిందా...?" అనే ఆలోచన అతని లోపల మెదిలి వేడి నిట్టూర్పుతో మళ్లీ కరిగిపోయింది. చావు అంచుల దాకా వెళ్లి బతికి బయటపడినందుకు సంతోషించాలో, తన సొంత గడ్డపై ప్రాణ రక్షణ, ప్రశాంతత ఎందుకు కరువైపోయాయో తెలియక అతని కళ్లలో నుంచి జారిన కన్నీటి బొట్టు వెచ్చగా బుగ్గలపై రాలింది.

◆◆

కథ

# చీలిన దారులు

బొల్లిముంత వెంకట రమణారావు

**మీరా అర్జున్‌ను ప్రాణ సమానంగా ప్రేమించేది. వారి ప్రేమ పెద్ద మాటల్లో కాదు, చిన్న చిన్న మధురమైన క్షణాల్లో వారి ప్రేమ గుసగుసలు ఉండేవి.**

అతని ఫోన్ ఎప్పుడూ మధ్యలో ఆగిపోవడం ఆమెకు తెలిసిన సంగతే. కొన్ని సార్లు "ఫోనులో బ్యాలన్స్ లేదు" అని అనేవాడు.

కొన్నిసార్లు "నీ మాటలు అతని వినిపించట్లేదు... మళ్లీ చెప్పు..." అని అతను అనడం, చిన్న చిన్న చిలిపి కబుర్లతో వారి సంభాషణ సాగేది.




మీరా అలకలు, అర్జున్ బుజ్జగింపులు మధ్య వారి రోజువారి జీవితంలో సాధారణం అయిపోయింది.. "ఈ ఫోన్ ప్రేమ కాపురం బాగుంది అని" నవ్వుకునేవారు.

అతని పుట్టిన రోజు దగ్గర పడుతున్నప్పుడు మీరా ఒక నిర్ణయం తీసుకుంది. అతను ఎప్పుడూ తనతో మాట్లాడగలిగేలా ఉండాలని ఆమె అనుకుంది. అందుకే అతని నంబర్‌కు రీచార్జ్ చేసింది అన్ లిమిటెడ్ కాల్స్. అది చిన్న పని అయినా, ఆమెకు అది తన చిరు ప్రేమ కానుకగా భావించింది. అదే సమయంలో ఆమె అతని ఇంటి అడ్రసును అడగాలని అనుకుంది... కానీ ప్రతిసారీ ఆ ఆలోచన ఆగిపోయేది "ఇంకెప్పుడు కావాలనుకుంటే అప్పుడు తీసుకోవచ్చు" అనే నిర్లక్ష్యం కావచ్చు. "ఇంట్లో తెలిస్తే బాగుండదు.." అనుకుంది.

నంబర్ కూడా ఒక అమ్మాయి పేరుతో 'సేవ్' చేసింది.

అదే సమయంలో అర్జున్ కూడా మీరా కోసం ఒక చిన్న సిల్వర్ పెండెంట్ కొనాలని నిర్ణయించుకున్నాడు. అది విలువలో చిన్నది, కానీ భావంలో పెద్దది. "దూరం ఉన్నా, ఆమె దగ్గర నా గుర్తు ఉండాలి" అని అతను అనుకున్నాడు.

కానీ ఆ పెండెంట్ కొనడానికి డబ్బు కావాలి. అతని దగ్గర ఉన్న ఏకైక విలువైన వస్తువు అతని ఫోన్. మీరాతో గడిపిన ప్రతి సంభాషణ, ప్రతి నవ్వు, ప్రతి నిశ్శబ్దం అన్నీ దానిలో దాగి ఉన్నాయి. అయినా అతను ఒక నిర్ణయం తీసుకున్నాడు. ఫోన్ అమ్మేశాడు. ఆ డబ్బుతో పెండెంట్ కొనుగోలు చేశాడు.

అతను దానిపై ఒక నిర్ణయం కూడా తీసుకున్నాడు వాలెంటైన్ రోజున మీరా అడ్రసుకు పంపించాలని.

సాయంత్రం అయ్యింది..

మీరా ఫోన్ దగ్గరే కూర్చుంది. అతను కాల్ చేస్తాడని ఆమెకు నమ్మకం ఉంది. కానీ గంటలు గడిచినా కాల్ రాలేదు.

ఈ పెద్ద మనిషికి తన మీద ప్రేమ తగ్గిపోతుంది. ఆమె కోపంగా చివరికి తానే కాల్ చేసింది.

ఫోన్ రింగ్ అయ్యింది...

ఒక్కసారి...

రెండుసార్లు...

కానీ కాల్ లిఫ్ట్ చేసింది అర్జున్ కాదు. ఒక అపరిచిత వ్యక్తి గొంతు.

"హలో?" ఎవరూ అన్నాడు. మీరా ఒక్క క్షణం తడబడింది. "అర్జున్ ఉన్నాడా?" అని అడిగింది. కొద్దిసేపు నిశ్శబ్దం. తరువాత ఆ వ్యక్తి అన్నాడు.

"ఈ ఫోన్ ఈ రోజే అమ్ముశారు" ఒక వ్యక్తి.

ఆ మాట విన్న వెంటనే మీరా మనసు ఒక్కసారిగా కలవరపడింది. ఆమె రీచార్జ్ చేసిన ఆనందం, పుట్టిన రోజు ప్లాన్ అన్నీ కలలుగా మిగిలిపోయాయి.

అదే సమయంలో అర్జున్ కూడా మీరాకు కాల్ చేయడానికి..

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

ప్రయత్నించాడు. ఎవరో ఒకరి ఫోన్ తీసుకుని డయల్ చేశాడు.

"అతనికి డబ్బుతో అంత ఏమి పని? నన్ను అడగవచ్చు. వాలెంటైన్స్ డేకు కలవాలని ప్రమాణాలు చేసుకున్నాము. అన్ని కల్లబొల్లి కబుర్లేనా?!" అనుకుంది మీరా.

కాల్ వెళ్లింది... కానీ అతను "రాంగ్ నంబర్.." అని అన్నాడు.

ఒకవేళ నన్ను వదిలించుకోవడానికి అతని ప్రయత్నమా? మీరా కళ్ళు బాధతో చెమ్మగిల్లాయి. ఆ క్షణం తర్వాత వారి ప్రేమ సందేశం పూర్తిగా తెగిపోయింది.

....................

రోజులు గడిచాయి.

నెలలు గడిచాయి.

సంవత్సరాలు గడిచాయి.

మీరా తన జీవితాన్ని ముందుకు తీసుకెళ్లింది. అర్జున్ కూడా అలాగే. ఇద్దరూ వేర్వేరు జీవితాల్లో స్థిరపడ్డారు. కానీ అర్జున్ దగ్గర ఒక చిన్న వస్తువు మాత్రం మిగిలింది ఆ పెండెంట్. అది ఎప్పుడూ పంపించబడలేదు. వాలెంటైన్ తర్వాత ఫోన్ పోయిన రోజు అతను గిఫ్ట్ పంపడానికి ప్రయత్నించాడు, కానీ అడ్రస్ పూర్తిగా లేదు. మీరా నంబర్ కూడా పనిచేయలేదు. అతను అనేక ప్రయత్నాలు చేశాడు... కానీ ప్రతి ప్రయత్నం ఒక నిశ్శబ్దంలో ముగిసింది. చివరికి ఆ పెండెంట్ అతని దగ్గరే మిగిలిపోయింది పంపించలేని ప్రేమలా.

ఎన్నెన్నో సంవత్సరాల తర్వాత... ఒక రోజు...

ఒక రైల్వే స్టేషన్లో.

మీరా తన కుటుంబంతో ప్రయాణం కోసం వచ్చింది.

అర్జున్ కూడా తన కుటుంబంతో అక్కడే ఉన్నాడు.

రద్దీ మధ్య ఒక్క క్షణం... వాళ్ల కళ్ళు కలిశాయి.

ఆగిపోయిన కాలం ఒక్కసారిగా మళ్లీ వెనుకకు తిరిగినట్టు అనిపించింది.

గతం మొత్తం ఒక్క క్షణంలో కళ్ళ ముందు మెదిలింది–రీచార్జ్, అమ్మిన ఫోన్, మిస్ అయిన కాల్స్ ఆ నిశ్శబ్దం. అర్జున్ కాస్త నవ్వాడు. మీరా కూడా నవ్వింది. కానీ అది ప్రేమ కాదు... అది ఒక జ్ఞాపకాన్ని గుర్తించిన చిరునవ్వు మాత్రమే. ఇంతలో ట్రైన్ వచ్చి ప్లాట్ ఫామ్ పైన ఆగింది. ఆమె పిల్లలు పిలుస్తున్నారు. ట్రైన్ వైపు కదులుతూ, మీరా ఒక్కసారి అతన్ని

**అర్జున్ కాస్త నవ్వాడు. మీరా కూడా నవ్వింది. కానీ అది ప్రేమ కాదు... అది ఒక జ్ఞాపకాన్ని గుర్తించిన చిరునవ్వు మాత్రమే. ఇంతలో ట్రైన్ వచ్చి ప్లాట్ ఫామ్ పైన ఆగింది. ఆమె పిల్లలు పిలుస్తున్నారు.**

చూసింది. అతను తన జేబులో చేయి పెట్టి ఆగిపోయాడు. మెల్లగా బయటకు తీసాడు.. అదే సిల్వర్ పెండెంట్. అది ఇంకా అతని దగ్గరే ఉంది.


అతను చాలా నెమ్మదిగా "ఇది నీకు ఇవ్వలేకపోయాను.." అని అన్నాడు.

మీరా కళ్ళు ఒక్క క్షణం తడిచాయి. ఆమె మెల్లగా నవ్వింది. రెండు కన్నీటి చుక్కలు రాలాయి. ఆమె మెల్లగా "అప్పుడది ఇవ్వకపోవడమే... బహుశా మన ప్రేమకు మిగిలిన అందమైన జ్ఞాపకం అయ్యిందేమో!"

ఒక క్షణం మౌనం. ట్రైన్ శబ్దంతో వారిని విడదీసింది. ట్రైన్ తన గమ్యం వైపు కదిలింది. ఆమె ట్రైన్ కూడా కదిలింది.


వాళ్లు వేర్వేరు దారుల వైపుకు వెళ్లిపోయారు. కానీ ఆ స్టేషన్లో ఒక చేదు నిజం మిగిలింది. "కలవని ప్రేమ కూడా ప్రేమే... అది మాటలకందని మౌనంగా మన లోపల శాశ్వతంగా జీవిస్తుంది. కొన్ని ప్రేమకథలు మనుషులతో ముగిసిపోతాయి, కానీ మనసులో మాత్రం ఎప్పటికీ అంతం కావు. ■

## పిపా యువాన్ రెస్టారెంట్



చైనాలో మ్యాజిక్ సిటీ, మౌంటెన్ సిటీగా పేరొందిన చాంగ్‌కింగ్ నగరంలో కొండను దాదాపు పూర్తిగా ఆక్రమించేలా రెస్టారెంట్‌ను నిర్మించారు. ఈ హాట్‌పాట్ రెస్టారెంట్‌ను 'పిపా యువాన్' అని పిలుస్తారు. 8,000 మంది ఒకేసారి కూర్చుని తినేలా టేబుళ్లు ఉంటాయి. నాన్‌షాన్ కొండపై పచ్చని ప్రకృతిని ఆస్వాదిస్తూ భోజనం చేయడం ఇక్కడి పర్యాటకులకు వింత అనుభూతి. ఆహ్లాదకర వాతావరణంలో ఇష్టమైన వంటకాలను తినడం ఎంత ఆనందంగా ఉంటుందో చెప్పటానికి మాటలు చాలవు. మిగతా ప్రాంతాల్లో ఎన్ని రెస్టారెంట్లు ఉన్నప్పటికీ ఇక్కడి ప్రత్యేకతే వేరు. ఇక రాత్రి సమయాల్లో అయితే కొండంతా విద్యుత్ దీపాలతో మెరిసిపోతుంది. ఈ రెస్టారెంట్‌కు వెళ్లాలంటే ముందుగా టేబుల్ బుక్ చేసుకునే వెళ్తారు. కొండపైన కాబట్టి వాహనాలు కిందే పార్క్ చేయాలి. ప్రకృతి మధ్యలో కూర్చునే సౌకర్యం ఉన్న ఈ రెస్టారెంట్‌లో అక్కడి తోటలో పండే లోక్వాట్‌లను స్వయంగా కోసుకుని తినే సౌకర్యం కూడా ఉంటుంది. పర్యాటకుల రద్దీతో ఈ రెస్టారెంట్ ఒక పర్యాటక ప్రదేశంగా మారింది. ప్రపంచంలోనే అతి పెద్ద రెస్టారెంట్‌గా గిన్నిస్‌బుక్‌లో స్థానాన్ని సంపాదించింది. ఇంతపెద్ద రెస్టారెంట్‌లో శుభ్రతకు లోటులేదని, తాజా పదార్థాలు అందిస్తారని పర్యాటకులు చెప్తుంటారు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



# ఉత్తమ గ్రంథం

కథ

మొలకలపల్లి కోటేశ్వరరావు
9989 224 280

ఊరంతా సందడిగా ఉంది. శ్యామ్ కి స్వాగతాలూ, శుభాకాంక్షలూ చెపుతూ అన్ని వీధుల్లోనూ తోరణాలూ, ఫ్లెక్సీలూ కట్టారు. శ్యామ్ సన్మానసభకి వస్తున్న కలెక్టర్ కి, ముగ్గురు ఎమ్మెల్యేలకి కూడా స్వాగతాలు చెబుతూ కొన్ని ఫ్లెక్సీలుగా. తమ ఊరివాడు కేంద్ర ప్రభుత్వసంస్థ నాఫెడ్ ఎండీగా నియమితుడయ్యాడు. ఎండి అంటే ఆ సంస్థకి అత్యున్నతాధికారి. తమ వూరి మనిషి నేతృత్వంలో దేశవ్యాప్త సంస్థ పనిచేస్తోంది అంటే గర్వకారణమైన విషయమని ఊరి పెద్దలు ఢిల్లీ వెళ్లి, శ్యామ్ ని కలిసి, ఒక్కసారి ఊరికి విచ్చేయవలసిందిగానూ, సన్మానం స్వీకరించవలసిందిగానూ అభ్యర్థించారు. వీలు చూసుకొని వస్తానని హామీ ఇచ్చి, ఈరోజు వచ్చాడు. 14 ఏళ్ల క్రితం ఒకసారి వచ్చాడు. మళ్ళీ ఇప్పుడే రావడం. చిన్ననాటి స్నేహితుల్నీ, పరిచయస్తుల్నీ కలుసుకుంటూ మొదటగా తనకి ఆప్తులైన శంకరయ్య వాళ్ళింటికి వచ్చాడు. తన ఉన్నతికి ఒకరకంగా శంకరయ్య వాళ్ళ కుటుంబం కూడా సాయపడింది.

'ఎలా ఉన్నావు శంకర్? పిల్లలు ఎంతమందీ, ఏం చదువుతున్నారు?` వస్తూనే ఆప్యాయంగా పలకరించాడు శ్యాం.

'ఏముందండీ.. ఏదో ఇలా ఉన్నాం. ఇద్దరు పిల్లలు. ఒకరు ఇంజనీరింగ్, ఒకరు డిగ్రీ పూర్తిచేశారు. ఉద్యోగాలు రాలేదు. ఆ ప్రయత్నాల్లో ఉన్నారండి`

'అండి ఏమిటీ, చిన్నప్పుడు రేయ్ అని తప్ప, పేరు పెట్టి కూడా ఎప్పుడూ పిలిచేవాడివి కాదు. అలాగే పిలువు. ఎవరు ఎంత పెద్ద స్థాయిలో ఉన్నా తల్లికి బిడ్డే. అలాగే నేను ఈ ఊరి బిడ్డని. మీ అందరివాడినే.. కానీ ప్రత్యేకంగా ఆకాశం నుంచి వూడి పడలేదు. మీ అమ్మానాన్నని నా జీవితంలో నేను ఎప్పుడూ మరచిపోలేదు.. మరచిపోను కూడా! నాకు వాళ్ళు చాలా సాయం చేసారు.`

'అదేం మాటలు శ్యాంగారూ..`

'మళ్ళీ గారు ఎందుకు? వద్దు.. ''శ్యామ్'' అని పిలువు చాలు!`

అంత పెద్ద స్థాయిలో ఉన్న శ్యామ్‌తో మాట్లాడాలంటే శంకరయ్యకి బిడియంగానూ, సంకోచంగానూ, బెరుకుగానూ వుంది.

ఏడో తరగతి వరకూ శంకరయ్య, శ్యామ్ ఇద్దరూ క్లాస్ మేట్లు. శ్యామ్ చదువులో చాలా చురుకు. టీచర్లు సైతం శ్యామ్ అసాధారణ ప్రతిభకీ, తెలివికీ ఆశ్చర్యపోయేవాళ్ళు. శ్యామ్ చదువులో ముందుకిపోతే, శంకరయ్య డిగ్రీ పూర్తిచేసి వ్యవసాయంలో పడ్డాడు. పాతిక ఎకరాల పొలం ఉంది. ఒకేడు పంటా, ఒకేడు మంటా! ఒకేడు పండగా, తరువాతేడు దండగా! పండిన ఏడు ధరా ఉండదు. సేజ్యం పూజ్యం అయిపోయింది! రైతు బతుకు గాల్లో దీపం అయింది. చితికిపోయాడు శంకరయ్య. అప్పుల పాలయ్యాడు.

రైతుల పరిస్థితీ, తన స్థితినీ వివరించి చెప్పాడు శంకరయ్య.

'గ్లోబలైజేషన్ పుణ్యమా అని.. దేశమంతా వ్యవసాయరంగం సంక్షోభ పరిస్థితిలోనే ఉంది. వాళ్లని గట్టెక్కించడానికి మా వంతు ప్రయత్నాలు చేస్తున్నాం` అన్నాడు శ్యామ్.

'మీ సంస్థ ఏం చేస్తుంది? పని ఏమిటి?`

'మన రాష్ట్రంలో మార్క్ ఫెడ్ వుంది కదా? అలాగే దేశం మొత్తం మీద నాఫెడ్ వుంటుంది. అన్ని రాష్ట్రాల్లో రైతుల నుంచి పంటల కొనుగోలు చేయడం, నిల్వ చేయడం పంపిణీ చేయడం, రైతులకి ప్రభుత్వ పథకాల అమలు చేయడంలాంటివి చేస్తుంది.`

'దేశం మొత్తం మీద కొనుగోలు అంటే, అమ్మో.. చాలా పెద్ద పనే!` అన్నాడు శంకరయ్య. 'ఎంత పెద్ద పని అయినా ఒకరు చేసేది కాదు కదా? మా సంస్థలో కొన్ని వేల మంది ఉంటారు`

'అంత పెద్ద సంస్థ కదా! మా పిల్లలకి ఏదైనా చిన్నపాటి ఉద్యోగం చూసి పెట్టగలవా?` సందేహిస్తూనే అడిగాడు శంకరయ్య.

'నువ్వు నన్ను అడగాలా శంకర్? ఆదేశించాలి కానీ అడక్కూడదు. నువ్వు నాకు చెప్పిన క్షణమే వాళ్లకి ఉద్యోగాలు కల్పించాలని నిశ్చయించుకున్నా. నువ్వు మీ పిల్లల విషయంలో నిశ్చింతగా ఉండు. పాపా నీ పేరు ఏమిటి?`

'జాహ్నవి సార్!`

'జాహ్నవీ.. మీ అన్నయ్య ఎక్కడా?`

'హైదరాబాదులో ఉన్నాడండీ! రెండేళ్ల నుంచీ ఏవో కోర్సులు నేర్చుకుంటూ జాబ్ సెర్చింగ్ లో ఉన్నాడు సార్!`

'నీదీ, మీ అన్నయ్యదీ రెజ్యూమ్ నా మెయిల్ ఐడికి పంపించండి. మీ క్వాలిఫికేషన్స్ కి తగిన ఉద్యోగాలు వచ్చే ఏర్పాటు చేస్తా. మొదట్లో అవి టెంపరరీ బేస్డ్ గా ఉంటాయి. ఓపిగ్గా, బాధ్యతగా పనిచేస్తే పర్మినెంట్ అవుతాయి.`

'నీ మేలు మా జీవితంలో మరిచిపోలేం శ్యామ్ గారూ..`

'నువ్వు నన్ను మళ్ళీ పరాయివాడిని చేసి మాట్లాడుతున్నావ్! సరే వస్తాను. మిగతావాళ్ళని కూడా కలుస్తాను..` అని తన మెయిల్ ఐడి ఇచ్చి, వెళ్ళిపోయాడు శ్యామ్. శంకరయ్యా, ఆయన భార్యా, కూతురు జాహ్నవీ మనసులు ఆనందంతో నిండిపోయాయి.

'ఎంత మంచివ్యక్తి నాన్నా ఆయన! గొప్పస్థాయిలో ఉన్నా ఎంత గౌరవంగా, పద్ధతిగా మాట్లాడారు` అంది జాహ్నవి.

'అవునమ్మా! అంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉన్నాడు. అన్నీ ఉన్నా విస్తరి అణిగి మణిగి ఉంటుందనీ, ఏమీ లేనిదే ఎగిరెగిరి పడుతుందనీ అంటారు కదా! అలా ఉందమ్మా ఇప్పుడు నా పరిస్థితి. తలచుకుంటే ఇప్పుడు నా మీద నాకే కోపం కలుగుతోంది!`

'ఏమైంది నాన్నా?`

'శ్యామ్, నేనూ ఏడో తరగతి వరకూ మన ఊరి హైస్కూల్లో కలిసి చదువుకున్నాం. శ్యామ్ చదువులో చాలా మెరిట్ గా ఉండేవాడు. ఏడో తరగతిలోనే పదో తరగతి లెక్కలు అవలీలగా చేసేవాడు. శ్యామ్ తెలివికి టీచర్లు సైతం ఆశ్చర్యపోయేవాళ్ళు. ''ఒరేయ్, నువ్వు శ్రీనివాస రామానుజన్ అంతటివాడివి అవుతావురా`` అనే వాళ్ళు. అంత తెలివి ఎలా వచ్చిందో మరి? శ్యామ్ అమ్మానాన్నా, తాతావాళ్ళు ఎప్పుడూ మా పనిలోనే ఉండేవాళ్ళు. శ్యామ్ నాన్న అంత పద్ధతిగలవాడు కాదు. మా పనికి వచ్చేవాడు కదా! బాగా తాగుబోతు. మా నాన్న ఆయన్ని తిట్టేవాడు!`

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

'క్లాసులో నువ్వు ఎన్నో ర్యాంక్ లో ఉండేవాడివి నాన్నా?`

'నేను మూడూ, నాలుగూ స్థానాల్లో ఉండేవాడిని. శ్యామ్ ఎప్పుడూ క్లాస్ ఫస్టే. రమణ అనేవాడు నాకు మంచి దోస్త్. వాడిది పక్క ఊరు పాలెం. ఇప్పుడు ఏదో వూళ్ళో స్కూల్ టీచర్ గా చేస్తున్నాడు. వాడు సెకండ్ ర్యాంక్ వచ్చేవాడు. వాడికి శ్యామ్ అంటే బాగా ద్వేషం. మా పనోడి కొడుకు క్లాసులో నన్ను మించి చదవడం అంటే నాకు కొద్దిగా కసిగా ఉండేది. శ్యామ్ ని తన్నమని రమణగాడు నన్ను ఎక్కేసేవాడు. వాడి మాటలు విని, రెండు, మూడుసార్లు శ్యామ్ ని కదిలించుకుని మరీ కొట్టాను. ఉత్తపుణ్యానికే కొట్టాను!`

'అయ్యో.. ఎంత తప్పు నాన్నా?`

'అవును, చాలా తప్పు. మాకు ఆస్తి ఉందని అహంకారం! తెలిసీ తెలియని వయసు. తలచుకుంటే ఇప్పుడు నాకు బాధగా ఉంది. శ్యామ్ ఏడో క్లాసులో జిల్లా ఫస్ట్ వచ్చాడు. ఎనిమిదికి గవర్నమెంట్ రెసిడెన్షియల్ స్కూల్లో సీట్ వస్తే వెళ్ళిపోయాడు. శ్యామ్ అమ్మానాన్నకి ఎయిడ్స్. ఎలా వచ్చిందో మరి? శ్యామ్ తొమ్మిదో తరగతిలో ఉన్నప్పుడు అతని అమ్మానాన్న ఇద్దరూ ఏడెనిమిది నెలల తేడాతో చనిపోయారు. ఇక తాత పెంపకంలోనే పెరిగాడు. శ్యామ్ కి ఇంటర్ నుంచీ మా నాన్న టౌన్ కి తీసుకుపోయి బట్టలు కొనిపెట్టేవాడు డిగ్రీ వరకూ. శ్యామ్ ఛార్జీలకీ, చిల్లర ఖర్చులకీ అప్పుడప్పుడు శ్యామ్ తాతయ్య వచ్చి అడిగితే, కొద్దిగా డబ్బులు ఇచ్చేవాడు. పెద్దమొత్తం కాదు రెండు మూడొందల లోపు. టెన్త్ లో శ్యామ్ కి రాష్ట్ర స్థాయిలో నాలుగో ర్యాంక్ వచ్చింది. ఇంటర్మీడియట్ నాగార్జునసాగర్ రెసిడెన్షియల్ కాలేజీలో చదివాడు. శ్యామ్ డిగ్రీలో ఉన్నప్పుడు వాళ్ళ తాత కూడా కాలం చేసాడు.`

'పాపం! చాలా కష్టాలుపడ్డారు నాన్నా!`

'సాధారణ కష్టాలు కాదు. ఆ స్థితిలో ఎవరైనా కుంగిపోతారు. నిరాశపడతారు. ఆస్తిపాస్తులు లేవు.. నిరుపేదలు.. వెనుకబడిన కులం.. నా అనేవాళ్ళు లేరు. పెదనాన్నా, బాబాయిలు ఉన్నారు. కానీ వాళ్ల పరిస్థితీ అంతంత మాత్రమే. వాళ్ళు ఏం సాయపడగలరు? బంతిని నేలకేసి ఎంత బలంగా కొడితే అంత వేగంగా వస్తుందో, కష్టాల్లో నుంచి ఆయన అంతే వేగంగా రాటుదేలిపోయాడు. చదువే లోకం! మరో ధ్యాస లేదు. అందులో లీనమైపోయాడు. సాగర్ లో ఇంటర్ తర్వాత రెసిడెన్షియల్ డిగ్రీ కాలేజీలో మ్యాథ్స్ లో డిగ్రీ చేశాడు. తర్వాత సెంట్రల్ యూనివర్సిటీలో పీజీ చేసాడు. అక్కడే పీహెచ్ డీ చేస్తూ సివిల్స్ రాసి, ఐఏఎస్ కి ఎంపికై, గుజరాత్ క్యాడర్ కి వెళ్ళాడు. ఐఏఎస్ లోనే క్లాస్మేట్ ని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. రిజిస్టర్ ఆఫీసులో ఇద్దరు దండలు మార్చుకొని, ఒకటయ్యారు. అప్పుడు పేపర్లలోనూ నిరాడంబరంగా ఐఏఎస్ ల వివాహం అని వచ్చింది. పెళ్ళికి వచ్చిన స్నేహితులకి స్నాక్స్, టీ లే విందు అని కూడా ఆ వార్తలో వుంది! భార్యాభర్తా ఇద్దరూ గుజరాత్ లో కలెక్టర్లుగా చేశారు. ఇప్పుడు కేంద్రసంస్థకి ఎండి అయ్యాడు!`

'అబ్బ! ఎంత గొప్పవాడు! మీరూ ఉన్నారు ఎందుకూ, డిగ్రీ అయిన తర్వాత చక్కగా బిఇడీ చేసినా టీచర్ పోస్ట్ వచ్చేది. వ్యవసాయంలో పడ్డారు. దీనిలో ముందుకీ పోలేం, వెనక్కీపోలేం!` అంది భార్య.

'నా విషయం అయిపోయిందిగా! గతాన్ని తలచుకుని ఏం ప్రయోజనం? శ్యామ్ గురించి పిల్లలకి ఎన్నోసార్లు చెప్పాను. జాహ్నవీ మీకు చిన్నప్పటి నుంచీ చెప్పేది ఒకటేనమ్మా! ప్రస్తుత సమాజంలో చదువుని మించిన సంపద లేదు. నిజమైన ఆస్తి చదువే! దానికి తిరుగులేదు. చదివితే శ్యామ్ జీవితం ఒక మంచి గ్రంథమే అవుతుంది. అది ఉత్తమ గ్రంథం! ఆ గ్రంథం నుంచి ఎవరైనా స్ఫూర్తి పొందొచ్చు, ప్రేరణ పొందొచ్చు! అంత గొప్పవ్యక్తీ, వ్యక్తిత్వమూ ఆయనది!` చెప్పాడు శంకరయ్య. శ్యామ్ చెప్పినట్లుగానే రెండు నెలలకి జాహ్నవికి మార్క్ ఫెడ్ లోనూ, శంకరయ్య కొడుక్కి నాఫెడ్ లోనూ తాత్కాలిక ప్రాతిపదికన ఉద్యోగాలు వచ్చాయి.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

సింగిల్ పేజి కథ

# బడిబాట



ఆ ఊరికి దూరంగా ఉంది ఓ పూరిగుడిసె. ప్రశాంత వాతావరణం, సుందర దృశ్యాలతో ఇట్టే ఆకట్టుకుంటోంది ఆ పూరిపాక. మోడువారిన చెట్టు, ఒంటరి కాకి, కోడిపెట్ట, దాని పిల్లలు వాటికి కాపలాగా కుక్క. ఆ తల్లీ కొడుకులను పలకరించే మూగజీవులు స్నేహితులు.

ఊరికి రెండు కిలోమీటర్ల దూరంలో అదే గుడిసెలో కొత్త పెళ్లికూతురుగా అడుగుపెట్టిన సీత ఓ తల్లిగా మధుర అనుభవాలు చవిచూసింది. కానీ నేడు వితంతువుగా మిగిలింది. దూరంగా ఓ పావు ఎకరం పొలంలో జొన్నలు మొదలైన చిరుధాన్యాలు భర్త రాము పండించేవాడు. ఆ ఊరి మోతుబరి పెద్దయ్య ఇంట్లో అనాథగా పెరిగిన రాము ఐదవ క్లాసు దాకా చదివాడు, ఆయన దయవల్ల ఇంటివాడైనాడు. సీత కూడా మోతుబరికి తెలిసిన కుటుంబంలోని పిల్ల. తండ్రిని బాల్యంలోనే కోల్పోయిన ఆమె తన తల్లితో ఆ ఇంట్లో చిన్నాచితక పనులు చేస్తూ పెరిగి పెద్దయింది. అయితే అక్కడ గొడ్డు చాకిరి చేసినా కడుపునిండా తిండి, ఒంటినిండా బట్టతో సుఖంగానే గడిచింది.

రాముతో కూతురు పెళ్లి జరిగిన తర్వాత, కరోనా టైంలో సీత తల్లి కన్నుమూసింది. రాము భార్యను పువ్వుల్లో పెట్టి చూసుకుంటున్నాడు. పెద్దయ్య, ఆయన భార్య ఉన్నన్నాళ్లు సీతా రామం సంసారం సజావుగా సాగింది. ఆ వృద్ధులు ఒక్క నెల వ్యవధిలో శాశ్వత నిద్రలోకి జారుకోవటంతో అనాథల్లా విలవిలలాడారు సీత, రామం.

మోతుబరి పెద్దయ్య ఒక్క గానొక్క కొడుకు యు.ఎస్. వాసి. ఆ దేశపు పిల్లను పెళ్లాడాడు. తల్లిదండ్రుల కోసం ఓ ఆర్నెల్లుండి వారికి కావాల్సినవి చూసి, అతను కర్మకాండలు పూర్తికాగానే ఇల్లు, పొలం అమ్మేశాడు. రామంకి ఓపావు ఎకరం పొలం, ఆ పూరిగుడిసె ఇచ్చాడు. అప్పటిదాకా పెద్దయ్య ఇంట్లో అవుట్ హౌస్‌లో కాపురం ఉన్న సీతారామం ఆ పూరింటిలోకి మారారు.

ఆ మర్నాడు సీతకి కొన్ని చీరలు, తల్లి రెండు పేటల గొలుసు, రెండు జతల గాజులు ఇచ్చాడు, శాశ్వతంగా ఆ ఊరు దేశాన్ని విడిచిపోతున్న ఆ దొరబాబు. అంతా చిన్నబాబును దొరబాబు అని పిల్చేవారు. ఇప్పుడు దేవుడు సార్ అని పిలుస్తున్నారు.

.........

ఒకరోజు రాము భార్యని పరిశీలనగా చూస్తూ సీత "ఏంటి బాగా బక్కచిక్కిపోతున్నావు? వంట్లో బాగాలేదా?" అని అడిగాడు.

"అవును" అంది. భార్యని డాక్టర్‌కి చూపించాడు.

"నీ భార్యకు మూడో నెల" చెప్పింది డాక్టరమ్మ. డాక్టరమ్మ మాటలకు ఏనుగెక్కినంత సంబరపడ్డాడు, రాము. నెలలు నిండిన తరువాత సీతకు కొడుకు పుట్టాడు. పసివాడిని చూస్తూనే ఉబ్బితబ్బిబ్బైనారు. పసివాడు బంతిపువ్వు ముద్దులమూట.

సీత గుండెలో ఏదో చెప్పలేని బాధ, అలజడి. ఆ రోజు కుంభవృష్టి పిడుగుపాటుకి చెట్టుకింద నిలబడ్డ రాము కుప్పకూలాడు.

..............

"అమ్మా! నాకు బడికి టైం అయింది. కొడుకు రవి మాటలకు తేరుకున్న సీత పాత జ్ఞాపకాల నుంచి ఈ లోకంలోకి అడుగుపెట్టింది. "పాలు తాగి, జొన్న రొట్టె తిను బాబూ!"

"బాక్స్‌లో పెట్టు. పాలు తాగుతా. ఒక కిలోమీటర్ నడవాలి".

"చిన్నా! ప్రభుత్వ బడి కాబట్టి పుస్తకాలు డ్రెస్ ఫ్రీ. బాగా చదివి గొప్పవాడివి కావాలి" అంది.

నాలుగిళ్లలో పాచిపని చేసి వారిచ్చే కూరలు, ఫలహారంతో ఇల్లు గడుస్తోంది. కాయగూరలు అమ్ముతోంది. చిన్న దొర ఇచ్చిన బంగారు వస్తువులమ్మి డబ్బు బ్యాంకులో వేసింది. "బాగా చదువుకోవాలిరా కన్నా!" రోజుకోసారి రాత్రి చెప్తూ వాడిని నిద్ర పుచ్చుతుంది.

"అమ్మా! గురుకుల పాఠశాలలో 5వ క్లాస్‌లో చేరుతాను. అక్కడ హాస్టల్ సహా అన్నీ ఫ్రీ! ఇప్పుడు అన్నిట్లో నేనే ఫస్ట్! మా తెలుగు మాష్టారు రోజూ ఆ చిన్న కుంట దగ్గర కూర్చుని నాకు, ఇంకొందరు పిల్లలకు పాటలు పద్యాలు చెప్తున్నారు. రేడియో స్టేషన్‌కి కూడా తీసుకువెళ్తారట. మా చేత సొంతంగా చిన్న కథలు రాయిస్తారు. తెలుగు మీడియంలోనే చదువుతాను. మన ఊరు మనదేశం గొప్పతనం చెప్తారు రోజూ. బాగా చదువుకుని మన దేశంలోనే ఉండి దేశాభివృద్ధికై కృషి చేయాలనీ, "జననీ జన్మ భూమిశ్చ స్వర్గాదపి గరీయసీ" అని రోజూ చెప్తారు. నేను పెద్దయినాక ఉద్యోగం చేసి నిన్ను చూసుకుంటాను అమ్మా!"

"కొడుకు మాటలకు సీత కళ్ళల్లో కోటి కాంతులు! బడిబాట తమ జీవితాలకి పూలబాట కావాలని ఆ తల్లి ఆశ! ఆ చిన్నవాడి ఆశయం కూడా!

– అచ్యుతుని రాజ్యశ్రీ

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# పార్కు

కథ

కొరికాన ఆనంద్
9618425970



నేషనల్ హైవేకు ఆనుకుని ఉన్న ఒక ఇండివిద్యువల్ హౌస్ మాది. ఎప్పుడో మా చిన్నప్పుడు మా తాతగారి ద్వారా సంక్రమించిన ఆ ఇంట్లో నేనూ, మా ఆవిడ తప్ప ఇంకెవరూ ఉండటం లేదు. ప్రయోజకులైన పిల్లలు ఉద్యోగాల నిమిత్తం విదేశాల్లో ఉన్నారు. వాళ్ళు వెళ్లిపోయాక ఇక్కడ ఒంటరిగా ఉంటున్నాము. మేము బాల్కానీలో కూర్చుని, హైవేలో వెళుతున్న బస్సులను, లారీలను, ఇతర వాహనాలను చూడడమే మా పని అయిపోయింది.

ఇలా కొన్నాళ్లు ఉండగా ఒకసారి మున్సిపాలిటీ వాళ్లు హైవేకానుకుని ఉన్న రోడ్డు పక్కన భూమి ఆక్రమణలకు గురవుతున్నాయి అని గ్రీన్ బెల్ట్ పేరున వాళ్లే చెట్లు నాటారు. ఆ కొంత భూమిని నిరుపేదలు ఎక్కడ ఆక్రమించేస్తారో అన్న భయంతో సదరు గవర్నమెంట్ వాళ్లు ఆ విధంగా భూమిని కాపాడేసారు.

చిత్రం ఏమిటంటే ఆ గ్రీన్ బెల్ట్ ఉన్న వరుసల్లోనే పెద్ద, పెద్ద విదేశీ కంపెనీలకు భూములను ప్రభుత్వం ధారాదత్తం చేసేస్తుండడం ఒక విచిత్రం. కానీ అడిగేవారెవరు? అడిగితే రాజకీయ కర్కశులు, పోలీసుల ద్వారా పేదలను ఎలా భక్షించాలో చెబుతుంటారు కదా!

మున్సిపల్ వాళ్లు రోడ్డు పక్కన నిబంధనల ప్రకారం, గ్రీన్ బెల్ట్ కోసం కొంత భూమి మున్సిపల్ వాళ్ళు తీసుకున్నా, మా ఇంటిముందు మొక్కలు, తోటకూ ఎలాంటి ముప్పూరాలేదు. వారికీ మాకూ మధ్య ఐరన్ పెన్సింగ్ మున్సిపాలిటీ వారే వేసేసుకున్నారు.

అయితే ఈ మధ్య గ్రామంలో కొంతమంది వ్యక్తులు ఐక్యంగా, గ్రీన్ బెల్ట్ లో కొంత భాగాన్ని వాకింగ్ పార్క్ గా డెవలప్ చేయమని ప్రభుత్వానికి విన్నవించుకున్నారు.

రకరకాల రాజకీయ పైరవీలతో, సిఫార్సులతో మొత్తానికి గ్రీన్ బెల్ట్ లో కొంత భాగం వాకింగ్ పార్కుగా రూపొందడానికి మార్గం ఏర్పడింది. నాకు ఇప్పుడు కొంత హాయి అనిపించింది. మా ఇంట్లో ఒక్కడినే ఒంటరిగా కూర్చునే నాకు, పార్కు వచ్చాక, వాకింగ్ కు వచ్చే వ్యక్తులతో, వృద్ధులతో పరిచయాలు ఏర్పడ్డాయి. నా ఒంటరితనం కాస్త దూరమైనట్టు అనిపించింది.

అంటే.. నగరాల్లో మనస్ఫూర్తిగా మాట్లాడడానికి మనుషులే కరువవుతుంటారు. ఆ పార్కు వల్ల ప్రస్తుతానికి నాకు ఆ ఇబ్బంది లేదు. పార్క్ లో పిల్లలు, వృద్ధులు, వాకింగ్ ట్రాక్ లలో నడిచే జనాలతో చాలా సంబరంగా ఉంటోంది. చుట్టూ పూలతో నిండుగా మొక్కలు. మృదువుగా వీచే చల్లని గాలి. ఆహ్లాదకరమైన వాతావరణం. చూడటానికి చాలా కన్నుల పండుగగా కూడా ఉంది. మనసు చాలా ప్రశాంతంగా ఉంటుంది.

నేను మా ఇంటితోటలో మొక్కల పెంపకాన్ని కూడా ఇన్నాళ్లంతగా పట్టించుకోకుండా.. ఉదయం, సాయంత్రం వాకింగ్ పార్క్ లో గడపడానికే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నాను. కొంచెం ఎండ తగ్గాకే కదా మొక్కలకు నీరు పోసేది. నేనిప్పుడు ఆ సమయంలోనే పార్కుకు వచ్చే కొత్త మిత్రులతో కాలక్షేపం చేస్తున్నాను.

అయితే పార్కుకు వచ్చే జనాలు పెరుగుతుంటే వచ్చిన జనాలను కంట్రోల్లో పెట్టడానికి రవికుమార్ అనే వ్యక్తి ఒక వాకర్స్ అసోసియేషన్ ను ప్రారంభించాడు. పార్కును పరిశుభ్రంగా నిర్వహించడానికి కొంత డబ్బు అవసరం అంటూ.. వచ్చినవాళ్ళ దగ్గర నెలకు ఇంత అనే అమౌంటు వసూలు చేసి, ఏవేవో నిబంధనలు పెట్టేసాడు.

పార్కులో మొక్కలకి నీళ్లు పోయడానికి ఉదయమూ, సాయంత్రమూ తప్ప పార్కులో బిక్షగాళ్ళలాంటి వాళ్ళు అక్కడ చేరకుండా ఉండడానికి, కాపలా మనిషిని ఉంచారు. పార్కులోకి డబ్బులు కట్టినవారే వచ్చేలా చేయడానికి అక్కడ ఒక వాచ్ మెన్ ను నియమించాడు. వాకింగ్ కు వచ్చినవాళ్లు చాలామంది డబ్బున్నవాళ్ళే కనుక కాదనకుండా డబ్బులు ఇస్తున్నారు. ఇప్పుడు ఆ పార్కు ధనవంతుల దర్పంతో ధగధగలాడిపోతోంది. కానీ, గవర్నమెంట్ పార్కులో డబ్బు కట్టించుకోవడం ఏమిటి? నిరుపేదల పిల్లలను రానివ్వకుండా ఆ నిబంధనలు ఏమిటని ఎవరూ అడగలేదు.

కొద్దిరోజుల తర్వాత పిల్లల కోసం రకరకాల ప్లే గ్రౌండ్ ఎక్విప్ మెంట్స్ పార్క్ లోకి తీసుకొచ్చారు. గొలుసు ఊయల, ఊగుడు బల్ల, జారుడు బల్ల, ఇంకా పిల్లలు వయసు తగ్గట్టుగా వాళ్ళు జంప్ చేయడానికి రెండు మూడు హార్డిల్స్ అక్కడ ఏర్పాటు చేశారు. రాత్రివేళలో లైటింగ్ ఏర్పాటు చేశారు. పిల్లల కేరింతలు, అరుపులు, ఆటలు, నవ్వులతో వాకింగ్ పార్కు మరింత ఆనందంగా ఉంటోంది.

అదే సమయంలో పార్కులో ఆడుతున్న తమ ఈడు పిల్లలను చూసి, నిరుపేదల పిల్లలు పార్కు బయట నిలబడి, ముళ్ళ పెన్సింగ్ కు చేతులు ఆనించి ఆశ్చర్యంగా, ధీనంగా చూస్తుంటారు. వారిని వాచ్మెన్ లోపలికి రానివ్వడు. ఒకవేళ వచ్చినా లోపల ఉన్న ధనవంతుల పిల్లల్ని, నిరుపేద పిల్లలతో కలసి ఆడనివ్వరు.

పార్కు చుట్టూరా పూలు.. పిల్లల చుట్టూరా స్వార్థపరులు కడుతున్న ఎల్లలు... వారి చుట్టూరా నల్లటి చీకటి.. రేపటి వెలుగు కోసం ఎదురుచూస్తోంది. ఇవన్నీ చూస్తూ ఈ సమాజం ఎప్పటికి మారుతుంది? అనుకొని రోజులు గడుపుతున్న సమయంలో.. మా అమ్మాయిల దగ్గర నుంచి ఫోన్ మీద ఫోన్ లు వస్తున్నాయి. మా ఆలుమగలు ఇద్దరినీ.. తీర్థయాత్రలకై ఇంటి నుండి బయలుదేరే ఒక టూరిస్ట్ బృందంతో కేదారనాథ్, అక్కడ దగ్గర్లో ఉన్న రకరకాల ఆలయాల సందర్శనకు టికెట్లు బుక్ చేస్తున్నామని మెసేజ్ పంపారు.

కేదార్నాథ్ కి వెళ్లాలంటే.. మా ఇద్దరికీ కష్టమే.. నడవడమే కష్టం అనుకునే మాకు ఆ యాత్ర చేయడం గగనాన్ని తాకడమే.

"మనకు తెలిసినవారే నాన్నగారూ! మిమ్మల్ని జాగ్రత్తగా తీసుకెళ్లి తిప్పి, తీసుకొస్తాం అంటున్నారు. మీరేం ఆలోచించకండి. డబ్బులు ఎంతైనా మేము పెట్టుకుంటాం. చెల్లీ, నేనూ మీకు చెరో రెండు లక్షలు ఇస్తాం. హ్యాపీగా తిరిగి వచ్చేయండి.." అంటూ అక్కాచెల్లెళ్లు ఇద్దరూ ఈ మధ్యన ఫోనుల్లో చెప్తూనే ఉన్నారు.

ఇప్పటికే చాలా తీర్థయాత్రలు పిల్లల సహకారంతోనే చేశాము. ప్రతి సంవత్సరం ఏదో ఒక తీర్థయాత్రకు మమ్మల్ని పంపిస్తూనే ఉంటారు. వారికి అదో తృప్తి. అయితే ఇంకా రెండు మూడు నెలలు తర్వాత విషయం కదా

(మిగతా 6వ పేజీ)

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

(4వ పేజీ తరువాయి)

## పార్కు

అని మేము మిన్నకుండిపోయాము.

ఒక పక్క మా ఆవిడ ఆ ప్రయాణానికి ఏర్పాట్లలో ఉంది. నేను మాత్రం పార్కులో మిత్రులతో గడుపుతున్నాను. సాయంత్రం సమయంలో ఓ మూల కూర్చుని, పసిపిల్లల కేరింతల్ని, నవ్వుల్ని, వారి మారాములను గమనించడం నాకు హాబీ అయిపోయింది. మూడు రోజుల నుంచి ఒకామె తన అయిదారేళ్ళ పిల్లాడితో ఆ పార్కులోకి వస్తుంది. బాగా గమనిస్తే ఆమెకు ఒక కాలు పోలియోలా ఉంది. అయినా వాకింగ్ చేస్తుంది. కానీ, ఆ పిల్లాడు పార్కులో మిగతా పిల్లలు ఆడినట్టుగా తాను ఆడాలని ఆరాటపడుతున్నాడు. వాళ్ల అమ్మని అటువైపు తీసుకెళ్లమని అల్లరి కూడా పెడుతున్నాడు.

కానీ, అక్కడ పిల్లల తాకిడి ఎక్కువవ్వడం, ఈ పిల్లాడికి తన కోరిక నెరవేరే అవకాశం లేకపోయింది. వాచ్మెన్ కూడా... అక్కడ ఆ టూల్స్ చందాదారులకు తప్ప మిగతావారు ఉపయోగించకూడదని చెబుతున్నాడు. నిరాశ చెందుతున్న పిల్లాడి మొహం మబ్బు పట్టిన చందమామలా ఉంది.

కొడుకు కోర్కె తీర్చలేక పోతున్న ఆ తల్లి కళ్ళు.. దైన్యాన్ని మోస్తున్న దేశ దారిద్ర్యంలా ఉంది.

అలా మూడురోజుల నుంచి చూస్తున్న ఆ తల్లి, ఆ రోజు ఏమనుకుందో ఏమో పార్క్ లో ఒకవైపు పచ్చగడ్డి ఉన్న నేలపై వంగింది. కొడుకు ఎగరగలిగినంత ఎత్తుకు తన నడుమును వాల్చింది. తన పైనుండి గెంతమంటొన్నది. వాడు కూడా అలానే చేస్తున్నాడు. అది చూస్తున్నవారికి అందరికీ ఆశ్చర్యంగానే ఉంది. ఆ పిల్లాడు వాళ్ళ అమ్మ నడుమును ఎగిరి దాటుతూ పకపకా నవ్వుతున్నాడు. అప్పుడప్పుడు నడుముకి పిల్లోడు కాళ్ళు తగిలి నొప్పి అనిపించినా వాడి సంతోషానికి ఆ తల్లి మురిసిపోతోంది.

అమ్మ ప్రేమ అక్కడ రూపు దాల్చితే.. దారిద్ర్యాన్ని పోషించే నికృష్ట పాలన అక్కడ నిక్కి చూస్తోంది.

● ● ●

"అమ్మాయ్.. నీవు పిల్లాడిని ఆడించడం కోసం ఇలా నడుము వంచి ఉండడం నీకు ఇబ్బంది అనిపించడం లేదా? ... అంతమంది అలా చూస్తుంటే బాగోదు కదా!..." అన్నాను ఆ అమ్మాయి దగ్గరికి వెళ్లి. "మరి ఏం చేసేది బాబాయ్? పేదవాళ్ల ఇంట్లో పుట్టిన పసిబిడ్డల కలలు ఛిద్రమైపోకుండా ఉండాలంటే.. ఇలాంటి కష్టాలు ఎన్నో పడాలిగా" అందామె చిరునవ్వుతో.

ఆ సమాధానం ఈ దేశ అసమానతలపై ఊహించని చెంపదెబ్బలా నాకు తగిలింది.



"పేదల పిల్లలందరూ ఇక్కడ ఆడుకోవాలని ఆశపడి వస్తున్నారు. వీలు కాక ఏడుస్తుంటే, వాళ్ల తల్లిదండ్రులచే కర్కశంగా దెబ్బలు తింటున్నవారే.. వారిని ఎవరు ఓదారుస్తారు? వారి చిన్ని కోరికలు ఎలా తీరుతాయి? వాడిని కొట్టలేకే...నేను ఇలా.. " అంటూ ఆమె తన చున్నీని నడుముకు చుట్టుకొని, మళ్లీ వంగడానికి సమాయత్తం అవుతోంది.

అప్పుడు నాకు ఓ ఆలోచన కలిగింది. ఈ పార్కు పక్కనే మాకు కొంత భూమి ఉంది. కాలక్షేపానికి తీర్థయాత్రల పేరిట డబ్బులు ఖర్చు చేయిస్తున్న పిల్లలూ ఉన్నారు. వారు ఇస్తున్న డబ్బు కూడా ఉంది. నా పిల్లల్ని ఒప్పించి కనీసం కొన్నైనా ప్లే గ్రౌండ్ ఎక్విప్మెంట్స్ ఆ స్థలంలో పెట్టించి, "ఇక్కడ అందరూ ఆడుకోవచ్చు" అని బోర్డు పెట్టించాలి అనుకున్నాను. వెంటనే ఫోన్ అందుకున్నాను. పేదరికం నుండి ఎదిగిన నా కూతుర్లు అందుకు కాదనరు అనే నమ్మకం కూడా నాకు వుంది.

**కథాకళి** FEED ME A STORY

# సదారోగి

● మల్లాది వెంకట కృష్ణమూర్తి

అగ్నిలింగం నిక్ నేమ్ సదారోగి. ఆరోగ్య దృష్ట్యా ఆయన జాతకం మంచిది కాదు.

చిన్నప్పుడే మలేరియా, టైఫాయిడ్, గవద బిళ్ళలు, కోరింత దగ్గు, ఇన్‌ఫ్లుయెంజా, చికెన్ పాక్స్, సన్నిపాత రోగం మొదలైన వాటి బారిన పడ్డాడు. పదహారో ఏటే అతనికి డయాబెటిస్ వచ్చింది. పెళ్ళయ్యాక చాలామందికి వచ్చే బ్లడ్ ప్రెషర్ కూడా పదిహేడో ఏటే వచ్చింది. బ్రహ్మచారిగా ఉండగా ఓరోజు స్టవ్ మీద వేడి గిన్నెలోని మరిగే చారుని పొట్ట మీద పోసుకున్నాడు. పొట్ట మీద కాబట్టి సరిపోయింది. అది మిగిల్చిన మచ్చ బయటికి కనిపించదు. అగ్నిలింగం తన రోగాల మీద తనే జోక్స్ వేసుకుంటాడు.

''ఉదయం నేను నా మందులన్నీ వేసుకున్నాక కడుపు నిండుతుంది. దాంతో మా ఆవిడ చేసే ఉప్మాని మాత్రలా మింగుతాను.''

''రోగాల పేర్లు జర్మన్, గ్రీక్, లేటిన్ మొదలైన భాషల్లోంచి పుట్టాయి. ఏ రోగం పేరు ఏ భాషలోంచి వచ్చిందో నాకు తెలుసు. నాకు వచ్చిన ప్రతి రోగం స్పెల్లింగ్ నాకు వచ్చు. డాక్టర్లు నాకు ఫోన్ చేసి రోగాల స్పెల్లింగ్స్, ఏ రోగానికి ఏ మందు వాడాలో అడిగి తెలుసుకుంటుంటారు. నా మందుల వల్ల నాలో జ్ఞాపకశక్తి అభివృద్ధి చెందింది. ఏ సమయంలో ఏ మందు వేసుకోవాలో నాకు జ్ఞాపకమే.''

అగ్నిలింగం పంతొమ్మిదో ఏట ఫుట్‌బాల్ ఆడుతూంటే కాలు విరిగింది. వయసులో ఉన్నాడు కాబట్టి అది అతుక్కుంది. ఇరవై ఒకటో ఏట వంశపారంపర్యంగా వచ్చిన మరో రోగం థైరాయిడ్. ముప్ఫైరెండో ఏట ఓ రొటీన్ కంటి పరీక్షలో గ్లకోమా కూడా బయటపడింది.

మోకాళ్ళ నొప్పివల్ల అతనికి జరిపిన వైద్య పరీక్షల్లో ఆర్థరైటిస్ బయటపడింది.


అగ్నిలింగం ముప్ఫైరెండో ఏట రైల్లో పైబెర్త్ ఎక్కుతూంటే కుడి మోకాల్లోని నరం పట్టేసి గిలగిల్లాడిపోయాడు. అతనికి సయాటికా ఉందని డాక్టర్ చికిత్స ఆరంభించాడు. కామన్ కోల్డ్ ఐతే సరేసరి. లెక్కలేనన్ని సార్లు.

''జలుబు వెయ్యి రోగాలు పెట్టు అని ఎవరన్నారో కాని, అది నిజం కాదని వెయ్యి రోగాలున్న నేను తెలుసుకున్నాను.'' చెప్పేవాడు.

ఫారింజైటిస్, డెంగ్యూ ఫీవర్, మైగ్రేన్, అనేక ఎలర్జీలకి సంబంధించిన రేషెస్, గ్యాస్ట్రైటిస్, ఏసియాకి చెందిన దాదాపు అన్ని రకాల విష జ్వరాలు అతన్ని పలకరించాయి.

అగ్నిలింగం క్షేమం కోరి తల్లిదండ్రులు బాల్యంలో అనేక యజ్ఞాలు చేశారు. మహా మృత్యుంజయ హోమం, ధన్వంతరి హోమం, అగ్నిహోత్రుడి హోమం, లక్ష గాయత్రి యజ్ఞం... అనేకసార్లు మృత్యుముఖం దాకా వెళ్ళి వచ్చినా, అగ్నిలింగం ఎన్నడూ 'నాకే ఇన్ని రోగాలు ఎందుకు రావాలి?' అనే నిరాశ మాటల్ని మాట్లాడలేదు. ఆశ్చర్యంగా అతను వ్యాధిగ్రస్తుడిగా కనపడడు. అతని మొహం ఆరోగ్యంగా కళకళలాడుతూ కనిపిస్తుంది.

ఆయనకి ఓరోజు భరించలేని గుండె నొప్పి వస్తే డాక్టర్ దగ్గరికి వెళ్ళారు. అది గ్యాస్ వల్లని తెలిసింది. ఆయనకి చేసిన వైద్య పరీక్షల్లో కిడ్నీలో స్టోన్స్ ఉన్నాయని తెలిసింది. వాటిని సర్జరీ చేసి తీయడానికి కుదరక మందు



రాసిచ్చారు.

''ఇది నాకు ఇంకో కలికితురాయి. వ్యాధులు నా అతిథులు. నిత్యం వాటికి ఆహారం, అంటే మందులు పెట్టి గౌరవిస్తుంటాను.'' ఓ పెళ్ళిలో సరదాగా చెప్పాడు.

ఆయన పక్షపాతం లేకుండా అన్ని రకాల మందుల్ని వాడుతూంటాడు. ఆయుర్వేదం, హోమియో, నేచురోపతి, యునాని, ఇంగ్లీష్ మందులు. ఆయనకి సరైన ఉద్యోగం మెడికల్ రెప్. కాని, బ్యాంక్‌లో చేరారు. నా అనుమానం, ఆయనకి జీతం కన్నా మెడికల్ ఇంబర్స్‌మెంట్‌కే ఎక్కువ చెల్లించి ఉంటుంది మా బ్యాంక్.

మా స్టాఫ్‌లో ఎవరైనా నలతగా ఉంటే ఆయన సలహాలు తీసుకోవటం కద్దు.

అలాంటి అగ్నిలింగం ఓ రోజు ఓ కస్టమర్‌తో మాట్లాడుతూండగా స్పృహతప్పి కింద పడబోయాడు. పక్కనే ఉన్న చీఫ్ కేషియర్, లేడీ క్లర్క్ ఆయన్ని పట్టుకున్నారు. వెంటనే అంబులెన్స్‌కి ఫోన్‌చేసి స్పృహలోలేని ఆయన్ని హాస్పిటల్‌కి చేర్చాం.

అగ్నిలింగం ఆ డాక్టర్‌కి పాత ఖాతానే. వెంటనే ఎమర్జెన్సీ సెక్షన్‌లోకి ఆయన్ని తీసుకెళ్ళారు. ఆయన హాస్పిటల్లోకి చేరేసరికి గుండె అతి బలహీనంగా కొట్టుకుంటోంది. హాస్పిటల్లో చేరిన నాలుగు గంటలకి డాక్టర్ విచారంగా చెప్పాడు.

''సారీ. గోల్డెన్ అవర్‌లో రాలేదు. అగ్నిలింగం ఈసారి హార్ట్ ఎటాక్ నించి సర్వైవ్ కాలేదు.''

ఆ రాత్రి ఏడుకి నా మొబైల్ మోగింది. అది అగ్నిలింగం మొబైల్ నించి! వాళ్ళ ఇంటి నించి ఏదో అవసరం వచ్చి నాకు ఫోన్ చేశారని అనుకుంటూ ఆన్సర్ చేశాను. అగ్నిలింగం కంఠం విని నేను నిర్ఘాంతపోయాను.

''అబ్బాయ్. నాకేం కాలేదని బేంక్‌లో అందరికీ చెప్పు.''

ఎవరైనా ఆయన కంఠాన్ని అనుకరించి నన్ను ఫూల్ చేస్తున్నారా అన్నది నాకు మొదట కలిగిన ఆలోచన.

''నేను చచ్చి బతికాను అబ్బాయ్.'' నవ్వుతూ చెప్పాడు.

''ఎలా సర్?'' ఆసక్తిగా అడిగాను.

''నా శవాన్ని, ఛ, నన్ను ఇంటికి తీసుకెళ్ళే అంబులెన్స్ రోడ్ మీద పెద్ద గుంటలో పడి లేచింది. దాంతో నా గుండె తిరిగి కొట్టుకోవడం ఆరంభమై నేను రివైవ్ అయ్యాను. వెంటనే మళ్ళీ నన్ను హాస్పిటల్‌లో చేర్చారు. నాకు యాంజియోప్లాస్టీ చేసి, రికవరీ అయ్యాక డిశ్చార్జ్ చేస్తామన్నారు.''

''అద్భుతం సర్! ఇది అద్భుతం!'' చెప్పాను.

''అసలు అద్భుతం ఏమిటంటే, ఆ దెబ్బతో నా కిడ్నీ స్టోన్స్ కూడా అట్టే బాధ పెట్టకుండా యూరిన్‌తో బయటికి వచ్చేశాయి.'' ఆయన ఆనందంగా చెప్పాడు.

కంకర తేలిన ఆ చెత్త రోడ్ కాంట్రాక్టర్ ఫొటోని అగ్నిలింగం భార్య వారి పూజా మందిరంలో ఉంచిందన్నది పోస్ట్ స్క్రిప్ట్.

**'ఫన్‌డే'లో ప్రచురితమయ్యే**
**ఈ శీర్షికలో మల్లాది కథలు రాయడమే కాదు, మిమ్మల్ని కూడా భాగస్వాములను చేస్తున్నారు. మీరైతే ఈ కథకు ఏ పేరు పెడతారో ఈ కింది మెయిల్‌కు పంపండి.**
**kathakalisakshi@gmail.com**


14 వ పేజీలో..
7-6-2026 సంచిక
'కథాకళి'కి పేరు సూచించిన
పాఠకుల పేర్లు

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

కథానిధి (14.6.26) సమీక్ష :

# సమకాలీన జీవిత చలనచిత్రం

భూక్యా గోపి నాయక్, 99891 59196




ఈ సమీక్ష వ్యాసాన్ని పీడీఎఫ్ కాకుండా, టెక్ట్స్ రూపంలో చదవదలచుకున్న వారు.. ఈ కింది వెబ్ సైట్ ను విజిట్ చేయండి.
www.adarsini.com (click చేయండి)

సాహిత్యం అనేది శూన్యం నుంచి పుట్టే స్వప్నం కాదు.. అది నేల మీది నెత్తురు నుంచి, మనిషి కన్నీటి నుంచి, నిరంతరం రగులుతున్న సామాజిక వైరుధ్యాల నుంచి పుట్టుకొచ్చే ఒక సజీవ సాక్ష్యం. ఒక జాతి ఆత్మను, ఆ జాతి అనుభవిస్తున్న వర్తమాన సంక్షోభాలను అర్థం చేసుకోవాలంటే, ఆ కాలపు కథలను మనం అత్యంత నిశితంగా అధ్యయనం చేయాలి. కథ, ముఖ్యంగా తెలుగు కథ, ఎప్పటికప్పుడు తనను తాను పునరావిష్కరించుకుంటూ, సామాన్యుడి అంతరంగంలోని సూక్ష్మమైన ప్రకంపనలను సైతం ఒడిసిపట్టుకుంటోంది. 14 జూన్ 2026 నాడు వివిధ దినపత్రికల ఆదివారం అనుబంధాల్లో ప్రచురితమైన కథలను 'కథానిధి' పేరుతో కె.ఎ. మునిసురేష్ పిళ్లె ఒక సంకలనంగా తీసుకురావడం ఒక చారిత్రక అవసరం. ఈ ముప్పెనిమిది పేజీల సంకలనంలోని తొమ్మిది కథలు, మరికొన్ని బాలల కథలు కేవలం కాలక్షేపానికి ఉద్దేశించినవి కావు.. ఇవి మన కాలపు దైన్యానికి, అహానికి, పితృస్వామ్య క్రౌర్యానికి, అరుదుగా వికసించే మానవీయతకు నిలువుటద్దాలు.

ఈ కథల లోపలి పొరల్లోకి ప్రయాణించినప్పుడు, సమాజం పైకి కనిపిస్తున్నంత ప్రశాంతంగా లేదన్న భయంకరమైన సత్యం బోధపడుతుంది. ఈ కథలన్నీ ఏకగ్రీవంగా ఒకే విషయాన్ని ఘోషిస్తున్నాయి.. మనిషి తనను తాను వెతుక్కుంటున్నాడు, కానీ ఆ ప్రయాణంలో బంధాలు, విలువలు, నైతికతలు కాలిపోతున్నాయి. ఈ కథానిధిలోని విభిన్న ఇతివృత్తాలను సామాజిక, తాత్విక, మరియు మానసిక కోణాల నుంచి విశ్లేషించుకుందాం.

## 1. ఆకలి, అస్తిత్వం మరియు శ్రమైక జీవన సౌందర్యం

ఆధునిక వ్యవస్థ మనిషిని ఎంతగా వంచించిందో చెప్పడానికి ఆర్థిక అసమానతలే ప్రధాన సూచికలు. పల్లెలు విచ్ఛిన్నమై, పట్టణాలు కాంక్రీట్ అడవులుగా మారుతున్న క్రమంలో, సగటు మనిషి మనుగడ ఒక నిరంతర యుద్ధంగా మారింది.

పాలగిరి విశ్వప్రసాద్ 'వేసారిన హృదయాలు' (ఆంధ్రజ్యోతి): ఈ కథ ఆధునిక నిరుద్యోగిత, పేదరికం సృష్టించిన అస్తిత్వ వేదనను అత్యంత ఆర్ద్రంగా చిత్రీకరించింది. కథానాయకుడు

సన్యాసిరావు ఉదయం లేవగానే కడుపులో దహించే ఆకలితో అతని రోజు ప్రారంభమవుతుంది. ఈ ఆకలి కేవలం భౌతికమైనది కాదు. అది వ్యవస్థ పట్ల ఉన్న ఒక తాత్విక నిరసన. యూట్యూబ్ లో ఆరోగ్య నిపుణులు చెప్పే 'ఒంటిపూట భోజనం శ్రేష్టం' అనే మాటలను తన ఆకలికి ముసుగుగా వేసుకోవాలనుకునే సన్యాసిరావు ఆలోచన, ఆధునిక మధ్యతరగతి మానవుడి దయనీయమైన మనస్తత్వానికి ప్రతీక. అతని జేబులో ఉన్న వంద రూపాయల నోటు, దానికి పడిన చిల్లులు... అచ్చంగా అతని బతుకు లాంటివే. ద్రవ్యోల్బణం, జీఎస్టీలు సామాన్యుడి ప్రాణాలను ఎలా తోడేస్తున్నాయో ఇడ్లీ ధరల పెరుగుదల ద్వారా రచయిత మార్మికంగా చెప్పారు.

కానీ, ఈ కథ కేవలం ఆకలి దగ్గర ఆగిపోలేదు. 'హిందోళ' అనే 54 ఏళ్ల మహిళ పాత్ర ప్రవేశంతో కథ ఒక ఊహించని మలుపు తిరుగుతుంది. వేశ్యావృత్తికి నెట్టబడి, జీవితంలో ఎన్నో దెబ్బలు తిన్న ఆమె, ఆ వయసులో ఎఎన్ఎమ్ కోర్సు చేస్తూ తనను తాను పునర్నిర్మించుకునే ప్రయత్నం చేయడం మానవ చైతన్యానికి నిదర్శనం. ఎండలో ఎండుతూ కేవలం 500 రూపాయల లాభం కోసం జామకాయలు అమ్మే శ్రమైక జీవి పడే ఆవేదనను, సన్యాసిరావు దినసరి బడ్జెట్ తారుమారు కావడాన్ని సమాంతరంగా నడపడం ద్వారా రచయిత అద్భుతమైన శిల్ప నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఇరువురి కళ్లలోనూ దొర్లిన ఆ చెమట చుక్కలు (లేదా కన్నీటి చుక్కలు) మన ఆధునిక ఆర్థిక విధానాల వైఫల్యానికి సాక్ష్యాలు.

పిల్లా తిరుపతిరావు 'ఈటీ' (సూర్య): గ్రామీణ జీవనంలో అంతర్భాగంగా ఉన్న వీధి కళలు, సర్కస్ లు ఎలా కనుమరుగవుతున్నాయో ఈ కథ రికార్డు చేసింది. రాజాం పట్టణంలో ఒక మినీ వ్యాన్ తో, బ్లూటూత్ స్పీకర్లతో తమ కళను ప్రదర్శిస్తున్న సాయిబు కుటుంబం పొట్టకూటి కోసం చేసే ప్రాణాపాయకరమైన ఫీట్లను రచయిత వర్ణించారు. నాగలిని గడ్డంపై నిలిపి, దానిపై కొడుకును ఎక్కించి సాయిబు చేసే విన్యాసం, చూస్తున్న విశ్వం, గణపతి వంటి అధ్యాపకుల గుండెల్లో గుబులు రేపుతుంది. "పొరపాటున చేయి జారితే బాబు బుర్ర పగిలిపోతుంది" అని ఆ తండ్రి చెబుతున్నప్పుడు, పేదరికం మనిషిని ఎంతటి అమానుషమైన అంచులకు నెడుతుందో మనకు అర్థమవుతుంది. సాంకేతికత పెరిగిన ఈ డిజిటల్ యుగంలో, మరుగున పడిపోతున్న ఇటువంటి జానపద కళలను ఆదరించాలన్న రచయిత ఆక్రోశం ఈ కథలో స్పష్టంగా వినిపిస్తుంది.

## 2. పితృస్వామ్యపు గోడలు - ఆత్మవిమర్శనాత్మక ప్రక్షాళన

మన ఇళ్లలో కనిపించే ప్రశాంతత చాలాసార్లు నిజమైనది కాదు. అది ఒకరు భరిస్తున్న మౌనం, మరొకరు చెలాయిస్తున్న ఆధిపత్యం మాత్రమే. ఈ పితృస్వామ్యపు ఇనుప గోడలను బద్దలు కొట్టే కథలు ఈ సంకలనంలో బలంగా వినిపించాయి.

కొత్తపల్లి ఉదయబాబు 'మారాలి...మారాలి!' (విశాలాంధ్ర): ఈ కథ మధ్యతరగతి కుటుంబాలలోని పురుషాధిక్యతను, లోభత్వాన్ని (పిసినారితనాన్ని) అత్యంత సహజంగా విచ్ఛిన్నం చేస్తుంది. రాజశేఖరం అనే తండ్రి పాత్ర, తన కుటుంబం పట్ల ప్రేమాభిమానాలు ఉన్నప్పటికీ, తనదైన నియంతృత్వ ధోరణితో వ్యవహరిస్తాడు. అతని ఈ ప్రవర్తన వల్లే అల్లుడు ఐదేళ్లుగా వాళ్ల ఇంటికి రావడం మానేస్తాడు. కూతురు సంగీత తన భర్తను గుడ్డిగా సమర్థించకుండా, తండ్రి చేసిన అవమానాన్ని నిష్కర్షగా ప్రశ్నించడం ఆధునిక స్త్రీ చైతన్యానికి ప్రతీక.

అంతేకాకుండా, కొడుకు ప్రభుదేవా ద్వారా రచయిత చెప్పించిన మాటలు ఒక కొత్త తరం కుటుంబ విలువల మేనిఫెస్టో లాంటివి. "మీరు కొనితెచ్చి పడేసే బట్టలు కాదు, వారి ఇష్టప్రకారం

వారు ఎంచుకున్నప్పుడు వారి ముఖంలో కనిపించే ఆనందమే నిజమైన పండుగ" అన్న భావన రాజశేఖరంలో ఒక భూకంపం సృష్టిస్తుంది. తన 'పురుషాధిక్య అహంకారం' తో ఇన్నేళ్లు తన భార్య భావప్రకటనా స్వేచ్ఛను ఎలా అణగదొక్కానో అతనికి అర్థమవుతుంది. అప్పటి కప్పుడు తన ప్రవర్తనను మార్చుకుని, కుటుంబంలో సంతోషాన్ని తిరిగి తీసుకురావడం ద్వారా, మనిషి ఎదగడానికి వయసు కాదు, ఆత్మవిమర్శ ముఖ్యమని ఈ కథ ఎలుగెత్తి చాటుతోంది.

శ్రీనివాసరావు తిరుక్కోవుళ్ళూరు 'అభిమాని' (సాక్షి ఫన్డే): సాహిత్య రంగంలో రచయితలకు ఉండే 'మేధో అహంకారాన్ని' ఈ కథ సున్నితంగా, అయితే పదునుగా ప్రశ్నిస్తుంది. చైతన్య అనే ప్రముఖ కథా రచయిత, తన పట్ల అమితమైన భక్తి భావం ప్రదర్శించే రామబ్రహ్మం గారిని ఒక సాధారణ అభిమానిగా, చాదస్తపు వృద్ధుడిగా మాత్రమే పరిగణిస్తాడు. కానీ ఆ వృద్ధుడి ఇంట్లో వేలాది పుస్తకాలను చూసినప్పుడు, ఒక సాహిత్య సభలో రామబ్రహ్మంగారు ప్రముఖ కాలమిస్ట్ గా ఆనర్గళంగా ప్రసంగిస్తున్నప్పుడు, రచయితలోని అహంకారం పటాపంచలవుతుంది. "ప్రతీ ప్రయాణం నీలోని నీకు తెలియని సరికొత్త మనిషిని పరిచయం చేస్తుంది" అన్న ముగింపు, కేవలం భౌతికమైన ప్రయాణాన్ని మాత్రమే కాక, అంతరంగిక ప్రక్షాళనను సూచిస్తుంది. విజ్ఞానం వినయాన్ని నేర్పాలే తప్ప, అహాన్ని కాదు అన్నది ఈ కథ సారాంశం.

## 3. సామాజిక కుతంత్రాలు - స్త్రీవాద స్పృహ, ధిక్కారం

కుటుంబ వ్యవస్థను అత్యంత పవిత్రమైనదిగా భావించే మన సమాజంలో, ఆ వ్యవస్థ ముసుగులో జరిగే లైంగిక అకృత్యాలను, ముఖ్యంగా కన్నతండ్రే మృగంగా మారిన పరిస్థితులను ప్రశ్నించడం చాలా అరుదు.

పట్ల యాదగిరి 'మల్లిక' (నమస్తే తెలంగాణ బతుకమ్మ): ఈ కథానిధిలో అత్యంత ప్రబలమైన, సాహసోపేతమైన కథ ఇది. సమాజంలో మార్కెట్ కమిటీ చైర్మన్ గా పేరు ప్రఖ్యాతులున్న మనోహర్ నిజస్వరూపం ఎంత క్రూరమైనదో అతని కూతురు మల్లిక స్వయంగా తెలుసు కోవడం ఈ కథ ఇతివృత్తం. తమ ఇంట్లో పనిచేసే దివ్యాంగుడైన డ్రైవర్ కూతురు రాజీ (పదో తరగతి విద్యార్థిని) పై మనోహర్ లైంగిక దాడి చేస్తాడు. స్కూల్ ఫంక్షన్లలో ఆడపిల్లలను వంకర బుద్ధితో తాకుతాడని (బ్యాడ్ టచ్) మల్లికకు ముందే తెలుసు.

తన భర్త గొప్పవాడని, ఇవన్నీ గిట్టనివాళ్లు చేసే ఆరోపణలని తల్లి మహాలక్ష్మి గుడ్డిగా వాదించడం, కూతురిని కొట్టడం... మన సమాజంలోని సగటు గృహిణుల బానిసత్వానికి ప్రతీక. కానీ మల్లిక వెనక్కి తగ్గలేదు. "నువ్వు నమ్మితే నీ భర్త శ్రీరామచంద్రుడై పోతాడా?" అని తల్లిని నిలదీస్తుంది. రాజీ శరీరంపై ఉన్న గాయాలను సాక్ష్యంగా చూపుతుంది. చివరకు ఒక వల పన్ని తన తండ్రి రాజీ పట్ల చేయబోతున్న అకృత్యాన్ని తల్లి, నానమ్మల ముందే రెడ్ హ్యాండెడ్ గా పట్టుకుంటుంది. పరువు పోయిందని ఆ తండ్రి ఆత్మహత్య చేసుకుంటాడు. "తప్పు చేస్తే తన వాళ్లయినా, పరాయి వాళ్లయినా శిక్ష అనుభవించి తీరాలి" అన్న మల్లిక నిర్ణయం, నేటి యువతలో వస్తున్న స్పష్టమైన, రాజీలేని సామాజిక, నైతిక చైతన్యానికి దర్పణం.

## 4. ఆధునిక విద్యావ్యవస్థ - మాతృత్వపు సంక్షోభం

పిల్లల పెంపకం ఈరోజుల్లో ఒక రేస్ గుర్రాల పోటీగా మారిపోయింది. ప్రేమ, ఆప్యాయతల స్థానంలో క్రమశిక్షణ, మార్కుల వేట వచ్చి చేరాయి. ఇది పిల్లల మనోభావాలను ఎలా

చిదిమేస్తోందో చెప్పే కథ 'అమ్మప్రేమ'.

సుదేష్ణాదేవి జంగంగారి 'అమ్మప్రేమ' (నవతెలంగాణ): ఈ కథలో తల్లి లహరి తన కూతురు అమృత భవిష్యత్తు బాగుండాలన్న ఏకైక ఉద్దేశ్యంతో, ఆమె పట్ల ఒక మిలిటరీ కమాండర్‌లా ప్రవర్తిస్తుంది. తల్లిని చూడగానే భయంతో వణికిపోయే స్థితికి అమృత చేరుకుంటుంది. ఆమెకు ఏకైక ఆశ్రయం అమ్మమ్మ జానకమ్మ ఒడి మాత్రమే. సెలవులు పూర్తయి, తిరిగి అమ్మతో వెళ్లాల్సి వచ్చినప్పుడు ఆ పసిబిడ్డ కళ్లు మూసుకుని పడే ఆవేదన పాఠకులను కంటతడి పెట్టిస్తుంది.

"పిల్లలకు మంచి స్కూల్, మంచి బ్యాగులు మాత్రమే కాదు.. వాళ్లు భయపడకుండా ఉండగలిగే ఒక ఒడి కావాలి. అది తల్లి ఒడే అవ్వాలి" అని జానకమ్మ చెప్పే మాటలు, ఆధునిక కార్పొరేట్ విద్యావ్యవస్థలో కొట్టుకుపోతున్న ప్రతి తల్లిదండ్రులకు ఒక చెంపపెట్టు. తన కఠినత్వం వల్ల కూతురు తనకెంత దూరమైందో గ్రహించిన లహరి, చివరలో తన బిడ్డను ప్రేమగా హత్తుకోవడం ద్వారా, మాతృత్వం తన సహజత్వాన్ని తిరిగి పొందుతుంది.

## 5. వ్యవస్థాగత హింస - మానవీయ పునరావాసం

నేరస్థులను సృష్టించేది సమాజమే అయినప్పుడు, వారిని సంస్కరించాల్సిన బాధ్యత కూడా ఆ సమాజానిదే, మరీ ముఖ్యంగా అధికార వ్యవస్థదే అని చాటిచెప్పే కథ ఇది.

పంతంగి శ్రీనివాసరావు 'ప్రక్షాళన' (వార్త): పోలీసు వ్యవస్థ అనగానే లాఠీలు, ఎన్కౌంటర్లు మాత్రమే గుర్తొచ్చే కాలంలో, ఎస్.పి. వైజయంతి పాత్ర ఒక మానవీయ దీపంలా కనిపిస్తుంది. ఒక దోపిడీ దొంగల ముఠాతో జరిగిన ఎన్కౌంటర్ తర్వాత, చనిపోయిన వారి పిల్లలు దిక్కులేని వాళ్లవడం చూసి ఆమె చలించిపోతుంది. దొంగతనాలకు పేరుబడిన 'నాగలాపురం' అనే గ్రామానికి ఆమె సాధారణ స్త్రీగా వెళ్లి, వారితో మమేకమవుతుంది. నెత్తుటి కూడు వద్దని, శ్రమలో ఆనందం ఉందని వారికి వివరిస్తుంది.

కేవలం మాటలతో ఆగిపోకుండా, తన స్నేహితుడు అజయ్ సహాయంతో ఆ గ్రామాన్ని దత్తత తీసుకుని, అక్కడి వారికి వ్యవసాయం, కుట్టుపని వంటి ఉపాధి అవకాశాలు కల్పిస్తుంది. ఎన్కౌంటర్ లో చనిపోయిన ఒక దొంగ కొడుకు వినయ్ కు రహస్యంగా విద్యాదానం చేస్తుంది. ముప్పై ఏళ్ల తర్వాత ఆ పిల్లాడు డాక్టరై, ఆమె పేరు మీదే 'వైజయంతి హాస్పిటల్' కట్టి, ఆమెను ప్రారంభోత్సవానికి ఆహ్వానించినప్పుడు కథ ఉదాత్తమైన శిఖరాలకు చేరుకుంటుంది. ఒక నేరస్థుల గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా మార్చిన ఒక పోలీసు ఆఫీసర్ కథ, దండనీతి కన్నా కరుణ ఎంత శక్తివంతమైనదో నిరూపిస్తుంది.

## 6. బంధాల సంక్లిష్టత - మాయపొరల వెనుక త్యాగం

ఆధునిక సంబంధాలలో విడాకులు సర్వసాధారణం అయిపోయాయి. కానీ ఆ విడాకుల వెనుక ఎవరికీ తెలియని ఒక అద్భుతమైన, కన్నీళ్లు తెప్పించే త్యాగం ఉంటే?

మల్లాది వెంకటకృష్ణమూర్తి 'ది డివోర్స్' (సాక్షి ఫన్డే): విపుల్ అనే యువతికి తన భర్త అకస్మాత్తుగా 'ఇన్ కాంపాటిబిలిటీ' (మన స్పర్ధలు) అనే కారణంతో విడాకుల నోటీసు పంపుతాడు. భర్త తన తమ్ముడికి డబ్బులు ఇవ్వడం, తల్లిదండ్రులను ఇంట్లో ఉంచుకోవడం వల్లే ఈ గొడవలు వచ్చాయని విపుల్ భావిస్తుంది. అహం దెబ్బతిన్న ఆమె దానికి అంగీకరిస్తుంది, విడాకులు మంజూరవుతాయి.

కానీ చివర్లో భర్త పంపిన మెసేజ్ కథాగమనాన్ని పూర్తిగా తలకిందులు చేస్తుంది. తనకు ఫోర్త్ స్టేజ్ క్యాన్సర్ ఉందని, తాను చనిపోయాక తన ఆస్తి, ప్రావిడెంట్ ఫండ్ మొత్తం వృద్ధులైన

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

తన తల్లిదండ్రులకు చేరాలన్నదే అతని ఆరాటం. చట్టప్రకారం భార్యకే ఆ హక్కులు వెళ్తాయని, ఆస్తి కోసం విపుల్ కోర్టుకెక్కితే తన తల్లిదండ్రులు పోరాడలేరని అతనికి తెలుసు. అందుకే విపుల్ కు ఆర్థిక స్వాతంత్ర్యం ఉందని నిర్ధారించుకున్న తర్వాతే, ఆమెను విడాకుల ద్వారా దూరం చేస్తాడు. తన చావును ముందుగానే చూస్తూ, అటు భార్యపై ఉన్న అపారమైన ప్రేమను, ఇటు తల్లిదండ్రుల పట్ల ఉన్న బాధ్యతను సమతుల్యం చేయడానికి అతను ఆడిన ఈ 'విడాకుల నాటకం' ఒక అపూర్వమైన విషాదాంత కావ్యం.

## 7. రేపటి ఆశాకిరణాలు -

## బాలల సాహిత్యం

బాల్యం ఎప్పుడూ స్వచ్ఛమైనదే. వారు అడిగే ప్రశ్నలు సమాజానికి సూటిగా తగులుతాయి. ఈ సంకలనంలో (నవతెలంగాణ, ప్రజాశక్తి) ప్రచురితమైన బాలల కథలు భవిష్యత్తుపై ఆశలు రేకెత్తిస్తాయి.

* 'నవ్వుతున్న చెట్టు' (నల్ల సాయి ప్రశాంతి): అభివృద్ధి పేరుతో రోడ్డు వెడల్పు కోసం పెద్ద చెట్లను నరికేయాలని అధికారులు వస్తే, చింటూ మరియు అతని స్నేహితులు చెట్లను కౌగిలించుకుని నిలబడతారు. చారిత్రాత్మక 'చిప్కో ఉద్యమం' స్ఫూర్తితో సాగిన ఈ కథ, పర్యావరణ పరిరక్షణ పట్ల పిల్లల్లో ఉండాల్సిన అవగాహనను అద్భుతంగా చిత్రీకరించింది.

* 'మంచి స్నేహం' (ఓట్ర ప్రకాష్ రావు): నీళ్లలో పడిపోయిన స్మార్ట్ ఫోన్ ను వెతికి తెచ్చివ్వడానికి ఒక తాబేలు నిరాకరిస్తుంది. ఆ ఫోన్ వల్ల తన స్నేహితుడు హరి నిద్రలేకుండా, స్నానం కూడా చేయకుండా ఎంతగా చెడిపోతున్నాడో తాబేలు వివరిస్తుంది. డిజిటల్ వ్యసనం పట్ల ఇదొక చక్కటి హెచ్చరిక.

* 'బాల్య స్నేహితులు' (శాఖమూరి శ్రీనివాస్): బురదలో పడ్డ మిత్రుడిని చూసి నవ్వినందుకు విడిపోయిన ఇద్దరు పిల్లలను, స్కూల్ వాచ్ మెన్ పందరి మళ్లీ ఎలా ఏకం చేశాడో ఈ కథ చెబుతుంది. స్నేహం విలువను తెలియజెప్పే హృద్యమైన రచన ఇది.

సామాజిక చలనశీలతను, మానవ సంబంధాల సంక్లిష్టతలను రికార్డు చేయడంలో తెలుగు కథ ఎప్పుడూ ముందువరసలోనే ఉంటుంది అనడానికి ఈ జూన్ 14 నాటి 'కథానిధి' సంకలనం ఒక సజీవ ఉదాహరణ. పేదరికం తెచ్చే దైన్యం నుంచి పితృస్వామ్య అహాన్ని ధిక్కరించే స్త్రీవాద చైతన్యం వరకు, చట్టాల ముసుగులో దాగున్న త్యాగాల నుంచి, పర్యావరణ పరిరక్షణకై నడుంకట్టిన బాలల వరకు.. ఈ కథలన్నీ వర్తమాన సమాజానికి అద్దం పడుతున్నాయి.

ఈ రచయితలు కథలను కేవలం ముగింపుల కోసం రాయలేదు. పాఠకుడిలో ఒక అంతర్మథనాన్ని, ఒక ప్రక్షాళనను తీసుకురావడానికి రాశారు. సమాజం ఎంతగా యాంత్రికంగా మారుతున్నా, మానవీయ స్పందనలు ఇంకా ఎక్కడో ఒకచోట మొలకెత్తుతూనే ఉన్నాయని ఈ కథలు ఆశాభావాన్ని రేకెత్తిస్తున్నాయి. తెలుగు కథ బతికే ఉంది, అది మనల్ని బతికిస్తూనే ఉంటుంది.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్స్అప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# నాన్నంటే కొండంత ధైర్యం

'మాతృదేవోభవ, పితృదేవోభవ, ఆచార్యదేవోభవ, అతిథి దేవోభవ' అని భారతీయ సనాతన ధర్మం చెబుతోంది. ఈ నాలుగు మాటలను అనుసరిస్తే, భగవంతుడిని దర్శించుకున్నట్లేనని పెద్దలు చెప్తారు. జీవితంలో సరైన దారిని చూపే మొట్టమొదటి వ్యక్తి తండ్రి కనుక.. గురువు అనే పదానికి తండ్రి అనే అర్థం కూడా ఉంది.



తండ్రికి ఇచ్చిన మాటకు కట్టుబడి రాజ్యాభిషేకం వదులుకుని, అరణ్యవాసం చేసి, పితృవాక్య పరిపాలకుడుగా నిలబడ్డాడు రాముడు. నేటికీ రాముడు ధర్మానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నాడు. మహాభారతంలో భీష్ముడు తన తండ్రి కోసం బ్రహ్మచర్యం వహిస్తానని భీషణ ప్రతిజ్ఞ చేసి, భీష్ముడయ్యాడు. ఇక శ్రవణ కుమారుడి కథను పరిశీలిస్తే... అంధులైన తన తల్లిదండ్రులను కావడిలో కూర్చోబెట్టుకుని, ఆ కావడిని భుజాన వేసుకుని మోసుకుంటూ జీవితం గడిపాడు. తల్లిదండ్రుల పట్ల అంత గౌరవాన్ని ప్రదర్శించిన కథలు ఇవన్నీ.

**ఇక తండ్రిని పరిశీలిస్తే –**

పశుపక్ష్యాదులలో సైతం మగ పక్షులు తమ పిల్లలకోసం ఆహారం సంపాదించి తీసుకువస్తాయి. కొన్నిరకాల పక్షులు గూళ్లు నిర్మిస్తాయి. 'నాన్నంటే భరోసా... నాన్నంటే కొండంత ధైర్యం, పిల్లలను నడిపించే దిక్సూచి నాన్న' అని అనుభవజ్ఞులు చెప్తుంటారు.

**శకుంతలోపాఖ్యానంలో –**

శకుంతల భరతుణ్ణి వెంటబెట్టుకుని తండ్రియైన దుష్యంతుని దగ్గరకు తీసుకు వెళ్లిన సందర్భంలో, దుష్యంతుడు 'మీరెవరో నాకు తెలియదు' అని పలుకుతాడు. అందుకు శకుంతల, 'పుత్ర గాత్ర పరిష్వంగము' కన్న బిడ్డను కౌగిలించుకున్నందు వల్ల కలిగే ఆనందం గురించి పలుకుతుంది. 'బాలార్క తేజుడగు ఈ బాలుడు నీ పుణ్య తనువు వలన కలిగాడు. ఈ బిడ్డను ఒక్క సారి కౌగిలించుకుని చూడు. నీకే తెలుస్తుంది..' అంటూ 'విపరీత ప్రతిభాషలేమిటికి? ఉర్వీనాథ! యీ పుత్ర గాత్ర పరిష్వంగ సుఖంబు చేకొనుము. ఈ ఆనందంతో ఏదీ సాటిరాదు' అని పలుకుతుంది. తండ్రికి తన సంతానం స్పర్శ అంత హాయినిస్తుందని నన్నయ చెప్తున్నాడు.

తండ్రి పేరు ఆధారంగా చేసుకుని రాముడిని దాశరథి అని, వసుదేవుని కుమారుడైన శ్రీకృష్ణుడిని వాసుదేవుడు అని పిలవటం తెలిసిందే.

**వ్యాసం వసిష్ఠ నప్తారం**
**శక్తేః పౌత్రమకల్మషం**
**పరాశరాత్మజం వందే**
**శుక తాతం తపోనిధిం**

ఈ ఒక్క శ్లోకం చాలు తండ్రి పేరుతో పిల్లలను గురించి పలకటం. వ్యాసుడు... శుకునికి తండ్రి, పరాశరుని కుమారుడు, శక్తికి మనుమడు, వసిష్ఠునికి ముని మనుమడు. వ్యాసుడంతటి వాని గురించి చెప్పడానికి ఇంతమందిని ప్రస్తావించారు. అదీ తండ్రి ఔన్నత్యం.

అనగనగా ఒక ఊరిలో పరంధామయ్య అనే రైతు ఉన్నాడు. అతడికి రంగయ్య అనే కొడుకు ఉన్నాడు. తండ్రికి కొడుకంటే వల్లమాలిన ప్రేమ. కొడుకును కంటికి రెప్పలా చూసుకునేవాడు. ఆ కొడుకు పెద్దవాడయ్యాడు. యుక్తవయస్సు రాగానే రంగయ్యకు వివాహం చేశాడు పరంధామయ్య. కొంతకాలానికి రంగయ్యకు ఒక కొడుకు పుట్టాడు. వాడికి రాజయ్య అని పేరు పెట్టాడు. రాజయ్యకు ఆరు సంవత్సరాలు రాగానే బడిలో వేశాడు. ఒకరోజు రాజయ్య బడి నుంచి ఇంటికి వస్తుండగా పెద్ద వర్షం కురుస్తోంది. వెంటనే రంగయ్య ఒక గొడుగు తీసుకుని బడికి బయలుదేరాడు. వెనక నుంచి పరంధామయ్య 'రంగా! తడిసిపోతావు. నీకు మరో గొడుగు ఇస్తాను ఉండు' అన్నాడు.

అందుకు రంగయ్య, 'నాన్నా! నేనేం తడవనులే, నన్ను తొందరగా వెళ్లనీ, నేను వెళ్లడం ఆలస్యమైతే నా కొడుకు తడిసిపోతాడు' అని కొంచెం విసుగ్గా మాట్లాడాడు. పరంధామయ్య నవ్వుతూ, 'నీ కొడుకు తడిసిపోతాడని నువ్వు గొడుగు తీసుకు వెళ్తున్నావు, మరి నా కొడుకైన నువ్వు తడిసిపోతుంటే నాలోని తండ్రి మనసు బాధపడదా' అన్నాడు.

రంగయ్య కళ్లు చెమర్చాయి. 'నిజమే కదా, నా తండ్రిది కూడా తండ్రి మనసే కదా' అనుకుని, తండ్రి ఇచ్చిన గొడుగు వేసుకుని బడికి బయలుదేరాడు. తండ్రి మనసును ప్రతిబింబించే ఈ కథ చాలా కాలంగా ప్రచారంలో ఉంది.

తన పిల్లలు ఎంత పెద్దవారైనప్పటికీ, తండ్రికి మాత్రం వారు చిన్నపిల్లలుగానే కనిపిస్తారు.

- డా. పురాణపండ వైజయంతి
(ఫాదర్స్ డే సందర్భంగా)

వెలుగు దినపత్రిక

# నెమలీక




## కోతి చెప్పిన రహస్యం !

పైడిమర్రి రామకృష్ణ,
92475 64699

ఒక అడవిలో ఏనుగు, ఎలుగుబంటి, కోతి స్నేహంగా ఉండేవి. ఏనుగు, ఎలుగుబంటి ఎప్పుడూ నీరసంగా, తలదించుకుని నడుస్తూ ఉండేవి. వాటికి తమ బలం మీద తమకే నమ్మకం ఉండేది కాదు. కానీ కోతి మాత్రం ఎంతో చలాకీగా, వెన్నుముక



నిటారుగా ఉంచి చెట్లపై గంతులేస్తూ ఉండేది.

ఒకరోజు తన మిత్రుల అవస్థను చూసి తట్టుకోలేక కోతి వాటి దగ్గరకు వెళ్లి, "మిత్రులారా! మీరు అంత బలంగా ఉండి కూడా ఎందుకు అలా రోజంతా దీనంగా తలవంచుకుని తిరుగుతారు?" అని అడిగింది. దానికి ఏనుగు బదులిస్తూ, "ఏమో కోతి బావ, మా శరీరాలు చాలా బరువుగా ఉంటాయి, అందుకే మాకు ఎప్పుడూ అలసటగా, భయంగా అనిపిస్తుంది" అని సమాధానమిచ్చింది. కోతి నవ్వి, మన శరీరాన్ని ఉంచే తీరు బట్టే మన మనసు మారుతుందని వివరించింది.

?ఒకసారి పక్క అడవి నుంచి ఒక పులి వచ్చింది. అది కనిపించిన జంతువులన్నిటినీ వేటాడి చంపి తినేది. పులి గాండ్రింపు వినగానే ఆ అడవిలోని జంతువులన్నీ బిక్కుబిక్కుమంటూ పారిపోయి దాక్కునేవి. తన మిత్రులైన ఏనుగు, ఎలుగుబంటిలకు శారీరక బలం ఉన్నప్పటికీ, మానసికంగా పులి గాండ్రింపు విని భయపడుతున్నాయని గ్రహించింది కోతి.

ఒకసారి కోతి, ఏనుగు, ఎలుగుబంటి ఆహారం కోసం వెతుకుతూ అడవిలో తిరగసాగాయి. అంతలో దూరంగా పులి గాండ్రింపు వినిపించింది. పులి గాండ్రింపు వినగానే ఏనుగు భయంతో వణికిపోతూ తన శరీరాన్ని ఇంకాస్త కుంచించుకుపోయేలా చేసింది. ఎలుగుబంటి కూడా ఎక్కడికక్కడ వంగిపోయి దాక్కోవడానికి ప్రయత్నించింది.

పులి వేగంగా వాటి వైపు రావడం గమనించిన కోతి, వెంటనే ఏనుగు చెవిలో ఒక రహస్యం చెప్పింది: "మిత్రమా! భయపడకు, మొదట నీ వెన్నుముక నిటారుగా ఉంచి, తల ఎత్తి గంభీరంగా నిలబడు, అప్పుడు నీకేం అనిపిస్తుందో చూడు" అని కోతి గట్టిగా చెప్పింది.

వెంటనే ఏనుగు తన భారీ కాయాన్ని నిటారుగా పెట్టి, తన తొండాన్ని ఆకాశం వైపుకు ఎత్తి గంభీరంగా నిలబడింది. ఎలుగుబంటి కూడా కోతి మాటను స్వీకరించి, తన వంగిన భుజాలను వెనక్కి నెట్టి, చాతిని ముందుకు చాచి తన రెండు కాళ్ల మీద నిటారుగా నిలబడింది. కేవలం శరీర భంగిమను మార్చడం వల్ల వాటిలో అద్భుతమైన ఉత్సాహం ప్రవహించింది.

పులి వాటి ముందుకు రాగానే, భయంతో పారిపోకుండా ఏనుగు గంభీరంగా ఘీంకరించింది. అది చూసి ఆశ్చర్యపోయిన పులి, "ఏమిటిది? నిన్నటి వరకు భయంతో వణికిపోయిన ఈ జంతువుల్లో ఇంతటి ఆత్మవిశ్వాసం ఎక్కడి నుండి వచ్చింది?" అని మనసులో అనుకుని వెనక్కి తగ్గింది. నిటారుగా, దృఢంగా నిలబడిన ఆ జంతువుల రూపం చూసి పులి భయపడి అక్కడి నుండి పారిపోయింది.

మనం ఎంత బలంగా ఉన్నామనే దానికంటే, మనల్ని మనం ఎంత ధైర్యంగా ఇతరులకు ప్రదర్శిస్తున్నాం అనేది ముఖ్యమని అవి గ్రహించాయి. ఆ రోజు నుండి ఏనుగు ఎప్పుడూ తల దించుకోలేదు, ఎలుగుబంటి కూడా ఒంగి నడవకుండా గంభీరంగా సాగింది. కోతి ఇచ్చిన ఆ చిన్న సలహా వాటి జీవితాల్లో పెను మార్పును తీసుకువచ్చింది. శారీరక స్థితి బాగుంటే మానసిక ధైర్యం దానంతట అదే వస్తుందని అవి అర్థం చేసుకున్నాయి. కోతి చెప్పిన ఆ ఆత్మవిశ్వాస రహస్యాన్ని పాటిస్తూ ఏనుగు, ఎలుగుబంటి హాయిగా జీవించాయి

◆◆

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# జ్ఞానవనంలో చిట్టి చిలుక

అనగనగా ఒక అడవి. దాని పేరు జ్ఞానవనం. ఆ అడవిలో చిట్టి అనే చిలుక ఉండేది. మెరిసే కళ్లతో అందంగా ఉంటుంది. మంచి మనసు, చురుకైన ఆలోచనలు కలది. "నేను పెద్దవాడిని కాకపోయినా, మంచి పని చేస్తే అందరికీ ఉపయోగపడగలను" అని తనలో తాను అనుకునేది. చిట్టికి 'బుజ్జి' కుందేలు.. 'మందారం' జింక.. 'ధీరుడు' ఏనుగు.. స్నేహితులు.

ఒక పెద్ద వటవృక్షం మీద మేధావి గుడ్లగూబ కూడా నివసించేది. చిట్టి గుడ్లగూబను చూస్తూ.. "గురువుగారూ నిజమైన గొప్పతనం అంటే ఏమిటి?" అని అడిగింది. గుడ్లగూబ నవ్వి "ఇతరులకు ఉపయోగపడే మనసే నిజమైన గొప్పతనం" అంది ఆ మాట చిట్టికి బాగా నచ్చింది. తన హృదయంలో వెలుగై నిలిచిపోయింది. ఒక రోజు చిట్టి "మనమందరం కలిసి అడవిలో ఎవరికైనా సాయం చేద్దాం" అంది. ఆ మాట విని "అది చాలా మంచి ఆలోచన!" అన్నాయి.

మరుసటి రోజు ఒక చిన్న ఉడుత చెట్టు కింద ఏడుస్తూ కనిపించింది. "ఏమైంది?" అని చిట్టి అడిగింది. "నా గింజలు ఈ తీవ్రమైన ఎండకు ఎండిపోయాయి. వడగాలికి ఎగిరిపోయాయి" అని ఉడుత బాధగా చెప్పింది. చిట్టి తన స్నేహితులను పిలిచింది. అవన్నీ కలిసి గింజలు వెతికి.. ఏరి ఉడుతకు ఇచ్చాయి. ఉడుత ఆనందంతో.. "స్నేహం అంటే ఇదే!" అని సంతోషంగా చెట్టెక్కింది.

అక్కడికి బ్లాకీ అనే కాకి వచ్చి.. " ఈ చిన్న చిలుక ఏమి చేస్తుంది? నేనే తెలివైనదాన్ని!" అంది అహంకారంగా. చిట్టి "తెలివి గొప్పది. కానీ దయ మరింత గొప్పది" అంది. కాకి పట్టించుకోలేదు. ఈ విషయం తనకు కాలమే నేర్పుతుంది అనుకుంది చిట్టి.

ఆ రాత్రి బలమైన గాలి వచ్చింది. చెట్లు ఊగిపోయాయి. కాకి గూడు కిందపడిపోయింది. బ్లాకీ భయంతో "ఎవరైనా నన్ను కాపాడండి!" అని గట్టిగా మొత్తుకుంది. చిట్టి వెంటనే ధీరుడిని పిలిచింది. ఏనుగు తన తొండంతో గూడు పైకి ఎత్తి చెట్టుపై ఉంచింది. బ్లాకీ సిగ్గుతో తల వంచుకుంది. "చిట్టీ! నేను నిన్ను తక్కువగా చూశాను. కానీ నువ్వు నాకు సాయం చేశావు" అంది బ్లాకీ.

చిట్టి నవ్వుతూ.. "స్నేహానికి అహంకారం అడ్డుకాదు" అంది. ఆ రోజు నుంచి బ్లాకీ కూడా మంచి పనులు చేయడం ప్రారంభించింది.



అది ఎండాకాలం కావటంతో.. అడవిలోని చిన్న చెరువు ఎండిపోవడం మొదలైంది. జంతువులన్నీ ఆందోళన చెందాయి. "ఇప్పుడు ఏం చేద్దాం?" అని బుజ్జి అడిగింది. చిట్టి ఆలోచించి "మనమందరం కలిసి కొత్త కాలువ తవ్వుదాం" అంది. అనుకున్నదే తడవుగా.. ఏనుగు మట్టి తొలగించింది. కుందేలు చిన్న రాళ్లు తీసింది. జింక మొక్కలను తొలగించింది. చిట్టి అందరికీ మార్గనిర్దేశం చేసింది. కొన్ని గంటల్లోనే కాలువ సిద్ధమైంది. దూరంలోని వాగు నుంచి నీరు చెరువులోకి వచ్చాయి. అన్నీ ఆనందంతో చప్పట్లు కొట్టాయి. ఇక వనంలోని వృద్ధ తాబేలు అన్నది.. "ఒక్కరి శక్తి పరిమితం. అందరి ఐక్యత అపరిమితం" అనగానే చిట్టి నమస్కరించింది.

"ఈ మాటను ఎప్పటికీ గుర్తుంచుకుంటాను" అంది. ఇదిలా ఉండగా.. ఒక రోజు చిన్న జింక దారి తప్పిపోయింది. చిట్టి చెట్లపై ఎగిరి వెతికింది. బుజ్జి నేలపై పరుగెత్తింది. బ్లాకీ ఆకాశం నుంచి గమనించింది. చివరకు పిల్ల జింకను కనిపెట్టాయి. పిల్ల జింక తల్లిని చూసి పరుగెత్తి కౌగిలించుకుంది. "నా బిడ్డను కాపాడిన మీ అందరికీ ధన్యవాదాలు" అని తల్లి కన్నీళ్లు పెట్టుకుంది. కృతజ్ఞతా భావంతో.. చిట్టి మాట్లాడుతూ "ఇది మా బాధ్యత" అంది.

ఇలా ఉండగా.. ఒకసారి చిట్టికి ఒక బంగారు గింజ దొరికింది. "ఇది ఎవరిదో తెలుసుకుని తిరిగి ఇవ్వాలి" అంది. అది వృద్ధ ఉడుతదని తెలిసింది. వెంటనే తనకు ఇచ్చింది. ఉడుత ఎంతగానో సంతోషించి.. ఆశీర్వదించింది.

ఇదంతా చూస్తూ గుడ్లగూబ.. "నిజాయితీ మనిషిని, జంతువుని గొప్పవాడిని చేస్తుంది" అంది. చిట్టి వినయంగా తలవంచింది.

ఈ శుభ సందర్భంగా.. జ్ఞానవనంలో "స్నేహోత్సవం" జరపాలని నిర్ణయించాయి. అన్నీ తమ తమ పనులు చేసుకున్నాయి. చిట్టి కార్యక్రమాన్ని నిర్వహించింది. సభలో బ్లాకీ మాట్లాడుతూ.. "అహంకారం నన్ను ఒంటరిగా చేసింది. స్నేహం నన్ను మంచిగా మార్చింది" అంది. అన్నీ చప్పట్లు కొట్టాయి. ఇక.. చిట్టి వేదికపై నిలబడి "మనలో ఎవరూ చిన్నవారు కాదు. మంచి మనసు ఉంటే ప్రతి ఒక్కరూ గొప్పవారే" అంది. ఆ రోజు నుంచి జ్ఞానవనంలో ప్రేమ, సాయం, ఐక్యత మరింత పెరిగాయి.

- డా. కటుకోఝ్వల రమేష్

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

# గర్విష్ఠి గజరాజు

• అవ్యాన్

పిల్లల కథ



అనగనగా ఒక దట్టమైన అడవి. ఆ అడవిలో ఒక గజరాజు ఉండేది. దానికి తన బలమన్నా, భారీ శరీరమన్నా చాలా గర్వం. 'ఈ అడవిలో నాకంటే బలవంతులు ఎవరూ లేరు' అని ఎప్పుడూ విర్రవీగుతూ ఉండేది. చిన్న జంతువులను తక్కువగా చూస్తూ, వాటిని హేళన చేసేది. అందుకే అడవిలోని జంతువులన్నీ దానికి దూరంగా ఉండేవి.

అదే అడవిలో చింటూ అనే ఒక తెలివైన చిన్న కుందేలు ఉండేది. అది చాలా మంచిది. అందరితోనూ స్నేహంగా ఉండేది.

ఒకరోజు గజరాజు అడవిలో గంభీరంగా నడుచుకుంటూ వెళ్తుండగా, దారిలో ఉన్న చింటూను గమనించకుండా దాని కాలిని తొక్కింది. పాపం! చింటూ నొప్పితో 'అమ్మా!' అని అరుస్తూ పక్కకు పడిపోయింది.

గజరాజు అది చూసి కూడా కనీసం క్షమాపణ చెప్పలేదు. పైగా, 'నువ్వు చాలా చిన్నదానివి, నా కాళ్ల కింద పడకుండా జాగ్రత్తగా ఉండటం నేర్చుకో' అని ఎగతాళి చేసి వెళ్ళిపోయింది.

చింటూ బాధతో కళ్ళు తుడుచుకుని అక్కడి నుండి వెళ్ళిపోయింది.

ఈ అడవిలో నాకంటే బలవంతులు ఎవరూ లేరు' అని ఎప్పుడూ విర్రవీగుతూ ఉండేది. చిన్న జంతువులను తక్కువగా చూస్తూ, వాటిని హేళన చేసేది. అందుకే అడవిలోని జంతువులన్నీ దానికి దూరంగా ఉండేవి.

కొన్ని రోజుల తర్వాత అడవిలోకి వేటగాళ్లు వచ్చారు. వారు గజరాజును పట్టుకోవడానికి ఒక బలమైన ఉచ్చు పన్నారు. గజరాజు అజాగ్రత్తగా వెళ్తూ ఆ వలలో చిక్కుకుపోయింది. ఎంత ప్రయత్నించినా ఆ వల నుండి బయటకు రాలేకపోయింది. ఆ వల విడిపోలేదు, సరిగదా ఇంకా బిగుసుకుపోయింది. దానితో సహాయం కోసం గజరాజు బిగ్గరగా అరిచింది. ఆ అరుపులు విన్న మిగిలిన జంతువులు 'గర్విష్ఠి గజరాజుకు తగిన శాస్తి జరిగింది' అని అనుకున్నాయే తప్ప రక్షించడానికి రాలేదు. కానీ చింటూ ఆ అరుపులు విని ఆగలేకపోయింది. వెంటనే గజరాజు ఉన్న చోటికి పరుగెత్తింది. వలలో చిక్కుకుని విలవిల్లాడుతున్న గజరాజును చూసి చింటూ మనసు కరిగింది.

'భయపడకు గజరాజా! నేను ఇప్పుడే వస్తాను' అని చెప్పి ఊరడించింది. తరువాత చింటూ వేగంగా వెళ్లి తన స్నేహితులైన ఎలుకల సైన్యాన్ని తీసుకువచ్చింది.

చింటూ ఆజ్ఞతో ఎలుకలన్నీ కలిసి తమ పదునైన పళ్ళతో ఆ బలమైన వల తాళ్లను కొరకడం మొదలుపెట్టాయి. చూస్తూ ఉండగానే వల ముక్కలైపోయింది. గజరాజు బంధవిముక్తురాలైంది!

వల నుండి బయటకు వచ్చిన గజరాజు కళ్లలో నీళ్లు తిరిగాయి. అది మెల్లగా చింటూ దగ్గరకు వచ్చి, 'చింటూ! నన్ను క్షమించు. నేను నిన్ను తక్కువ చేసి మాట్లాడాను. కానీ ఈరోజు నా ప్రాణాలు కాపాడింది నీలాంటి చిన్న ప్రాణియే. బలం శరీరంలో కాదు, చేసే సాయంలో ఉంటుందని తెలుసుకున్నాను' అని వినయంగా చెప్పింది.

చింటూ నవ్వుతూ, 'అపకారికి కూడా ఉపకారం చేయాలన్నదే మా అమ్మ నేర్పిన పాఠం. ఇకపై మనమందరం స్నేహితులుగా ఉందాం' అంది.

ఆ రోజు నుండి గజరాజు తన గర్వాన్ని వదిలేసి, అడవిలోని అన్ని జంతువులతో స్నేహంగా మెలుగుతూ అందరికీ రక్షణగా నిలిచింది.

## అలాగా!




అమెరికన్ కరెన్సీ మీద అలెగ్జాండర్ హ్యామిల్టన్ బొమ్మ ఉంటుంది. అమెరికా వ్యవస్థాపకుల్లో ఒకరైన హ్యామిల్టన్, అమెరికా తొలి ఆర్థిక మంత్రిగా పనిచేశారు. అయితే, ఆయన ఇప్పటి అమెరికా భూభాగంలో పుట్టలేదు. హ్యామిల్టన్ 1755 జనవరి 11న బ్రిటిష్ వలస ప్రాంతమైన బ్రిటిష్ లీవార్డ్ దీవుల్లోని చాల్స్‌టౌన్‌లో జన్మించారు. ఈ ప్రాంతం ఇప్పుడు ఆంటిగ్వా అండ్ బార్బుడాలోని భాగంగా ఉంది.

## హితవచనం

అలముదకేన తృణైర్వా మనస్వినా ప్రాణధారణా కార్యా
నాసంస్కృతశ్చ పురుషః ప్రాకృతసత్త్వః ప్రణయితవ్యః

ఆత్మాభిమానం ఉన్నవాడు ఆకులు అలములు తినిగాని, కేవలం మంచినీళ్లు తాగిగాని ప్రాణాలు నిలబెట్టుకుంటాడే తప్ప నీచులను సంతోషపెట్టడానికి ప్రయత్నించడు.

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




# కవి తెచ్చిన మార్పు

విజయనగర సామ్రాజ్యాన్ని పాలిస్తున్న రాజ్యవర్ధనుడు గొప్ప పరాక్రమవంతుడు. యుద్ధవిద్యల్లో ఆరితేరినవాడు. తన రాజ్యాన్ని విస్తరించాలన్న కాంక్షతో ఇరుగు పొరుగు రాజ్యాలమీద యుద్ధాలు ప్రకటించాడు. యుద్ధానికి వెళ్ళిన చోటల్లా విజయమే!

తాను యుద్ధానికి వెళ్లే సమయంలో వెంట కవులను తీసుకెళ్ళేవాడు. కవులు తన పరాక్రమం గురించి కథలు కథలుగా వర్ణించాలని, ఆ కథలు భావితరాల రాజులకు స్ఫూర్తినివ్వాలని ఆయన కోరిక.

రాజ్యవర్ధనుడు ఒకసారి అవంతి రాజ్యం మీద యుద్ధం చేసి విజయంతో రాజధానికి తిరిగొచ్చాడు. తరువాత కవులు ఆయన శౌర్యపరాక్రమాలను వర్ణిస్తూ కావ్యాలు రాసి నిండుసభలో గానం చేశారు. సభికులందరు విని ప్రశంసలు కురిపించారు.

అంతదాకా మౌనంగా వున్న ఒక యువ కవి ముందుకు వచ్చి "ప్రభువులు నన్ను మన్నించాలి. నేను మొదటిసారిగా మీతో యుద్ధభూమికి వచ్చాను. యుద్ధంలో మీ పరాక్రమం అద్భుతం అనిపించింది. కానీ అంతకంటే మరొకటి నన్ను ఆలోచింపజేసింది. అదేమిటంటే ప్రాణనష్టం, ఆస్తినష్టం. అందుకని నేను యుద్ధభూమిలో కనిపించే విషాదాలను వర్ణిస్తూ కావ్యం రాశాను. మీరు నన్ను మన్నించి నా కావ్యాన్ని వినాలి" అన్నాడు.

రాజ్యవర్ధనుడు క్షణంపాటు నివ్వెరపోయి, తర్వాత కవి కోరికను మన్నించాడు. యువకవి అద్భుతంగా కావ్యగానం చేశాడు. యుద్ధంలో జరిగే విధ్వంసం, హృదయవిదారక దృశ్యాలను వినేవాళ్ళ కళ్లు చెమ్మగిల్లేలా వర్ణించాడు.



అనుకోకుండా రాజ్యవర్ధనుడి కళ్ల వెంట కూడ నీళ్ళు కారాయి. వెంటనే సభ నుండి అంతఃపురానికి వెళ్ళిపోయాడు. వారం రోజులపాటు మహారాజుని ఆ కావ్యంలోని విషయాలు వెంటాడాయి.

ఆందోళనగా వున్న రాజును చూసి మంత్రి కారణం అడిగాడు. రాజ్యవర్ధనుడు తనలోని ఆందోళనకు గల కారణాన్ని మంత్రితో పంచుకున్నాడు.

"ప్రభూ! ఆ కవి ప్రతిభను ఏమని చెప్పను? నాకూ కళ్ల వెంట నీళ్ళు వచ్చాయి. ఆలోచిస్తే యుద్ధంలో విజయాలే కాదు, విషాదాలూ వుంటాయి. అలా అని విజయాలూ శాశ్వతం కాదు. అపజయాలు ఎప్పుడో ఒకప్పుడు ఎదురవుతాయి. అప్పుడు విజయాల వల్ల పొందిన ఆనందం అంతా ఆవిరి అయిపోతుంది. అందుకని యుద్ధం కన్నా శాంతిని కోరుకుంటే అందులో శాశ్వతమైన ఆనందం లభిస్తుంది. అందరికీ చెరగని సుఖసంతోషాలు లభిస్తాయి" అన్నాడు మంత్రి.

మంత్రి మాటలు రాజ్యవర్ధనుడిని ఆలోచింప చేశాయి. ఆ తరవాత తనలో మార్పునకు కారణమైన కవిని ఘనంగా సన్మానించాడు. ఆయన సమాజానికి మేలుచేసే కావ్యాలను రాయించాడు. శాంతికి ప్రాధాన్యతనిస్తూ ప్రజలకు మంచి పాలనను అందించి చరిత్రలో నిలిచిపోయాడు రాజ్యవర్ధనుడు.

- డా. గంగిశెట్టి శివకుమార్

## దారి చూపండి




## రంగులు వేయండి



## పదాల పజిల్

ఇక్కడున్న పండ్లు ఆంగ్లంలో పజిల్‌లో ఎక్కడున్నాయో వెతకండి.



| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| C | O | C | O | N | U | T | X | P | M |
| B | P | A | P | A | Y | A | Z | O | A |
| K | A | V | O | C | A | D | O | M | N |
| I | P | N | O | R | A | N | G | E | G |
| W | P | F | A | G | M | A | N | G | O |
| I | L | S | Q | N | U | W | Y | R | S |
| P | E | A | R | L | A | Z | F | A | T |
| P | E | R | S | I | M | M | O | N | E |
| W | D | Q | Z | G | U | A | V | A | E |
| O | Z | A | P | R | I | C | O | T | N |
| P | I | N | E | A | P | P | L | E | R |





# అల్లరి
ALLARI



## చెప్పుకోండి

- ప్రాణం లేని చిన్నపాప. అరిచి అరిచి పిలుస్తుంది. ఎత్తుకుంటే.. చెవిలో గుసగుసలు చెబుతుంది?
  - టెలిఫోన్
- చక్కగా పెట్టడానికి వీలవుతుంది. తీయటానికి పోతే చెరిగి పోతుంది?
  - ముగ్గు
- గడ్డి తినదు, కుడితి తాగదు. కానీ, కుండెడు పాలు ఇస్తుంది?
  - తాటి చెట్టు

## పెద్దల మాట



వినయం, శీలం లేని విద్యావంతుడు.. పశువు కంటే ప్రమాదకరం.
- డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్

## దారి కనిపెట్టు



పైన స్కేటింగ్ చేస్తున్న అమ్మాయి.. తన ఇంటికి చేరే దారి చూపండి.

## టంగ్ ట్విస్టర్స్

If two witches would watch two watches,
which witch would watch which watch?

## మీకు తెలుసా?



సాధారణంగా చేపలు నీటిలోనే ఈదుతాయి. కొన్ని మాత్రం నేలపైన కొద్దిదూరం నడుస్తాయి. కానీ, గార్నె అనేరకం చేపలు మాత్రం.. నీటిలో ఈదడం, నేలపై నడవడంతోపాటు గాలిలోనూ ఎగురుతాయి. వీటిలోని మొప్పలే.. కాలక్రమంలో రెక్కల్లా రూపాంతరం చెందాయి. వాటి సాయంతో గంటకు 35 మైళ్లకు పైగా వేగంతో నీటి నుండి పైకి దూసుకెళ్తాయి. దాదాపు 650 అడుగుల దూరం వరకూ గ్లయిడ్ చేస్తాయి. వేటాడే జంతువుల నుంచి తప్పించుకోడానికే ఇవి ఇలా గాలిలో ఎగురుతాయి.

## మంచి మనసు

... సంగనభట్ల చిన్న రామకిష్టయ్య

**నరసింహపురంలో** రాము ఐదో తరగతి చదువుతున్నాడు. అతనికి ఆపిల్ పండు అంటే చాలా ఇష్టం. అతని తల్లిదండ్రులు చాలా పేదవారు. రాము ప్రతిరోజూ తనకు ఆపిల్ పండు కొనిమ్మని మారాం చేసేవాడు. అతని మారాం భరించలేక.. మర్నాడు తప్పకుండా కొనిస్తానని తల్లి అతణ్ని బుజ్జగించి బడికి పంపేది. ఒకరోజు రాము.. 'ఈరోజు ఆపిల్ పండు తినందే నేను బడికి పోను!' అంటూ భీష్మించుకుని కూర్చున్నాడు. దాంతో తల్లికి విధిలేక పక్కింటి వాళ్లను డబ్బు చేబదులు అడిగి.. రాముకు ఆపిల్ పండు కొనిచ్చింది. దాంతో రాము ఆ పండు తీసుకొని అక్కడి నుంచి పరిగెత్తుకుంటూ వెళ్లాడు. ఇంటికి వచ్చిన రామును.. 'బాబూ! ఆపిల్ పండు తిన్నావా! నీ కోరిక తీరిందా!' అని అడిగింది. అప్పుడు రాము.. 'లేదమ్మా! నేను తినలేదు. అది నా మిత్రుడు గోపికి ఇచ్చాను' అని చెప్పాడు. 'అదేంటిరా! నువ్వు మారాం చేస్తే.. నా దగ్గర డబ్బు లేకున్నా పక్కింటివాళ్లను అడిగిమరీ నీకు కొనిచ్చాను. నువ్వు వాడికెందుకు ఇచ్చావు రా!' అని కోప్పడ్డది అమ్మ. దానికి రాము.. 'అమ్మా! వాడికి జ్వరం వచ్చింది. పాపం.. నిన్నటి నుండి ఏమీ తినలేదు. వాడు తినకపోతే నాకు చాలా బాధగా అనిపించింది. నేను ఇంట్లో అన్నం తిన్నానుగా! ఇక నిన్ను ఆపిల్ పండు కొనిమ్మని మరెప్పుడూ అడగనులే!' అని అన్నాడు రాము. అది విన్న తల్లి.. 'నా బాబే! నా బాబే! నీదెంత మంచి మనసు రా! నీ మిత్రుని కోసం మారాం చేసావన్నమాట. నూరేళ్లు వర్ధిల్లు నాయనా! అందరికీ సాయం చేసి మంచిపేరు సంపాదించుకో!' అని అన్నది. 'అలాగే నమ్మా!' అన్నాడు రాము.. బడికి ఉత్సాహంగా తయారవుతూ!





బొమ్మల ఆధారంగా ఖాళీలను పూరించండి.

## పద్యం - భావం

స్థానము తప్పివచ్చునెడఁ దానెటువంటి బలాఢ్యుడున్ నిజ
స్థానికుడైన యల్పుని కతంబుననైనను మోసపోవుగా
కానలలోపలన్ వెడలి గందగజం బొకనాఁడు నీటిలో
గానక చొచ్చినన్ మొసలికాటున లోఁబడ దోటు భాస్కరా!

**తాత్పర్యం:** మదించిన ఏనుగు.. అడవిని వదిలిపెట్టి నీటిలోకి వచ్చినందుకు మొసలికి లొంగిపోయింది. అలాగే మనిషి కూడా ఎంత బలవంతుడైనా.. తన స్థానాన్ని విడిచి, వేరే ప్రాంతానికి వెళ్లినప్పుడు బలం తగ్గుతుంది.



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి



పూర్తిగా మనకు సంబంధించిన విషయం.
☛ కన్ఫ్యూషియస్





కథ

# మూఢనమ్మకం



మెట్పల్లి అనే గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో ఐదవ తరగతి చదువుతున్నాడు భువన్. భువన్ కొంచెం పిరికివాడు. కుక్కలను చూస్తే భయం. బల్లులంటే భయం. రాత్రయితే చాలు, చచ్చేంత భయం. ఎందుకంటే రాత్రి దయ్యాలు నిద్రలేస్తాయని, అటూ ఇటూ తిరుగుతాయని వాళ్ల నానమ్మ చెప్పింది. వాళ్ల నాన్నకు దయ్యాలు కనపడ్డాయట. ఈ విషయం భువన్‌కి చెప్పినప్పటి నుంచి తాను రాత్రి టాయిలెట్‌కి కూడా వెళ్లటంలేదు. చలికాలం వస్తేచాలు దుప్పట్లు తడుపుతున్నాడు. ఈ సమస్య రానురాను పెద్దగా మారింది. ఏం చేయాలో తోచక తలపట్టుకున్నాడు భువన్ తండ్రి మల్లేష్.

రోజులాగే ఆరోజు కూడా భువన్ లేటుగా బడికి వచ్చాడు. భువన్ వెనుకే మెల్లగా గదిలోకి చేరాడు మల్లేష్. ప్రేమగా పలకరించాడు ఉపాధ్యాయుడు చందు. కుశలప్రశ్నలు ముగిశాయి. భువన్ గురించి టీచర్ అడిగేలోపే తానే చెప్పటం ప్రారంభించాడు మల్లేష్. మొత్తం విన్నతరువాత భువన్‌సమస్య ఏమిటో ఉపాధ్యాయునికి అర్థమయ్యింది. ఈ విషయం పిల్లల ముందు మాట్లాడటం సరికాదని బయటికి తీసుకెళ్లాడు చందు.

ఈ సమస్యకు మూలం నువ్వే అని చెప్పటంతో అవాక్కయ్యాడు మల్లేష్. 'పిల్లవానికి లేని దయ్యాల గురించి చెప్పి రాత్రి పడితే చాలు భయపడేలా చేసింది నువ్వే. ఇప్పుడు అదే పెద్ద సమస్యగా మారింది' అన్నాడు టీచర్. 'లేదు సర్. నేను నిజంగానే దయ్యాలు చూశాను' అన్నాడు మల్లేష్. ఇప్పుడు ఆశ్చర్యపడటం టీచర్ వంతయింది. తాను స్మశానంలో దయ్యాలు రాజేసేమంటలు చూశానని, దయ్యాలున్నాయని చెప్పాడు మల్లేష్.

మారాల్సింది భువన్ మాత్రమే కాదు అతని తండ్రి కూడా అని అనుకున్నాడు చందు. భువన్ మామూలు పిల్లవానిగా మారాలంటే ఏం చేయాలో చెప్పాడు. ఇష్టం లేకున్నా కొడుకు మారుతాడన్న ఆశతో ఒప్పుకున్నాడు.

ఉపాధ్యాయుడు చందుది మెట్పల్లి పక్క ఊరే. ముందే అనుకున్నట్టు రెండు రోజుల తరువాత రాత్రి ఎనిమిదిగంటలకు మల్లేష్ ఇంటికి వచ్చాడు టీచర్. ముందే చెప్పటం వల్ల అప్పటికే మల్లేష్ ఇంటిదగ్గర కొందరు విద్యార్థులు, ఊరి పెద్దలు ఎదురుచూస్తున్నారు. అందరినీ తీసుకొని సూటిగా స్మశానం బాటపట్టాడు చందు. స్మశానం దగ్గరికి వెళ్లేసరికి అక్కడక్కడ మంటలు కనిపిస్తున్నాయి. నిజానికి ఆరోజు ఎవరూ చనిపోలేదు. ఎవరినీ దహనం చేయలేదు. 'ఆ మంటలు దయ్యం పనే' అన్నాడు మల్లేష్.

అతని భుజంమీద ప్రేమగా చెయ్యివేసి నవ్వాడు చందు. చందు తప్ప మిగిలిన వాళ్లంతా భయం భయంగా నడుస్తున్నారు. మంటల దగ్గరగా వెళ్లారు. మండుతున్నవి బొక్కలు.'చూశారా! ఇది దయ్యం పనికాదు. ఫాస్పరస్ అదే భాస్వరం పని' అన్నాడు నవ్వుతూ చందు.

అర్థం కానట్టు మొహాలు పెట్టారందరు.'పూడ్చిపెట్టిన శవాల తాలూకు బొక్కలు బయటపడినప్పుడు అందులోని ఫాస్పరస్ గాలి లోని ఆక్సిజన్‌తో చర్యజరిపి మండుతుంది' నిప్పులాంటి నిజాన్ని బయటపెట్టాడు చందు.'అవును నాన్న. నిన్న మా చందు సారు ఇదే పాఠం చెప్పాడు. ట్యాబులో పాస్పరస్ మండే వీడియోలు చూపించాడు. మేము అగ్గిపుల్ల గీకి ఫాస్పరస్‌ను మండించాము కూడా' అన్నాడు వెలుగుతున్న కళ్లతో భువన్.

భువన్ అలా ధైర్యంగా మాట్లాడుతుంటే మల్లేష్‌కు ఎంతో ధైర్యంగా అనిపించింది.'గింత సిన్న ముచ్చట తెల్వక అరవై ఏళ్ల సంది దయ్యం అని భయపడితి, చల్ దయ్యాలు లేవ్ గియ్యాలు లేవ్' అని తల గోక్కుంటూ అన్నాడు భువన్ తాత ఎల్లయ్య. ఆయన మాటతోని అందరూ బిగ్గరగా నవ్వారు. అప్పటిదాకా రాత్రయితే చాలు స్మశానం దిక్కే రావటానికి భయపడిన జనాలు ఇప్పుడు అక్కడే మాట్లాడుకుంటున్నారు.




ఈ మార్పు భలే అనిపించింది అక్కడికి వచ్చినవాళ్లకు. ఉపాధ్యాయుని వైపు కృతజ్ఞతగా చూశారందరు. 'ఇప్పటికైనా పిల్లలకు లేనిపోని భయాలు నూరిపోసివాళ్లను పిరికివాళ్లుగా మార్చకండి. ఈ ప్రకృతిలో ఎన్నో వింతలు, విశేషాలు జరుగుతుంటాయి. వాటికి సైన్సు కచ్చితమైన సమాధానాలు చెప్తుంది. మూఢనమ్మకాల జోలికి వెళ్లకండి. పిల్లలను స్వేచ్ఛగా ఎదగనివ్వండి' అంటూ అక్కడివాళ్లను ఉద్దేశించి చెప్పాడు ఉపాధ్యాయుడు. ఆ సమయంలో వాళ్లంతా చిన్నపిల్లలై పోయారు.

తెల్లారింది. తండ్రి తోడు లేకుండానే బడికి వచ్చాడు భువన్. మునపటిలా కాకుండా హుషారుగా, ఏదో విజయం సాధించిన వాడిలా ఉన్నాడు. చందు పలకరించాడు. 'నేను నిన్న రాత్రి ఒక్కడినే పెరట్లో ఉన్న బాత్రూమ్‌కి వెళ్లాను సార్. మా ఇంటి పక్కనే అరవింద్ ఉన్నాడు కదా. హోమ్‌వర్క్ కోసం ఒక్కడినే వాళ్లింటికి వెళ్లాను. ఇప్పుడు రాత్రంటే నాకు భయంలేదు సార్' అని గర్వంగా చెప్పాడు టీచర్ అడక్కుండానే. చందు ప్రేమగా భువన్ భుజం తట్టాడు.

తోకల రాజేశం, 9676761415

దారి కనుక్కోండి!
పైనున్న కోతి



ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి

సూర్య
21.6.2026



## బాలల కథ


# జ్ఞానానికి అవమానం

స్కూల్ ఆఖరి పని దినం. పదేళ్ల వంశీ ఉత్సాహంగా ఇంటికి వచ్చాడు. తన స్నేహితులతో కలిసి పాత నోటు పుస్తకాలను ముక్కలు ముక్కలుగా చించి, గాలిలోకి విసురుతూ చిందులు వేస్తున్నాడు. ఆ కాగితపు ముక్కలన్నీ వీధిలో చెత్తలా పేరుకుపోయాయి. ఇది చూసిన తన తాతయ్య వంశీని దగ్గరకు పిలిచారు.

"వంశీ! ఏమిటా పని? పుస్తకాలను ఎందుకు అలా చేస్తున్నావు?" అని నెమ్మదిగా అడిగారు.

"తాతయ్యా, పరీక్షలు అయిపోయాయి కదా! ఇక ఈ పాత పుస్తకాలతో పనేముంది? అందుకే ఇలా సెలబ్రేట్ చేసుకుంటున్నాను.





వ వా

ఫ్రెండ్స్ అందరూ ఇలాగే చేస్తున్నారు" అన్నాడు వంశీ గర్వంగా.

తాతయ్య గారు నిట్టూర్చి, "ఒక్క నిమిషం ఆలోచించు నాన్నా! నువ్వు చించి పారేసింది కేవలం కాగితాలను కాదు, నువ్వు ఏడాది కాలం నేర్చుకున్న జ్ఞానాన్ని. మనకు విద్యాబుద్ధులు నేర్పిన పుస్తకాలు సరస్వతీ స్వరూపాలు. వాటిని ఇలా వీధిలో వేసి తొక్కించడం అగౌరవం. పైగా, ఈ కాగితాల కోసం ఎన్ని చెట్లను నరికి ఉంటారో తెలుసా?"

వంశీ మౌనంగా వినసాగాడు. తాతయ్య కొనసాగిస్తూ, "ఈ పుస్తకాలను భద్రపరిస్తే నీ తర్వాతి తరగతి వారికి రిఫరెన్స్‌గా ఉంటాయి, లేదా పేద పిల్లలకు ఇస్తే వాళ్ళ భవిష్యత్తు మారుతుంది. చదువు అయిపోగానే పుస్తకాలను శత్రువుల్లా చూడటం సంస్కారం అనిపించుకోదు. పైగా ఇలా చేయడం వల్ల నీపట్ల, నీకు చదువు నేర్పిన గురువులపట్ల, నువ్వు చదువుకున్న విద్యాసంస్థపట్ల ప్రజల దృష్టిలో చులకన భావం ఏర్పడుతుంది" అన్నారు.

తాతయ్య మాటల్లోని అర్థం తెలుసుకున్న వంశీకి తన తప్పు తెలిసొచ్చింది. వెంటనే వీధిలోకి వెళ్లి తాను చించివేసిన కాగితపు ముక్కలన్నీ ఏరి చెత్తబుట్టలో వేశాడు. "ఇకపై పుస్తకాలను గౌరవిస్తాను తాతయ్యా!" అని పట్టుదలతో చెప్పాడు.

నీతి: పుస్తకాలు చించివేసే వస్తువులు కావు, జీవితాన్ని తీర్చిదిద్దే జ్ఞాన భాండాగారాలు.

**వల్లా వెంకట రామారావు.**
**9949043019**

ఆదివారం అనుబంధాల్లోని అన్ని కథలు వాట్సప్ ద్వారా ప్రతివారం కావాలనుకునేవారు 99594 88088 నంబరుకు మెసేజీ పెట్టండి




# దానగుణం

నాలుగవ తరగతి చదువుతున్న మన్వంత్‌ను రోజు తండ్రి ఆకాశ్ స్కూల్లో దింపుతాడు. స్కూలుకు వెళ్తున్నంతసేపూ దారిలో రోడ్డుకు ఇరుపక్కల కనిపించే దృశ్యాలను చూస్తూ వెళుతుంటాడు మన్వంత్.

ఓ రోజున అతని దృష్టి రోడ్డు పక్కన ఉన్న రాతి దిమ్మపై కూచుని అడుకుంటున్న ముసలి బిచ్చగానిపై పడింది.

అతను చినిగిన చొక్కా వేసుకుని చింపిరి జుట్టుతో చేతిలో అడుక్కునే బొచ్చెతో ఎలాగో కనిపించాడు మన్వంత్‌కు. ఇక ఆ రోజున అదే దృశ్యం స్కూలుకు వెళ్ళినా ఇంటికి వచ్చినా కళ్ళముందు కనిపిస్తున్నట్టు అనిపించింది ఎలాగో తెల్లారింది. మళ్ళీ స్కూల్‌కు రెడీ అవుతున్నాడు తల్లి సమీర లంచ్ బాక్స్ రెడీ చేస్తుంటే అక్కడికి వచ్చాడు.



“అమ్మా! ఈ రోజు నాకు లంచ్ బాక్స్‌లో అన్నం తినడానికి బాక్స్ నిండా పెట్టు” అన్నాడు. సమీరకు ఆశ్చర్యం అనిపించింది. రోజు “నువ్వు పెట్టింది తినలేకపోతున్నాను కొంచెమే పెట్టు బాక్స్‌లో.. అనేవాడు. ఇవ్వాలేంటి ఇలా అడుగుతున్నాడు.. అనుకుంటూనే సరేలే తింటాడేమో!” అనుకుని బాక్స్ నిండా పెట్టి ఇచ్చింది.

స్కూలుకు వెళ్తూ ఆ బిచ్చగాడు ఉన్న చోటికి రాగానే “కారు ఆపండి నాన్నా!” అంటూ బిగ్గరగా అన్నాడు. “ఏంటి మన్వంత్ ఎందుకు కారాపమన్నావు?” అన్నాడు కారు ఆపుతూ ఆకాశ్. “ఇప్పుడే వస్తా!” అంటూ కారు దిగి ఆ బిచ్చగాడి దగ్గరకు వెళ్ళి తన లంచ్ బాక్స్ తెరిచి తనకు తినడానికి కావలసినంత ఉంచుకుని మిగతాదంతా అతని బొచ్చెలో వేసాడు “తాతా! నేను రోజు ఇలానే వెళ్తాను. స్కూలుకు వెళ్ళేప్పుడు, తినడానికి రోజు నీకు అన్నం తెచ్చిస్తాను సరేనా?” అన్నాడు.

ఆ మాటల్ని విన్న బిచ్చగాడు “సుఖంగా ఉండు బాబు” అంటూ దీవించాడు. ఇదంతా కారులో నుండి విస్తుపోయి చూడసాగాడు ఆకాశ్. మళ్ళీ వచ్చి కారులో కూర్చుంటున్న మన్వంత్‌తో “నువ్వు తినాల్సినది అలా ఆ అడుక్కునే అతనికి ఎందుకు ఇచ్చావు?” అన్నాడు.

అప్పుడు మన్వంత్ “ నాన్నా! నాకు రోజు ఎక్కువయి పోతోంది బాక్స్ లో తినడానికి పెట్టేది నేను తిన్నాక పారేస్తున్నాను. మా టీచర్ ఓ రోజున క్లాస్‌లో తినే ఆహారాన్ని వృథాగా పారేయకూడదు ఆకలితో బాధపడేవాళ్ళు ఉంటారు. అటువంటి వాళ్లకు పెట్టినా ఆహారం సద్వినియోగం చేసినట్టవుతుంది” అని అన్నారు. అంతేకాదు.. “మీకు చిన్ననాటి నుండే దానగుణం అలవాటు అవుతుంది” అని అన్నారు. అందుకే ఆ తాతకు ఇచ్చాను నా వరకు తినడానికి ఉంచుకొని” అన్నాడు. “నీ చిన్న బుర్రకు ఎంత మంచి ఆలోచన వచ్చిందిరా“ అంటూ అభినందించాడు ఆకాశ్ కారు స్టార్ట్ చేస్తూ.

– పి.జ్యోతి

కె.వి.లక్ష్మణరావు
9014659041

బాల కథ

# అమ్మ చెప్పింది

వేసవి సెలవులు పూర్తయ్యాయి. బడులు తెరుచుకుంటున్నాయి. అజయ్ మూడో తరగతి నుండి నాలుగో తరగతికి వచ్చాడు.

'అజయ్! రేపటి నుండీ నువ్వు బడికి వెళ్ళాలి` అమ్మ చెప్పింది.

ఈ వేసవి సెలవుల్లో అమ్మ చేతి గోరుముద్దలు తింటూ, రోజూ అమ్మ చెప్పే కమ్మని కథలను వింటూ, సాయంత్రం వేళల్లో ఇరుగుపొరుగు స్నేహితులతో దాగుడు మూతలు, కబడ్డీ ఆటలు ఆడుకుంటూ హాయిగా, ఆనందంగా గడిపేశాడు.

'అప్పుడే సెలవులు అయిపోయాయా?.... ప్చ్!` అనుకుంటూ నిట్టూర్చాడు.

'బడికి వెడితే, పగలంతా బడిలోనే ఉండాలి. టీచర్ చెప్పే పాఠాలు వినాలి. ఇంటికి వచ్చి హోమ్ వర్కులు చేయాలి. సెలవుల్లో ఈ బాధలుండవు` మనసులో అనుకున్నాడు. మొదటిరోజు రానే వచ్చింది.

'అజయ్ త్వరగా స్నానం చేసి రెడీగా. బడికి వెళ్ళాలి' అమ్మ నిద్ర లేపుతూంది.

అజయ్ అమ్మ చెప్పినట్లుగా రెడీ కాగానే, అమ్మ వద్దకు వచ్చాడు.

'అమ్మా....` అంటూ పిలిచాడు.

'పుస్తకాల సంచీ పట్టుకోలేదే? మొదటి రోజు కదాని మర్చిపోయావా?` అమ్మ అజయ్ ను చూస్తూ అంది.

'కాదమ్మా... మరీ.. మరీ...`

'పూర్తిగా చెప్పరా. సందేహం దేనికి?` అమ్మ అంది.

'ఈ రోజు మొదటిరోజు కదమ్మా. పాఠాలు చెప్పరు. ఈ ఒక్కరోజూ ఆడుకుంటానమ్మా. రేపట్నుంచి మానకుండా బడికెళ్ళిపోతాను` బతిమాలే ధోరణిలో అడిగాడు.

'అజయ్ బతిమాలడంతో అమ్మ మెత్తబడింది. రేపట్నుంచి మాత్రం క్రమం తప్పకుండా బడికి వెళ్ళాలి` అంది.

'అలాగేనమ్మా` అంటూ అజయ్ హుషారుగా ఆడుకోవడానికి వెళ్ళిపోయాడు.

మరుసటిరోజు తెల్లారింది.

'అజయ్! త్వరగా లే. బడికి వెళ్ళాలి` అంటూ అమ్మ నిద్ర లేపింది.

'అమ్మో! ఈ రోజు బడికి వెళ్లనంటే అమ్మ ఊరుకోదు. ఇప్పుడెలా? అజయ్ నిద్ర లేస్తూనే అనుకున్నాడు.

కొంత సేపటికి అమ్మ దగ్గరకు వచ్చి, 'అమ్మా! ఈ రోజు శనివారం. రేపు ఆదివారం కనుక సెలవు. అందుకని ఈ రెండు రోజులూ ఆడుకుని, సోమవారం నుండి మాత్రం బడికి మానకుండా వెళ్ళిపోతానమ్మా` అలవాటుగా బతిమాలడసాగాడు.

'అజయ్! రేపు అంటే లేదుకు పర్యాయ పదం. వాయిదా అనేది బద్దకానికి నేస్తం.




నిన్న పోనీలే అని ఊరుకున్నాను. ఈ రోజు బడికి వెళ్లనంటే మాత్రం ఒప్పుకోను.` అమ్మ హెచ్చరింపుగా అంది.

'అమ్మా! ప్లీజ్, ఈ ఒక్కరోజే` అంటూ గదిలోకి దూరి మంచం ఎక్కాడు.

'మొండివాడు రాజు కన్నా బలవంతుడు. అజయ్ కు కథలంటే ఇష్టం కనుక, కథ చెప్పి వాడికి బడి మీద దృష్టి కలిగించాలి` అని అమ్మ మనసులో అనుకుంది.

'అజయ్! నీకో కథ చెప్పనా`

'క..థా.!.. చెప్పమ్మా` అంటూ అమ్మ వద్దకు వచ్చాడు.

'నీకు ఇష్టమైన ఫ్రెండ్స్ పేర్లు చెప్పు` అడిగింది.

'రాజు, రాము, సలీమ్` ఈ ముగ్గురంటే నాకు చాలా ఇష్టం` చెప్పాడు.

'అవునా, చిన్నప్పుడు నాకూ ఒక ఫ్రెండ్ ఉంది. పేరు లక్ష్మి. ఇద్దరమూ కలిసే బడికి వెళ్లేవాళ్ళం. కలిసి ఆడుకునేవాళ్ళం. చదువుకునే వాళ్ళం. లక్ష్మి నాకంటే బాగా చదివేది. పదో తరగతిలో జిల్లాకే ప్రథమస్థానం వచ్చింది. అప్పుడేమైందో, తెలుసా?` అంటూ అమ్మ ఒక్కసారిగా అజయ్ కేసి చూసింది.

'ఏమైందమ్మా? చెప్పమ్మా?`

అజయ్ ఆసక్తిని గమనించి అమ్మ చెప్పసాగింది.

'పదోతరగతి వరకూ చదివింది చాలును. ఆడపిల్లకు అంతకంటే చదువవసరం లేదు. పెళ్లీడురాగానే పెళ్లి చేసేస్తాను. అంతవరకూ ఇంట్లోనే బుద్ధిగా ఉంటూ, కుట్లు, అల్లికలు నేర్చుకో` అని లక్ష్మి వాళ్ళ నాన్న అన్నారు.

లక్ష్మి నాన్న మాటను ఎదిరించలేదు. కానీ చదువంటే చాలా ఇష్టం.

అందుకే 'నాన్నా! చదువయ్యాక నువ్వు చెప్పినట్లే తప్పకుండా పెళ్లి చేసుకుంటాను. అప్పటివరకూ నన్ను చదివించు నాన్నా` నెమ్మదిగా బతిమలాడింది లక్ష్మి.

'మరి లక్ష్మి ఆంటీ మాటను వాళ్ళ నాన్న విన్నారా?`

అజయ్ ఉత్సుకతకు అమ్మ ఆనందించింది.

'వినలేదు అజయ్! చదివించలేదు. లక్ష్మికి పెళ్లి చేసేసారు.

పెళ్ళయ్యాక బాధ్యతలు మీద పడటంతో లక్ష్మికి చదవడం సాగలేదు.

తాను చదవలేనందుకు బాధపడటం మానేసింది. తన పిల్లల్ని బాగా చదివించడానికి ప్రయత్నిస్తోంది. పిల్లల చదువులో తనను చూసుకుంటూ మురిసి పోవాలనుకుంటోంది.`

'ఇప్పుడు లక్ష్మి ఆంటీ ఎక్కడున్నారమ్మా?` అజయ్ ఆసక్తిగా అడిగాడు.

'ఆంటీని నీకు పరిచయం చేస్తాను. మరి రోజూ బడికి వెడతావా?` అమ్మ అడిగింది.

'ఓ! పిల్లలు బాగా చదవగానే సరిపోదు. పెద్దలు కూడా చదవడానికి సహకరించాలని ఆంటీ కథ ద్వారా తెలుసుకున్నాను. ఇంకెప్పుడూ బడి మానను` అన్న అజయ్ మాటలకు అమ్మ మురిసి పోయింది.

'అజయ్ నీకు ఇప్పుడే మా ఫ్రెండ్ లక్ష్మిని చూపిస్తాను పదఅం` టూ డ్రెస్సింగ్ టేబుల్ వద్దకు అజయ్ ను తీసుకెళ్లింది. ఎదురుగా అద్దం ముందు అజయ్ ను నిలబెట్టి,

'అద్దంలో నీ వెనుక లక్ష్మి నిలబడి ఉంది, చూడు` అంది.

వెంటనే అజయ్ ఆశ్చర్యపోతూ వెనక్కి తిరిగి, 'అమ్మా! లక్ష్మి ఆంటీ అంటే నువ్వేనా?` అన్నాడు.

'అవును అజయ్! నా పూర్తి పేరు సుధాలక్ష్మి. కానీ నన్నందరూ 'సుధా' అనే పిలుస్తారు` అంది నవ్వుతూ.

'అమ్మ చెప్పింది వింటాను. బడి మానకుండా చదువుకుంటాను` అన్నాడు అజయ్ ఆనందంగా.

'అజయ్ లో మార్పు మొదలైంది` అమ్మ అజయ్ కేసి మెచ్చుకోలుగా చూస్తూ చప్పట్లు కొట్టింది.



# అమ్మ

కమ్మనైన అమ్మ పాట
లోకంలో దేవత మాట
కమ్మనైన అమ్మ పాట
స్వచ్ఛమైన జోల పాట
గుడి లేని దేవత అమ్మ
అందరి గుండెల్లో ఉంటుంది అమ్మ
అమ్మ మనసు ఎంతో గొప్పది
అమ్మ ప్రేమ మధురమైనది
అమ్మ బతికేది నాకోసం
నేను తీర్చుకోలేని ఋణం అమ్మది

చిరుమువ్వలు

అమూల్య, 6వ తరగతి,
తెలంగాణ సాంఘిక సంక్షేమ
గురుకుల పాఠశాల,
చింతకుంట, కరీంనగర్.



# మేడం

పుస్తక పాఠాలు చెప్పే మేడం
మాకు అమ్మతో సమానం
మీరు ప్రేమతో కొట్టే దెబ్బలు
మాకు నేర్పును గుణపాఠాలు
మీరు చెప్పే మాటలు
మా జీవితానికి పూల బాటలు
మా జీవితాన్ని మార్చిన దైవం మీరు
మరువము మిమ్మల్ని ఏనాడు
మీరు పెట్టే పరీక్ష
అదే మాకు రక్ష
మీరు మెచ్చుకుంటే ఆనందపడతాం
మీరు తిడితే భయపడతాం
మీరు సరిదిద్దే మా తప్పులు
మా భావిజీవితపు వెలుగులు...

పి. సంకీర్తన
8వ తరగతి,
తెలంగాణ సాంఘిక సంక్షేమ
గురుకుల పాఠశాల,
చింతకుంట, కరీంనగర్ జిల్లా.

# 'గేదె' మన తల్లి!

హాయ్ నేస్తాలూ! మనకు స్కూల్లో తెలుగు పీరియడ్ అనగానే గుర్తొచ్చే కొన్ని రొటీన్ విషయాలు ఉన్నాయి కదా? వాటిలో మొదటిది—'ఆవు వ్యాసం'. "ఆవుకు నాలుగు కాళ్లు ఉంటాయి, రెండు కొమ్ములు ఉంటాయి, అది మనకు పాలు ఇస్తుంది, ఆవు మనకు తల్లి లాంటిది..." చిన్నప్పటి నుంచి మనమంతా ఇదే బట్టీ పట్టి రాస్తున్నాం. కానీ, రోజువారీ జీవితాన్ని కొంచెం శాస్త్రీయంగా పరిశీలిస్తే నాకో అనుమానం వచ్చింది. ఆ అనుమానాన్నే నా వ్యాసంలో రాస్తే మా తెలుగు టీచర్‌కు పాపం, కోపం వచ్చేసింది! ఇంతకీ నేనేం రాశానో తెలుసా?



నాకు ఆవు అంటే ఇష్టమే, కానీ మా ఇంట్లో ఉండే గేదె (బర్రె) అంటే ఇంకా ఎక్కువ ఇష్టం. ఎందుకంటే, గేదె ఇచ్చే పాలు చాలా చిక్కగా, రుచిగా ఉంటాయి. అందులో వెన్న శాతం ఎక్కువ, మనకు బలాన్నిచ్చే పోషకాలూ ఎక్కువే. అలాంటప్పుడు, అందరూ ఆవును మాత్రమే 'గోమాత' (తల్లి) అని ఎందుకు అంటారు? నాకైతే ఆవు మా 'పిన్ని' లాగా, నిత్యం మనల్ని పాలు ఇచ్చే గేదె మా 'కన్నతల్లి' లాగా కనిపిస్తుంది!" అని రాశాను.

నేస్తాలూ, ఒక సైన్స్ విద్యార్థిగా మనమంతా ఇలా ఆలోచించాలి. జీవశాస్త్రం ప్రకారం చూస్తే ఆవుకు ఉన్నట్లే గేదెకు కూడా రెండు కొమ్ములు, రెండు చెవులు, నాలుగు కాళ్లు ఉంటాయి. రెండూ మనకు పాలిచ్చే సాధు జంతువులే. మరి, ఎప్పుడూ ఆవు గురించే ఎందుకు వ్యాసం రాయాలి? గేదె గురించి ఎందుకు అడగరు?

కేవలం ఆవు తెల్లగా ఉందని దానికి ఎక్కువ మార్కులు ఇచ్చి, గేదె నల్లగా ఉందని దాన్ని పాఠ్యపుస్తకాల్లో కూడా వెనక్కి నెట్టేయడం ఎంతవరకు కరెక్ట్? రంగును బట్టి కాకుండా, అది మనకు ఇచ్చే మేలును బట్టి కదా మనం దేనికైనా విలువ ఇవ్వాలి! రూపం నల్లదైనా, గేదె ఇచ్చే పాలు తెల్లనివి, అమృతంతో సమానమైనవి. మన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని మూస పద్ధతిలో కాకుండా, కాస్త తార్కికంగా, శాస్త్రీయంగా ఆలోచించడం అలవాటు చేసుకుందాం. బాహ్య సౌందర్యం కంటే అంతర్గత గుణమే గొప్పదని నమ్మే నా ఈ వ్యాసం మీ అందరికీ నచ్చిందనే అనుకుంటున్నాను. మీరేమంటారు నేస్తాలూ?



- ప్రవళి వెలుగు
8వ తరగతి,
జెడ్పిహెచ్ఎస్,
బీర్పూర్,
జగిత్యాల జిల్లా,
తెలంగాణ.